


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 48 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 11 నవంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-



### తప్పు చేస్తున్న ఎమ్మెల్యేలను

# ఇన్‌ఛార్జి మంత్రులు దారిలో పెట్టాలి

- ప్రజల ఆస్తి వివాదాల్లో తలదూరుస్తున్న ఎమ్మెల్యేలు
- వారు రాజీ పడతామన్నా.. వీరు ససేమిరా అంటున్నారు
- ఒక ఎమ్మెల్యే విషయం తెలిసి.. గట్టిగా హెచ్చరించా
- ఏ పార్టీ ఎమ్మెల్యేలైనా తప్పు చేస్తే కఠినంగా వ్యవహరించండి
- మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రిని కోరిన పవన్ కల్యాణ్

వివరాలు 2లో..

# సరికొత్తగా 'వర్క్ స్పేస్'

- మండలానికో వర్క్‌స్పేస్ సెంటర్
- కనీసం 610 మంది పనిచేసేలా సదుపాయాలు, రోజంతా కరెంట్
- హైస్పీడ్ నెట్, వీసీ సౌకర్యం తప్పనిసరి
- సమావేశాలకు ప్రత్యేక గది, స్కానింగ్, ప్రింటింగ్, లాకర్ సౌకర్యం
- వర్క్‌స్పేస్ పాలసీకి క్యాబినెట్ ఆమోదం



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

సొంత ఊర్లోనే ఉంటూ ఐటీ ఉద్యోగం చేసుకునేందుకు వీలుగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ 'వర్క్‌స్పేస్' విధానాన్ని తీసుకువచ్చింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి మండల కేంద్రంలోనూ అతితక్కువ వ్యయంతోనే వర్తక, వాణిజ్య లావాదేవీలు చేపట్టేందుకు అనుకూలంగా తీసుకొచ్చిన ఈ పాలసీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని క్యాబినెట్ సోమవారం ఆమోదముద్ర వేసింది. ఐటీ రంగంలో విశేష అనుభవం ఉన్నా వర్తక, వాణిజ్య వ్యవహారాలకు సంబంధించిన అన్ని సదుపాయాలనూ సమకూర్చుకునే స్థోమత అందరిలోనూ ఉండదు. ప్రత్యేకంగా మారుమూల ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులో ఉండదు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపేలా ప్రతి మండలంలోనూ వర్క్‌స్పేస్ సదుపాయాన్ని కల్పించడం ద్వారా అందరికీ సమానావకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో వర్క్‌స్పేస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా వర్క్‌స్పేస్ సౌకర్యాలు కల్పించేవారికి ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తూ రాష్ట్ర ఐటీ శాఖ రూపొందించిన 'వర్క్‌స్పేస్' పాలసీని మంత్రి మండలి ఆమోదించింది. మండల స్థాయిలో వర్క్‌స్పేస్ కోసం కనిష్ఠంగా - మిగతా2లో

# ఢిల్లీలో భారీ పేలుడు

- ఎర్రకోట సమీపంలో పేలిన కారు
- 9 మంది మృతి 24 మందికి గాయాలు
- ముగ్గురు విషమం.. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం
- ఛిద్రమైన శరీరభాగాలతో ఘటనాస్థలి వద్ద భీతావహ దృశ్యాలు
- పేలుడు ధాటికి తీవ్రంగా దెబ్బతిన్న పలు వాహనాలు, దుకాణాలు
- పేలుడు సమయంలో కారులో ఉన్న ముగ్గురి మృతి
- ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా
- ఘటనాస్థలికి హోం మంత్రి షా
- స్మృతిలో క్షతగాత్రులకు పరామర్శ
- ఉగ్రకుట్ర కోణంలోనూ ఎన్ఐఏ దర్యాప్తు
- కారు కదలికలపై వివరాల కోసం సీసీటీవీ కెమెరాల జల్లెడ



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

దేశ రాజధాని ఢిల్లీ.. భారీ పేలుడుతో దద్దరిల్లింది! దేశంలోని అత్యంత హై ప్రొఫైల్ ప్రాంతాల్లో ఒకటి.. పంద్రాగస్టునాడు దేశ ప్రధాని జాతినుద్దేశించి ప్రసంగించే ఎర్రకోటకు సమీపంలో మెట్రోస్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం దాదాపు 7 గంటల సమయంలో కారు పేలి 9 మంది మరణించగా.. 24 మంది తీవ్రంగా గాయపడ్డారు! క్షతగాత్రులను హుటాహుటిన ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని.. గాయపడ్డవారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఢిల్లీకి కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న హరియాణాలోని ఫరీదాబాద్‌లో 2900 కిలోల బాంబు తయారీ పదార్థాలను పట్టుకున్న రోజునే.. అదీ హరియాణా రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉన్న కారులో పేలుడు జరగడంతో.. దీని వెనుక ఉగ్ర కుట్ర ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు, ఇతర కేంద్ర సంస్థల సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. పేలుడు ?తీవ్రతకు ఘటనాస్థలి వద్ద భీతావహ దృశ్యాలు - మిగతా6లో



### తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు

# సీనియర్లతో శిక్షణ

- పార్టీ లైన్‌ను అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారు
- తెదేపా మంత్రులతో అల్పాహార విందు భేటీలో లోకేశ్

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేల్లో కొందరు పార్టీ లైన్‌ను అర్థం చేసుకోవడంలో ఇబ్బంది పడుతున్నారని, కొన్ని పొరపాట్లు చేస్తున్నారని తెదేపా ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. సోమవారం ఉదయం మంత్రివర్గ సమావేశానికి ముందు.. ఆయన ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో తెదేపాకు చెందిన మంత్రులతో అల్పాహార విందు భేటీ నిర్వహించారు. తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు.. సీనియర్ - మిగతా2లో

# బూటు విసిరినట్లు వీడియో సృష్టించారు



- ఏఐతో హాని గురించి తెలుసు
- న్యాయవ్యవస్థలో వాదుకపై వాదనలు వింటాం: సీజేఐ
- న్యాయవ్యవస్థలో వాడే ఏఐలో డేటా నిష్పక్షపాతంగా ఉండాలి
- దానిలో భాగస్వాములైనవారికి జవాబుదారీతనం నిర్ణయించాలి

6



### బిహార్లో నేడే

# తుది పోరు

- 122 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్
- 3.7 కోట్ల మంది ఓటర్ల చేతిలో 1,302 మంది అభ్యర్థుల భవిత
- 1.75 కోట్ల మంది మహిళా ఓటర్లు
- నవయువ ఓటర్లు 7.69 లక్షలు
- బరిలో పలువురు మంత్రులు
- ఈ నెల 14న ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడి



# భారీ ఉగ్ర కుట్ర భగ్నం

- వైద్యుల ముసుగులో విధ్వంస రచన
- వైట్‌కాలర్ ఉగ్రనెట్‌వర్క్ గుట్టురట్టు
- ఒకే చోట 2,913 కేజీల పేలుడు పదార్థాలు స్వాధీనం
- ముగ్గురు వైద్యులు సహా ఎనిమిది మంది అరెస్ట్
- వైద్యరంగంలోని వ్యక్తులపైనా ఉగ్రభావజాలాన్ని రుద్దుతున్న ముష్కరులు
- నిషేధిత జైషే మొహమ్మద్, అన్సార్ ఘజ్వాత్-ఉల్-హింద్ ఉగ్రసంస్థలతో సంబంధాలు
- మూడు రాష్ట్రాల ఉగ్రమాడ్యూల్‌ను ఛేదించిన పోలీసుల బృందం

6

# తప్పు చేస్తున్న ఎమ్మెల్యేలను ఇన్‌ఛార్జి మంత్రులు దారిలో పెట్టాలి

అమరావతి

కొందరు ఎమ్మెల్యేలు ప్రజల వ్యక్తిగత, ఆస్తి వివాదాల్లో తలదూరుస్తున్నారని, బెదిరిస్తున్నారని, తప్పులు చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావించారు. ఏదైనా వివాదంలో ఇరుపక్షాలు రాజీకి సిద్ధమైనా.. ఎమ్మెల్యేలు వారిని రాజీ పడనివ్వడం లేదని పేర్కొన్నారు. ఒక ఎమ్మెల్యే వ్యవహారం తన దృష్టికి వస్తే, తీరుమారాలని హెచ్చరించానని చెప్పారు. కూటమిలోని ఏ పార్టీ ఎమ్మెల్యేలు తప్పుచేసినా కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన కోరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఇన్‌ఛార్జి మంత్రులు చొరవ తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పినప్పుడు.. పవన్ కల్యాణ్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. ఎమ్మెల్యేలు తప్పులు చేస్తే ఉపేక్షించవద్దని కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీచేయాలని ఆయన సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధికారులూ చొరవ తీసుకోవట్లేదని, తనకు వస్తున్న అర్జీల్లోనూ 60–70% అవేనని తెలిపారు. ప్రజల ఆస్తుల వ్యవహారాల్లో ప్రభుత్వం స్పందించకపోతే చులకనవుతామని పవన్ పేర్కొన్నారు. దానిపై సీఎం స్పందిస్తూ... ఎమ్మెల్యేలు తప్పులు చేస్తే వారిని గాడిలో పెట్టాల్సిన బాధ్యత ఇన్‌ఛార్జి మంత్రులదేనని తెలిపారు. "ఎమ్మెల్యేల పనితీరు మారాలి. లేకపోతే గత ఎన్నికల్లో 50 వేలకుపైగా మెజార్టీలు వచ్చిన వారికి వచ్చే ఎన్నికల్లో 10వేల మెజార్టీ కూడా రాకపోవచ్చు" అని సీఎం వ్యాఖ్యానించారు. ఇన్‌ఛార్జి మంత్రులు చొరవ తీసుకుని రెవెన్యూ సమస్యల్ని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అనంతపురం జిల్లాలో కలెక్టర్, జేసీ, ఆర్డీవో, తహసీల్దారులంతా కూర్చుని, ఒకేసారి 400 సమస్యల్ని పరిష్కరించారని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ చెప్పడంతో అలాంటి మంచి అలవాట్లను అనుసరించేలా రాష్ట్రమంతా ఆదేశాలు జారీచేద్దామని సీసీఎల్ఏకు సీఎం సూచించారు.

**పొలిటికల్ గవర్నెన్స్ అర్థం మార్చేశారు**

పొలిటికల్ గవర్నెన్స్‌కి ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి ఒక విస్తృతార్థంలో చెబుతుంటే.. కొందరు అధికారులు దాన్ని వారికి అనుకూలంగా మార్చుకుంటున్నారని పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. ప్రజలు ఏ చిన్నపని కోసం వారివద్దకు వెళ్లినా.. స్థానిక ఎమ్మెల్యే, నాయకులు చెబితేనే చేస్తామంటున్నారని, దాంతో ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని ఆయన పేర్కొన్నారు.

**ఎంత కష్టపడుతున్నామో యువతకు తెలియాలి**

రాష్ట్ర ప్రభుత్వం యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎంతగా కష్టపడుతోందో వారికి తెలియాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న పెట్టుబడిదారుల సదస్సుపై యువతకు అవగాహన కల్పించాలని, అక్కడ జరిగే కార్యక్రమాల ప్రత్యక్ష ప్రసారాల్ని పాఠశాలల్లోనూ అందుబాటులోకి తెద్దామని తెలిపారు. ఈ సదస్సు వల్ల ఎంత పెట్టుబడులు, ఎన్ని ఉద్యోగాలు వస్తాయన్న అంశం యువతకు తెలియాలని, ఈ విషయంలో మంత్రులు చొరవ తీసుకోవాలని సూచించారు.

**జనసేన కార్యాలయాలకు స్థలాలు కేటాయించాలని కోరిన దుర్గేష్**

జిల్లాల్లో జనసేన పార్టీ కార్యాలయాలకు స్థలాలు కేటాయించాలని మంత్రి కందుల దుర్గేష్ కోరారు. దానిపై సీఎం స్పందిస్తూ 45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా తెదేపాకు అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు నిర్మించుకోలేకపోయామన్నారు. జనసేన పార్టీ కార్యాలయాల నిర్మాణానికి ప్లాన్ చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో భాజపా నాయకుల్ని అభినందించాలని, వారు పార్టీ కార్యాలయాల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ పెడతారని ఆయన పేర్కొన్నారు.

**ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా పుట్టపర్తి**

ఈ నెల 23న శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్ని ఘనంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, వివిధ రాష్ట్రాల గవర్నర్లు, కేంద్రమంత్రులు వస్తున్నందున ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పుట్టపర్తిని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

**పెద్దిరెడ్డి ఆక్రమించిన భూముల వీడియో తీశానన్న పవన్**

పవన్ కల్యాణ్ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో అటవీ ప్రాంతాల్లో పర్యటించి, ఎర్రచందనం నిల్వల్ని పరిశీలించడంపై ముఖ్యమంత్రి ఆయనకు అభినందనలు తెలియజేశారు. తన పర్యటన అనుభవాల్ని పవన్ కల్యాణ్ వివరించారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆక్రమించిన అటవీ భూముల వీడియోలు తీశానని, వాటిని త్వరలో విడుదల చేస్తానని పవన్ పేర్కొన్నారు. గోడౌన్లలో ఎర్రచందనం దుంగల్ని జాగ్రత్తగా కాపాడుతున్నారని, లోపలికి వెళు తుంటే.. ఏదో బ్యాంకులోకి వెళుతున్న అనుభూతి కలిగిందని ఆయన తెలిపారు. ఆ దుంగలతో అలంకరణ వస్తువుల్లాంటి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారుచేసి, విక్రయించేందుకు ఉన్న అవకాశాల్ని పరిశీలించాలని సీఎం సూచించారు.

# ‘పవర్’పై ప్రైవేటు పెత్తనం

అమరావతి

ఉద్యోగుల బదిలీల్లో కొందరు, ఉన్నత పదవుల నియామకాల్లో మరికొందరు అందినంత దోపిడీ.. కాంట్రాక్టుల్లో ఇంకొందరు భారీగా కమీషన్లు వసూలు...! కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర్నుంచి విద్యుత్ సంస్థలను దోచుకుంటున్న తీరు ఇది...! ఈ దందాలో అనేకమంది అనేక విధాల ప్రయత్నాలు... వీరిలో రాజకీయ నేతలు, ఉన్నుతాధికారులతో పాటు ప్రైవేటు సంస్థలు, వ్యక్తులు కూడా ఉన్నారు..! తాజాగా ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లలో ఓ ప్రైవేటు సంస్థ ప్రతినిధి అన్నీ తానే అయి ఉన్నతాధికారులను శాసిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏకంగా అధికారిక సమీక్షల్లో నేరుగా పాల్గొంటూ, ప్రభుత్వంలోని కీలక నేత తాలూకా అని చెబుతూ హడలెత్తిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**పని కాకుంటే బదిలీనే బహుమానం...**

ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్)లో ఇటీవల జరిగిన ఓ అధికారిక సమీక్షలో ఉన్నతాధికారులతో పాటు ఓ వ్యక్తి దర్జాగా కూర్చున్నారు. ఆయనను చూసిన ఇతర అధికారులు, సిబ్బంది ఎవరో ఉన్నతాధికారి అని భ్రమపడ్డారు. కానీ, ఆయన ప్రైవేటు కన్సల్టెంట్ సంస్థ ప్రతినిధి. సీఎండీ కార్యాలయం నుంచి నేరుగా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనే స్థాయిలో విద్యుత్ సంస్థల్లో పవర్ పెంచుకున్నారు ఆ వ్యక్తి. ఇందుకోసం రాష్ట్రంలోని ఓ మంత్రి పేరును వాడుకుంటున్నాడని చెబుతున్నారు. ప్రస్తుతం ఆ మంత్రి చెప్పిందే అన్ని శాఖల్లో జరుగుతోంది. దీంతో ఆయన తాలూకా అని చెబుతున్న ప్రైవేటు వ్యక్తికి అధికారులు అంతే విలువ ఇస్తున్నారు. ఈ ఒక్క డిస్కంలోనే కాదు, మిగిలిన రెండు డిస్కంలలోనూ ఓ ప్రైవేట్ సంస్థ ప్రతినిధులే పెత్తనం చెలాయిస్తున్నారు. టెండర్ల తయారీ, ఒప్పంద పత్రాలను రూపొందించడం వంటివి ఈ సంస్థ చేతుల మీదుగానే జరుగుతోంది. దీనికి చెందిన ‘చౌదరి’ అనే వ్యక్తి వివిధ శాఖల్లో లాబీయింగ్ చేస్తూ పారిశ్రామికవేత్తలు, డిస్కంల ఉన్నతాధికారుల మధ్య వారధిగా వ్యవహరిస్తున్నారని సమాచారం. కొన్ని సందర్భాల్లో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించేలా ఉన్నతాధికారులను ఒత్తిడి చేస్తున్నాడని విమర్శలు వినిపిస్తున్నాయి. తమకు అనుకూలంగా టెండర్లు విడుదల చేయించేందుకు యత్నించడం, అది జరగకపోతే బదిలీ చేయిస్తామని బెదిరించడం అతడికి పరిపాటిగా మారిందని డిస్కం వర్గాలు అంటున్నాయి.

**ఆయన ఓ బ్యాంకు ఐటీ మాజీ ఉద్యోగి**

గతంలో చౌదరి ఓ బ్యాంకు ఐటీ విభాగంలో పనిచేశాుడని, అవినీతి ఆరోపణల వల్ల తొలగించాురని సమాచారం. ప్రస్తుతం విద్యుత్‌తో పాటు అనేక శాఖల్లో పెత్తునం చెలాయిస్తున్నాడు. ప్రైవేటు సంస్థకు చెందిన చౌదరి తెలంగాణలో ఉంటూ, ఏపీ డిస్కంలపై అజమాయిషీ చేస్తున్నాడు. రూ.50 లక్షల కాంట్రాక్టు నుంచి రూ.100 కోట్లపైగా ప్రతిదీ ఆయన కనుసన్నల్లోనే జరుగుతోందంటే పరిస్థితిని అర్థం చేసుకోముచ్చు.

**విజిలెన్స్ వెన్నువిరిచి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ సంస్థల్లో అక్రమాలను, అవినీతిని పసిగట్టి చర్యలు తీసుకునే ట్రాన్స్‌కో విజిలెన్స్ విభాగాన్ని నిర్వీర్యం చేసింది. మొక్కుబడి విభాగంగా మార్చేసింది. ఇప్పటికీ ఆ శాఖకు రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారి లేరు. ఒకవేళ విజిలెన్స్ ఉండి ఉంటే... చౌదరి వ్యవహారంపై దృష్టిసారించి ఉండేవారనే వాదనలు వినిపిస్తున్నాయి.

**అక్కడే అన్ని వ్యవహారాలు**

కొందరు ప్రముఖులు, బడా బాబులతో హైదరాబాద్‌లో చౌదరి సమావేశమవుతాడని, అక్కడే వివిధ కంపెనీల ప్రతినిధులతో ఒప్పందాలపై చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఇటీవల ఓ సంస్థతో చౌదరి నివాసంలోనే ఒప్పందం కుదుర్చుకుందని, ఆ టెండర్ పత్రాలనూ డిస్కం సిబ్బంది కాకుండా చౌదరి స్వయంగా రూపొందించాడనే ఆరోపణలున్నాయి. టెండర్ పత్రం పూర్తిగా ప్రైవేటు సంస్థకు అనుకూలంగా, ఇతర పోటీదారులు పాల్గొనే అవకాశం లేకుండా రూపొందించారని, దీనిలో కొందరు అధికారులు, చౌదరి బాగా నే లాభపడ్డారని సమాచారం. తాజాగా ఓ డిస్కంలో డిజాస్టర్ రికవరీ ప్రాజెక్టుకు టెండర్ విడుదలైంది. దానినీ చౌదరి వ్యక్తులే రూపొందించారని తెలిసింది. ఈ%-%ప్రొక్యూర్మెంట్ పోర్టుల్‌లో పెట్టిన టెండర్ డాక్యుమెంట్ ఈ విషయాన్ని ధ్రువీకరిస్తోంది.

# మొంథాతో అంచనాకు మించి అపార నష్టం

మొంథా తుఫాన్ ఏపీకి అంచనాలకు మించిన నష్టాన్ని కలిగించిందని, తక్షణ సాయంగా రూ.901.4 కోట్లు అందించాలని కేంద్ర బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. తుఫాన్ వల్ల రూ.6,384 కోట్ల నష్టం వాటిల్లిందని వివరించింది. తుఫాన్ నష్టాన్ని మదింపు వేయడానికి కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ పాసుమీ బసు నేతృత్వంలోని బృందం రాష్ట్రానికి వచ్చింది. సోమవారం ఉదయం సచివాలయంలోని ఆర్టీజీఎసలో తుఫాన్ ప్రభావం, నష్టం, సహాయచర్యలపై రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి, విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను కేంద్రబృందం తిలకించింది. అనంతరం పలు జిల్లాల్లో పర్యటించి తుఫాన్ నష్టాన్ని అంచనా వేసింది. మొంథా తుఫాన్ రాష్ట్రంలోని 24 జిల్లాల పరిధిలోని 443 మండలాల్లో ప్రభావం చూపిందని, ముగ్గురు చనిపోయారని తెలిపారు. వ్యవసాయరంగానికి తీవ్ర నష్టం కలిగిందని, కోతదశలో ఉన్న పంటలను ముంచేసిందని తమ ప్రజెంటేషన్‌లో జయలక్ష్మి, ప్రఖర్ జైన్ తెలిపారు. 1.61 లక్షల హెక్టార్లలో వరి, పత్తి, మినుము, మొక్కజొన్న, 6,250 హెక్టార్లలో ఉద్యానవన పంటలు, 17.72 హెక్టార్లలో మలబరీ తోటలు, 3,063 హెక్టార్లలో చేపల చెరువులు ధ్వంసమయ్యాయని తెలిపారు. 4,566 ఇళ్లు, 1,853 పాఠశాలలు, 4,794 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బీ రోడ్లు, 311 వంతెనలు, కల్వర్టులు, 3,437 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 2,417 మేజర్, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని తెలిపారు. 58 మున్సిపల్ పట్టణాల్లో మౌలికవసతులు దెబ్బతిన్నాయని వివరించారు. యుద్ధ ప్రాతిపదికన సహాయచర్యలు చేపట్టినట్లు తెలిపారు. 9,960 ఇళ్లు నీట మునిగాయని, 1,11,402 మంది నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు.



**జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటన**

కేంద్ర బృందం సభ్యులు రెండు టీమ్‌లుగా ఏర్పడి, ఒకటి ప్రకాశం జిల్లాలో, రెండోది ఏలూరు, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించి నష్టం తీవ్రత అంచనా వేశారు. తుఫాన్ నష్టాలపై ప్రకాశం కలెక్టర్ రాజాబాబు వివరించారు. అనంతరం కొత్తపట్నం, నాగులుప్పలపాడు మండలాల్లో దెబ్బతిన్న పంటలు, ఆక్వా చెరువులను బృందం పరిశీలించింది. ఏలూరు జిల్లాలో పలు చోట్ల దెబ్బతిన్న పంటలను, పరిశీలించి వివరాలు నమోదు చేసుకుంది. 5,703 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని కలెక్టర్ వెట్రిసెల్వి నివేదించారు. 80 శాతం పంట దెబ్బతిందని కృష్ణా జిల్లా అధికారులు వివరించారు.

## తుఫాను నష్టాలపై కేంద్ర బృందం సమీక్ష




గన్నవరం, మహానగర్

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మొంతా తుఫాను నష్టాలపై ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను అంతర మంత్రిత్వ కేంద్ర బృందం సోమవారం పరిశీలించింది. కేంద్ర వ్యవసాయ రైతుల సంక్షేమ శాఖ సంచాలకులు డా. కె.పొన్ను సామి నేతృత్వంలో జిల్లాలో పర్యటించిన ఈ బృందం, తుఫాను కారణంగా దెబ్బతిన్న వరి పంటలు, ఉద్యాన తోటలు, ఇళ్లు, పడవలు, చేపలు పట్టు వలలు, రహదారులు, విద్యుత్ స్తంభాలు, పశువుల పాకలు, చనిపోయిన పశువులు వంటి విభిన్న రంగాల్లో జరిగిన నష్టాలను సమీక్షించింది. అదే విధంగా ప్రజల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన సహాయక శిబిరాలు, నిత్యావసర సరుకుల పంపిణీ చర్యలపై కూడా కేంద్ర బృందం విశ్లేషణ చేపట్టింది. కేంద్ర బృందంలో హైదరాబాద్ సెంట్రల్ వాటర్ కమిషన్ జలవనరుల మంత్రిత్వ శాఖ సంచాలకులు శ్రీనివాసు బైరి, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ విద్యుచ్ఛక్తి మంత్రిత్వ శాఖ ఉపసంచాలకులు ఆర్తి సింగ్, గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ సంచాలకులు మనోజ్ కుమార్ మీనా పాల్గొన్నారు. జిల్లాలో తుఫాను వలన జరిగిన నష్టాల వివరాలను జిల్లా కలెక్టర్ డి.కే. బాలాజీ కేంద్ర బృందానికి వివరించారు. ఈ పర్యటనలో రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు, పౌర సరఫరాల సంస్థ ఎండి ఢిల్లీ రావు, సంయుక్త కలెక్టర్ ఎం. నవీన్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు, గుడివాడ ఆర్డీఓ జి. బాలసుబ్రమణ్యం, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. పద్మావతి, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, మత్స్యశాఖ జేడీ అయ్యా నాగరాజా, గృహ నిర్మాణ నోడల్ అధికారి పోతురాజు, ఉద్యాన అధికారి జె. జ్యోతి, జలవనరుల శాఖ ఎస్ఈ మోహన్ రావు, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, పంచాయతీరాజ్ ఎస్ఈ రమణరావు, శాస్త్రవేత్త సత్యనారాయణ, ఘంటసాల కెవికె సమన్వయకర్త సుధారాణి, గన్నవరం తహసిల్దారు శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత తదితర అధికారులు పాల్గొన్నారు.

## సరికొత్తగా ‘వర్క్ స్పేస్’

-మొదటిపేజీ తరువాయి

1000 చదరపు గజాల్లో 610 మంది పనిచేసేలా సదుపాయాలు ఉండాలని ఐటీ శాఖ పాలసీలో పొందుపరిచింది. వీడియో కాన్ఫరెన్స్‌లకు వీలుగా హైస్పీడ్ బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ ఉండాలని, బిజినెస్ సమావేశాల నిర్వహణ కోసం ప్రత్యేక గది, స్కానింగ్, ప్రింటింగ్, లాకర్ సదుపాయాలు ఉండాలని పేర్కొంది. రోజంతా విద్యుత్ సరఫరా ఉండాలని సూచించింది. విద్యార్థులు, నిపుణులకు డిజిటల్ స్కిల్స్ నేర్పేందుకు కావలసిన సదుపాయాలన్నీ ఉండాలని పేర్కొంది. పాలసీలో భాగంగా మండలాల్లో ప్రభుత్వ భవనాల్లో ఏర్పాటుచేసిన వర్క్‌స్పేసలకు నామమాత్రపు అద్దెలో 100 శాతాన్ని ఐదేళ్లపాటు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. ప్రైవేటు భవనాల్లో ఏర్పాటుచేసే వర్క్‌స్పేసలకు ఏటా రూ.6 లక్షలకు మించకుండా 50 శాతం అద్దెను భరిస్తుంది. ఎర్లీ బర్డ్ పాలసీ కింద ముందుగా వచ్చేవారికి పెట్టుబడి రాయితీ రూ.15 లక్షలకు మించకుండా 60 శాతం వరకూ ఇవ్వనుంది. హైస్పీడ్ బ్రాడ్‌బాండ్ కోసం 50 శాతం కనెక్షన్ చార్జీలను చెల్లించనుంది.

## తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు సీనియర్లతో శిక్షణ

-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యేలు, నాయకులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిద్దామన్నారు. ‘సీనియర్ ఎమ్మెల్యేలు వారు తొలిసారి గెలిచినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారో, ఎలాంటి సమస్యలు అధిగమించి ఈ స్థాయికి వచ్చారో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు తెలుసుకుంటే మంచిది. వారు వరుస విజయాలు కొనసాగించాలంటే సీనియర్ల అనుభవాల నుంచి నేర్చుకోవాలి’ అని పేర్కొన్నారు. మంత్రులు నెలలో ఒక్కసారైనా విధిగా పార్టీ కార్యాలయానికి రావాలని, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రతి శుక్రవారం అర్జీలు స్వీకరించాలని ఆయన సూచించారు. ఆర్థికేతర సమస్యల్ని వేగంగా పరిష్కరించాలన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడిదారుల సదస్సును కలిసికట్టుగా విజయవంతం చేద్దామని, ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని లోకేశ్ తెలిపారు. మంత్రులంతా వారి శాఖల పరిధిలో జరిగే ఒప్పందాలకు సంబంధించి బాధ్యతతో వ్యవహరించా లన్నారు. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో మంగళవారం నిర్వహిస్తున్న ఎంఎస్ఎంఈ పార్కుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో మంత్రులు విధిగా పాల్గొనాలని ఆయన సూచించారు.


## మోటరోలా నుంచి మోటో జీ67 పవర్




విజయవాడ

మొబైల్ టెక్నాలజీలో ప్రపంచ అగ్రగామి, భారతదేశ ప్రముఖ ఏఐ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ అయిన మోటరోలా, 15 వేల విభాగంలో భారీ 7000 ఎంఏహెచ్ బ్యాటరీతో తన అత్యుత్తమ కెమెరా ఫోన్ మోటో జీ67 పవర్ ను విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పరికరం సెగ్మెంట్‌లో అన్ని కెమెరాల నుండి 4కె వీడియో రికార్డింగ్‌తో అత్యుత్తమ 50 ఎంపీ సోనీ లైటియా 600 కెమెరా, స్లిమ్ డిజైన్ కోసం సిలికాన్ కార్బన్ టెక్నాలజీతో కూడిన భారీ 7000 ఎంఏహెచ్ బ్యాటరీ, శక్తివంతమైన స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జెన్ 2 ప్రాసెసర్, గొరిల్లా గ్లాస్ 7ఐ, ఎంఐఎల్–810హెచ్ తో సెగ్మెంట్‌లో అత్యధిక మన్నిక, అద్భుతమైన 6.7 అంగుళాల 120 హెడ్జ్ ఎఫ్హెచ్డీ ప్లస్ డిస్ప్లే, అన్నీ అల్ట్రా–ప్రీమియం పాంటోన్ క్యూరేటెడ్ వీగన్ లెదర్ డిజైన్‌తో చుట్టబడి ఈ సెగ్మెంట్ ను పునర్నిర్వచిస్తుంది. మోటో జీ67 పవర్ అన్ని ఆన్లైన్ స్టోర్లలో రూ.15 వేల ధరకు అందుబాటులో ఉంది.

విశ్వం వాయిస్
అవినీతిపై - అక్షరసమరం...





### 50 మంది విద్యార్థులను కాపాడి

# తనువు చాలించిన స్కూల్ బస్ డ్రైవర్ నారాయణరాజు

**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల పరిధిలో మడికి సమీపాన 216 జాతీయ రహదారిపై ఇంజనీరింగ్ కళాశాల బస్ డ్రైవర్ 50 మంది విద్యార్థులను కాపాడి తనువు చాలించిన సంఘటన ఆలమూరు మండలం మడికి శివారు ప్రాంతంలో జరిగింది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం రాజమండ్రి గైట్ ఇంజనీరింగ్ కళాశాల బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కొత్తపేట నియోజక వర్గం ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన దెందుకూరి నారాయణరాజు (60) దినచర్యలో



భాగంగా సోమవారం విద్యార్థులను గైట్ ఇంజనీరింగ్ కళాశాలకు బస్సులో తరలిస్తుండగా మడికి 216ఏ జాతీయ రహదారిపై వెళుతూ అస్వస్థకు గురయ్యాడని, నారాయణ రాజుకు గుండెపోటు రావడంతో బస్సును మధ్యలోనే క్షణాల్లో బస్సు ఆపి క్రిందకు దిగి జాతీయ రహదారి డివైడర్ లో ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో విద్యార్థులు గమనించి సేఫ్టీ హైవే పెట్రోలింగ్ సిబ్బంది, పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు క్షణాల్లో చేరుకుని ఆసుపత్రికి తరలించే తరుణంలో బస్సు డ్రైవర్ ప్రాణాలను కోల్పోయినట్లు తెలిపారు. డ్రైవర్ నారాయణరాజు తను చనిపోతూ 50 మంది విద్యార్థులను కాపాడడంటూ స్థానికులు అంటున్నారు. విద్యార్థులతో గౌరవంగా ఉన్న నారాయణరాజు వారి కళ్ళ ఎదుటే చనిపోవడం విద్యార్థులు జీర్ణించుకోలేకపోతున్నారు.

### ప్రభుత్వ పనితీరు పట్ల

# విశ్వసనీయత పెంచేలా అధికారులు వ్యవహరించాలి

### పలు శాఖల జిల్లాస్థాయి అధికారులతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
### పలు సూచనలు చేసిన జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీకి పారదర్శకత, నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టరు ఆర్.మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి ప్రజాసమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరు అధ్యక్షతన, ఆయా శాఖల జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. జిల్లా కలెక్టరు తో పాటు, డి.ఆర్.వో కే మాధవి, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి మమ్మీ, డి.ఎల్.డి.ఓ రాజేశ్వరరావు లు సుమారుగా 230 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాణ్యమైన పరిష్కారం చూపుతూ ప్రభుత్వ



పనితీరు పట్ల విశ్వసనీయతను పెంచేలా ప్రజలతో వ్యవహరించాలన్నారు. అధికారులు వారి వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా క్షేత్రస్థాయిలో విచారణ, అధ్యయనం చేసి తమ సిబ్బందితో నిర్ణీత గడువు లోపే పరిష్కారం చూపాలని వివరించారు. ఒక్కోసారి ఫిర్యాదు పరిష్కారానికి కొంత సమయం అవసరం ఉన్నప్పుడు సంబంధిత విషయాన్ని ఫిర్యాదు దారులతో స్వయంగా అధికారులు మాట్లాడి వివరించాలన్నారు. ఫిర్యాదులు తమ పరిధిలోనివి కానప్పుడు వెను వెంటనే సంబంధిత శాఖకు ఎండార్స్ చేసి పంపాలని, అర్జీలు రీఓపెన్ కాకుండా సమస్యలు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధి కారులను ఆయన ఆదేశించారు. డిఆర్ఓ కే మాధవి మాట్లా డుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజలకు పరిపూర్ణమైన పరిష్కారాలను అందించడమే లక్ష్యంగా అధికారుల పని తీరు ఉండాలన్నారు వేదిక ద్వారా అందిన విన్నపాలు, ఫిర్యాదుల పరిస్థితిని పూర్తిగా పరిశీలించడం, ప్రతి అంశాన్ని సంబంధిత అధికారులకు అప్పగించి గడువులోగా పరిష్కరించడానికి ఆదేశాలు ఇవ్వడం విన్నపాలు పదేపదే పునరావృతం కాకుండా సమగ్రంగా అధ్యయనం చేసి శాశ్వతంగా నూటికి నూరు శాతం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పెండింగ్ లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి స్పెషల్ మానిటరింగ్ చేయాలన్నారు. ప్రజా సమస్యల పరి ష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల జిల్లాస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసిన

# ఎటపాక జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు మంద సుబ్రమణ్యం



**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నియోజక వర్గం ఎటపాక మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు మంద సుబ్రమణ్యం సోమవారం సచివాలయం లోని మంత్రి నాదెండ్ల మనోహర్ ను కలిసిన యటపాక జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు మంద సుబ్రమణ్యం మండలంలోని రేషన్ షాపుల వల్ల ప్రజలకు జరుగుతున్న సమస్యలపై మాట్లాడుతూ మండలంలోని 29 రేషన్ షాపులు ఉన్నాయి 16 రేషన్ షాపులకు ఆన్లైన్ ఐంది మిగతా 13 షాపులకు ఆన్లైన్ అవ్వక సిగ్నల్ తక్కువ గా ఉండటం వలన తుంబులు పడకపోవడం రేషన్ షాపులు వద్ద జనాలు ఎక్కువగా ఉంటున్నారు అని తెలియజేయడం జరిగింది యటపాక మండలంలో రోడ్స్ మరియు డ్రైనేజీలు మరియు ఇసుక అక్రమ తవ్వకాలు పలు సమస్యలు గురించి మంత్రి కి తెలియజేయడం జరిగింది.మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఈ సమస్యలన్నిటిని త్వరలోనే పరిష్కారం చూపిస్తామని వారు హామీ ఇవ్వడం జరిగింది.

# అటల్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తి పెంచాలి

**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అటల్ ల్యాబ్స్ వినియోగాన్ని పెంచడం ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని అభివృద్ధి చేయవచ్చని పాల్ ల్యాబ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి.కిషోర్ బాబు, టీచ్టూల్ స్టేట్ అబ్జర్వర్ మాధవీ లతలు పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్



కోనసీమ జిల్లా,ఆలమూరు మండలం మూలస్థానం జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం వారు సందర్శించారు. పాఠశాలలో అటల్ ల్యాబ్ వినియోగాన్ని పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడానికి, సైన్స్ టెంపర్మెంట్ ను డవలప్ చేయడానికి అటల్ ల్యాబ్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అటల్ ల్యాబ్స్ వినియోగాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన విషయాలపై అవగాహన కల్పించి, అటల్ ల్యాబ్స్ వినియోగించడం వలన కలిగే లాభాలను వివరించారు. అలాగే పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్(పాల్) ల్యాబ్ వినియోగాన్ని పెంచాలన్నారు. పాల్ ల్యాబ్స్ వినియోగించి విద్యాభ్యాసం చేయడం వలన విద్యార్థుల్లో లెర్నింగ్ లెవల్స్ పెరుగుతున్నట్లుగా పరిశోధనల్లో వెల్లడైందన్నారు. పాల్ ల్యాబ్స్ వినియోగించడంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తృతీయ స్థానంలో ఉందన్నారు. మూలస్థానం పాఠశాలకు మంజూరైన పాల్ ల్యాబ్ ఎలక్ట్రిఫికేషన్ వర్క్స్ ను ఈ సందర్భంగా పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అటల్, పాల్ ల్యాబ్స్ వినియోగాన్ని పెంచాలని ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణాదేవికి సూచించారు. వారి వెంట స్టేట్ ఐఈ కోఆర్డినేటర్ నరశింహారావు, సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి పి.రాంబాబులు ఉన్నారు.

### నామాడి అబ్బులు కుటుంబాన్ని

# పరామర్శించిన ఎమ్మెల్యే



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామానికి చెందిన నామాడి అబ్బులు కుమారుడు నామాడి బన్ను కేదార్లంక వద్ద గోదావరిలో ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందారు. ఈవిషాదకర సంఘటనపై పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ సోమవారం పరామర్శించి తీవ్ర సంతాపం తెలిపారు. మృతుని నివాసానికి వెళ్లి పూలమాల అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇది చాలా బాధాకరమైన ఘటన. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం పూర్తిగా కుటుంబానికి అండగా నిలుస్తుంది. అవసరమైన అన్ని సహాయ చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతాం," అని ఎమ్మెల్యే తెలిపారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### టిడిపి సర్పంచ్ రాజమణి ఆధ్వర్యంలో

# కార్తీక మాస అన్నసంతర్పణ కార్యక్రమం

### అన్న ప్రసాదాన్ని స్వీకరించిన 1000 మంది భక్తులు



**దేవిపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేవీపట్నం టీడీపీ సర్పంచ్ కుంజా రాజమణి ఆధ్వర్యంలో కార్తీకమాస వనభోజనాలు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల భక్తులు వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించడం జరిగింది. టిడిపి మాజీ మండల అధ్యక్షుడు మర్రిశెట్ల వెంకటేశ్వరరావు. రేలంగి రాంబాబు. పోతుల వాసు. గాంధీ. లంకా పోసిబాబు. గ్రామస్తులు తదితరులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# కలెక్టర్ మాట లెక్కచెయ్యని జిజి యూనివర్సిటీ

### కలెక్టర్‌కే తప్పడు సమాధానము చెప్తూ విద్యార్థులను మోసం చేస్తున్న జిజియు యాజమాన్యం

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ మాట కూడా లెక్క చేయని జి.జి.యూ పై చర్యలు తీసుకోవాలని ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు వై.భాస్కర్, ఎన్.రాజా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటన విడుదల చేసారూ. గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులను ఫీజు రీయంబర్స్మెంట్ కట్టమని ఒత్తిడి చేస్తున్నారు. కట్టకపోతే





మిడ్ పరీక్షలకు అనుమతి ఇవ్వమని, సెమిస్టర్ ఫీజు కూడా కట్టడానికి లింక్ ఓపెన్ కాకుండా చేసి విద్యార్థుల ను భయభ్రాంతులకు గురిచేస్తున్న యాజమాన్యం. అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వం ఇంకా ఫీజు రీయంబర్స్మెంట్ విద్యార్థులకు వేయక పోయిన కట్టమనే విద్యార్థులను ఒత్తిడికి గురిచేసే విదంగా వ్యవహరిస్తోంది. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్.ఎఫ్.ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గత నెల 22న కలెక్టర్ ఆఫీస్ వద్ద 100 మంది విద్యార్థులతో ధర్నా చేసి డి.ఆర్.ఓకి వినతిపత్రం ఇచ్చినా సమస్య పరిస్కారం కాలేదు. దాని తరువాత నవంబర్ 7న కలెక్టర్ కీర్తి చేకూరి ని కలిసిన కళాశాల యాజమాన్యంతో మాట్లాడిన అవ్వలేదు. మేము తప్పుడు సమాచారం ఇస్తున్నట్టు కళాశాల యాజమాన్యం ఏమి విద్యార్థులను ఇబ్బంది పెట్టట్లేదు అని కలెక్టర్ సి.సి కే అబద్ధాలు చెప్పి మోసం చేసే పని కళాశాల యాజమాన్యం చేస్తుంది. కాగా ఇవాల్టి నుంచి మిడ్ పరీక్షలు ప్రారంభం అయినా ఇవాళ రేపు సమయం ఇచ్చి ఈ లోగా ఫీస్ కట్టండి కట్టిన వాళ్ళకే మిడ్ పెడతాము అని బెదిరింపులు చేస్తున్నారు. క్లాస్, క్లాస్ తిరిగి విద్యార్థులను హెచ్.ఓ.డి లు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. విద్యార్థులేమో ఇప్పటికే బస్, హాస్టల్, ప్లేస్మెంట్ ఫీజులు కట్టమని ప్రభుత్వం వేయాల్సినవి కూడా కట్టాలంటే ఇబ్బంది గా ఉందని ఇప్పటికే వేళకు వేలు కట్టామని ఇవి కూడా కట్టమని మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలియజేసారు. కాబట్టి కలెక్టర్, ప్రభుత్వ నిబంధనలు లెక్క చేయని జి.జి.యూపై చర్యలు తీసుకోవాలని అలాగే పెండింగులో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన పెద్ద ఎత్తున విద్యార్థులతో ఉద్యమిస్తామని ఒక ప్రకటనలో తెలియజేసారు.

### మూఢనమ్మకాలను నిరోధించడంలో

# మెజీషియన్ల పాత్ర కీలకం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మూఢనమ్మకాలు నిరోధించడంలో మెజీషియన్ల పాత్ర కీలకమని ప్రముఖ మెజీషియన్, డాక్టర్ ఎస్. మనోహరరావు ( స్టిక్ మనోహర్ ) చెప్పారు.. ఆంధ్ర ప్రదేశ్ మెజీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 41వ ఇంద్రజాల మహోత్సవం అన్నమయ్య జిల్లా రాజంపేట వజ్రం ఫంక్షన్ హాల్ లో మాయాలోకం- 2025 పేరుతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేజిక్ రంగ అభివృద్ధికి కృషి చేయడంతోపాటు తన ప్రదర్శనల ద్వారా దేశ విదేశాలలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సామాజిక చైతన్యానికి పాటుపడుతున్న మనోహరరావును ఘనంగా శాలువా, మెమొంటోతో సత్కరించారు. మనోహర రావు మాట్లాడుతూ మూఢనమ్మకాలను నిర్మూలించే కార్యక్రమాన్ని మెజీషియన్లు తమ భుజస్కందాలపై వేసుకుని పట్టణ ప్రాంతాలలోనే కాకుండా పల్లెల్లో ఉన్న ప్రజలను కూడా చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మెజీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షులు జె.వి.ఆర్, సెక్రటరీ డాక్టర్ ఆర్యల్, ఫెస్టివల్ కన్వీనర్ యు.పి.రాయుడు, కడప మెజీషియన్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పి.బయ్యపురెడ్డి, అధ్యక్షులు కె.విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజమండ్రి కి చెందిన న్యాయవాదులు, మెజీషియన్లు, ప్రముఖులు డాక్టర్ ఎస్. మనోహర రావును అభినందించారు.

# తెలుగు భాషకు అభివృద్ధికి కృషి చేసిన సి.పి.బ్రౌన్

### ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సి.పి.బ్రౌన్ జయంతి ఘన నివాళి



**ధవళేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఉదయం కళాశాల ఇన్ ఛార్జ్ ప్రిన్సిపాల్ ఏ.వెంకట రమణ అధ్యక్షతన సి.పి.బ్రౌన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అధ్యాపకులు, విద్యార్థులు సి.పి.బ్రౌన్ చిత్ర పటానికి పూలమాల చేసిన నివాళులు అర్పించారు. అనంతరం ఇన్ ఛార్జ్ ప్రిన్సిపాల్ ఏ.వెంకట రమణ మాట్లాడుతూ తెలుగు భాషకు ఎనలేని సేవలు అందించిన "ఆంధ్ర భాషోద్ధరకుడు"అని కొనియాడారు. 1817లో సి.పి.బ్రౌన్ మద్రాసులో అడుగుపెట్టాడు. 1820లో కడపలో డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగ జీవితం ఆరంభించి, పరిపాలన సౌలభ్యం కోసం వెలగపూడి కోదండ రామ వద్ద తెలుగు భాషను నేర్చుకున్నాడు."హిందూ మేనర్స్ కస్టమ్స్ అండ్ సెర్మనీస్"లో వేమన పద్యాలు గురించి తెలుసుకొని,వేమన సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చాడు అని తెలిపారు. ఆంధ్ర మహాభారతం, భాగవతం, వసుచరిత్ర, మనుచరిత్ర, కళాపూర్ణోదయం ప్రబంధాలను పరిస్కరింపజేశాడు అని, తెనుగు - ఇంగ్లీష్, ఇంగ్లీష్ - తెనుగు నిఘంటువు రాసి తెలుగు వారికి అందించాడని తెలిపారు. కడపలో పెద్ద గ్రంథాలయం స్థాపించి తెలుగు భాషకు అభివృద్ధి కి దోహదపడిన బ్రిటిష్ మహనీయుడు బ్రౌన్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్ కె.అలీముద్దీన్, వివిఎస్.శేఖర్ బాబు, కె.పెద్దబ్బులు, వై.శివకుమారి, సి.శాంతి సుధ, కె.వెంకటరావు, డి.భాస్కరరావు, కె.గంగాధర్, వై.రాజేష్ బాబు, ఏసు రత్నం, రామాంజనేయరావు, పి.భాస్కర రావు, ఆఫీసు సిబ్బంది మేఘన, లక్ష్మి, పుణ్యవతి తదితరులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎడిటర్ వాయిస్

## అమెరికాలో షట్‌డౌన్ కార్పొరేట్ ప్రయోజనాలు

ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక శక్తి అయిన అమెరికాలో, ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేని విధంగా ఒక వింత సమస్య తరచుగా తలెత్తుతున్నది. అదే ప్రభుత్వ కార్యకలాపాల నిలుపుదల లేదా షట్ డౌన్. ఇలా ఎందుకు జరుగుతున్నది? అమెరికాలో ప్రభుత్వ కార్యకలాపాలు సజావుగా సాగాలంటే అవసరమైన ఖర్చు పెట్టడానికి అక్కడి పార్లమెంటు చట్టపరమైన అనుమతి కావాలి. దేశం అప్పుల పాలు కాకుండా ప్రభుత్వ దుబారా ఖర్చులను నిరోధించేందుకు 1870వ సంవత్సరంలో యాంటీ డెఫిషియన్సీ చట్టం (ఏడీఏ)ద్వారా ఈ విధానం ప్రవేశపెట్టారు. ఫెడరల్ ప్రభుత్వ కార్యకలాపాలకు నిధులందించేందుకు పార్లమెంట్ తప్పనిసరిగా ప్రతి ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే బడ్జెట్ ఆమోదించాలి. అందులో విఫలమైతే, దేశంలోని పలు విభాగాల సేవలు మూసివేయబడతాయి. దీనినే ప్రభుత్వ షట్ డౌన్ అంటారు. వందమంది సభ్యులున్న సెనేట్‌లో మెజారిటీకి అవసరమైన అరవై ఓట్లు పొందలేని కారణంగా ఈ బిల్లు ఆమోదం పొందలేకపోయింది. దీంతో పాటు ఆమోదం పొందాల్సిన రిపబ్లికన్ ఫండింగ్ బిల్లుకూడా వీగిపోయింది. అందువలన అక్టోబర్ ఒకటి 2015 నుండి అమెరికాలో షట్ డౌన్ మొదలైంది. అధికార రిపబ్లికన్ పార్టీ (డోనాల్డ్ ట్రంప్), ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ సంక్షోభానికి దారితీసింది. ఆరోగ్య సంరక్షణ నిధులు కొనసాగించాలని, వలస విధానాలు వంటి కీలక రాజకీయ డిమాండ్లను నిధుల బిల్లుకు జతచేయాలని డెమోక్రాట్లు డిమాండ్. డెమోక్రాట్ల పాలనలో రాష్ట్రాలకు కేటాయించిన అభివృద్ధి నిధులను నిలిపివేయడం, అలాగే ప్రభుత్వ ఉద్యోగుల్లో తనకు వ్యతిరేకంగా ఉన్న వారిని తొలగిస్తానని బహిరంగంగా ట్రంప్ బెదిరించడం ఈ షట్‌డౌన్‌కి ప్రధాన కారణాలుగా మీడియా, పరిశీలకులు చెబుతున్న విషయాలు. పాలకవర్గాలకు దేశ ప్రజలకంటే కార్పొరేట్ ప్రయోజనాలే ప్రధానంగా తెరమీదకి రావడంతో షట్‌డౌన్ దుస్థితి పదే పదే దాపురిస్తున్నది. అమెరికాలోని రెండు ప్రధాన పాలకవర్గ పార్టీలైన రిపబ్లిక్, డెమొక్రాట్ పార్టీలు రెండు పైకి నినాదాలు ఏమిచ్చినప్పటికీ ఆచరణలో కార్పొ రట్ ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తున్నాయడంలో సందేహం లేదు. షట్‌డౌన్ కారణంగా లక్షలాది మంది ఉద్యోగులు, కార్మికులు జీతంలేని బలవంతపు సెలవులకు నెట్టివేయబడుతున్నారు. షట్ డౌన్ ఎత్తివేసిన తర్వాత వారిలో కొందరికి కొంతమేర జీతాలిచ్చే అవకాశం ఉంది. కానీ అనేక డిపార్ట్‌మెం ట్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తిరిగి విధుల్లోకి తీసుకోబడినప్పటికీ షట్‌డౌన్ కాలంగా కోల్పోయిన వేతనాలు మాత్రం తిరిగి పొందడం లేదు. ఇది అడ్మినిస్ట్రేటివ్ డిఫాల్ట్ కాదు, వర్గ ప్రయోజనాల రాజకీయ కారణంగా జరిగింది. బడ్జెట్ ఆమోదించకపోవడం అనేది కార్పొరేట్ల కనుసన్నల్లో నడిచే పార్టీలకు వారి రాజకీయ కోర్కెలు తీర్చుకునే ఆయుధంగా మారింది. ఎవరు అధికారంలో ఉన్న తరచూ ఈ ఆయుధం ప్రయోగిస్తూనే ఉండటం వల్ల అనేకసార్లు ఇలాంటి షట్‌డౌన్ సంక్షోభాలు తలెత్తాయి. ట్రంప్ హయాం లో అది మరింత ప్రమాదకరంగా మారింది. అందువల్ల నేడు అమెరికాలో నేషనల్ సెక్యూరిటీ, పబ్లిక్ సేఫ్టీ, ప్రొటెక్షన్ ఆఫ్ ప్రాపర్టీ ఇబ్బందిగా మారింది. అమెరికాలో 65 నుండి 75శాతం ఉద్యోగులు, కార్మికులు ఈ నెల జీతం అయిపోయి మరుసటి నెల జీతం కోసం ఎదురు చూస్తూ జీవిస్తారు.అందువల్ల ఇంటి అద్దెలు, కరెంటు, వాటర్, గ్యాస్, నిత్యావసర సరుకులు, విద్య, వైద్యం లాంటి యుటిలిటీ బిల్స్ చెల్లించలేని స్థితికి చేరుకున్నారు. అనేకమంది ఎసెన్షి యల్ వర్కర్స్ యొక్క ఉద్యోగాలు పోవడం వల్ల వారి కుటుంబాలకు తిండి పెట్టలేక ఫుడ్ బ్యాంకులకు తరలించాల్సిన దారుణమైన పరిస్థితి వచ్చింది. అలాగే స్కిల్డ్ ప్రొఫెషనల్ కూడా రీతీఅరశీఅ స్త్రబ%ఖ%తీసర గాను, ఉబర్ డ్రైవర్స్ గాను, లిఫ్ట్ ఆపరేటర్స్‌గాను పనిచేయాల్సి వస్తున్నది. సకాలంలో ఈఎంఐలు చెల్లించ లేకపోవడం వలన వారి సిబిల్ స్కోర్‌లు పడిపోయాయి. అలాగే రోజువారి అవసరాలకు క్రెడిట్ కార్డులు వాడి సకాలంలో ఆయా మొత్తాలను చెల్లించకపోవడం వలన, వాటిపై వడ్డీల భారం పెరిగి అప్పు మరింత పెరిగిపోతున్నది. ఉద్యోగాలు లేక జీతాలు లేక కొనుగోలు శక్తి తగ్గటం వలన అనేక పలు వ్యాపారాలు మూతపడ్డాయి. అందువలన కాఫీ షాపులలో, ఐటీ సంస్థలలో పనిచేసే తాత్కాలిక ఉద్యోగులు, అలబామా, హంట్ విల్లే ప్రాంతాలలో నివసించే వ్యవసాయ పరిశోధకులు, ఓహాయోలో ఉండే విఏ నర్సులు, కాలి ఫోర్నియాలో ఉండే ఫారెస్ట్ ఫైర్ ఫైటర్స్, టెక్సాస్‌లో ఉండే బోర్డర్ ఏజెంట్స్ లాంటి అసంఘటిత రంగ కార్మికులు ఉద్యోగాలు, జీతాలు కోల్పోయారు. అంతేగాకుండా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ (ఏటిసి), ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేషన్ (టిఎస్ఎ)లలో జీతం లేకుండా పనిచేయాల్సి రావడం వలన వారిలో తీవ్ర ఒత్తిడి పెరిగింది. ఈ రంగాల్లో ఔట్‌సోర్సింగ్ స్టాఫ్‌ను తీసివేయడం వల్ల ఎయిర్ ట్రాఫిక్ జామ్స్ ఏర్పడుతున్నాయి. లాస్‌ఏంజిల్స్ లాంటి ముఖ్యమైన చోట టర్మినల్స్ మూసివేశారు. ఇలా ఉద్యోగాలు కోల్పోయిన వారు నేడు అమెరికాలో 14లక్షల వరకు ఉంటారు. వీరందరూ వాషింగ్టన్ డిసి లాంటి మెట్రోపాలిటన్ సిటీలలో 15శాతం నివసిస్తుండగా మిగతా 85శాతం వివిధ రాష్ట్రాలు, టెరిటరీలలో ఉంటున్నారు. అందువలన ఇది ప్రాంతీయ సమస్య కాదు. మొత్తం అమెరికా దేశ సమస్యగా మారింది. అంతేగాకుండా షట్ డౌన్ వల్ల ప్రభుత్వ (ఎస్ఎన్ఏపి) సప్లిమెంటల్ న్యూట్రిషన్ అసిస్టెంట్ ప్రోగ్రాంకి నిధులు సమకూర్చడం ఆపివేసింది. ఈ పథకం ద్వారా 42 లక్షల పేద ప్రజలకు అమెరికా ఫుడ్ అందిస్తూ ఆదుకుంటున్నది. ఇది దేశ జనాభాలో పది శాతం. దీనివల్ల పిల్లలు, పేదలు, ముసలివారే ఎనభై శాతం ప్రయోజనం పొందుతున్నారు. ఎస్ఎన్ఏపి పథకం ఆగిపోవడం వలన అగ్రికల్చరల్ వస్తువుల అమ్మకం దెబ్బతిన్నది. ఈ పథకం అనేది ఈబీటి (ఎలక్ట్రానిక్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) కార్డు ద్వారా బదిలీ చేయబడి పేదలకు ఆసరాగా ఉండేది. ఇలా ఫెడరల్ ప్రభుత్వ ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయి జీతాలు లేక, పేదల ఎస్ఎన్ఏపీ పథకం ఆగిపోవడం వలన ప్రజలు డబ్బు ఖర్చు చేయలేని స్థితికి వచ్చారు. అందువల్ల రెస్టారెంట్లు, కాఫీ షాపులు, చిన్నచిన్న రిటైలర్స్, ప్రభుత్వ ఆఫీసులు, మిలటరీ బేసిన్‌లలో కస్టమర్స్ పూర్తిగా తగ్గిపోయారు. ఇది స్థానిక ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థపై పడింది. ఈషట్‌డౌన్ అమెరికా ఆర్థిక వ్యవస్థని చిన్నాభిన్నం చేసింది. దేశానికి ఊహించని నష్టాన్ని తెచ్చింది. ఇక్కడి ఆర్థిక అనిశ్చితి వల్ల ప్రపంచ స్టాక్ మార్కెట్లు, విదేశీ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా తన దేశ బడ్జెట్ ఆమోదింప చేసుకోలేక పోవడం, ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడుదారుల విశ్వాసాన్ని దెబ్బతీ స్తున్నది. ఇది ప్రపంచ పెట్టుబడుల ప్రవాహాన్ని తగ్గిస్తుంది. అంతేకాక అనేక కీలకాంశాల సమాచారాన్ని సేకరించే సంస్థల కార్యకలాపాలు ఆగిపోయాయి.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్


# మాడపాటి జీవితమే ఆంధ్ర ఉద్యమ చరిత్ర



మాడపాటి హనుమంతరావు ఒక వ్యక్తి కాదు. ఒక మహాసంస్థ. ఆయన జీవిత చరిత్రమే తెలంగాణ ఆంధ్రోద్యమ చరిత్ర. అందుకే ఆంధ్ర పితామహుడని పేరుపొందిన ప్రజానాయకుడు ఆయన. నాటి నిజాం రాజ్యంలోని తెలుగు వారిలో జాగృతిని కలిగించి, సామాజిక, సాంస్కృతిక రాజకీయ వికాసానికై నిరంతర కృషిచేసిన ప్రముఖుడు, బహుభాషా పండితుడు మాడ పాటి. తెలంగాణలో చైతన్యాన్ని తెచ్చిన తొలి తెలుగు నాయకునిగా ఆయన సుపరిచితుడు. ఆయన ఒక విజ్ఞాన సర్వస్వము. ఆయన బ్రిటీష్, నిజాం రాజ్యాల సరిహద్దు లలో ఉన్న ఎర్రుపాలెం వాస్తవ్యుడు కనుక నిజాం ఆంధ్రులందరిలో ముందు మేల్కొన్నాడు. తన దేశీయుల్ని మేల్కొలిపినాడు. 1904లో హనుమకొండలో శ్రీరాజరాజ నరేంద్ర ఆంధ్రభాషా నిలయంలో సన్నని జాలుగా బయలుదేరిన ఆయన ఆంధ్రో ద్యమం గోల్కొండ పత్రికలో పరిపుష్టినందుకుని, ఆంధ్రమహా సభలలో వాహినిగా ప్రవహించింది. హనుమంతరావు 20వ శతాబ్ది తొలిదశకంలో హైదరాబాద్ రాజ్యంలోని తెలుగు ప్రాంతాల్లో (నేటి తెలంగాణ) ఆంధ్రోద్యమం వ్యాప్తి చేసేందుకు కృషిచేశారు. న్యాయవాద వృత్తిని చేపట్టిన మాడపాటి, విజయవంతమైన లాయరుగా పేరుపొందారు. తీరిక సమయాలన్నిటా ఆంధ్రోద్యమానికి, తెలంగాణాలో గ్రంథాలయాల అభివృద్ధికి కేటాయించేవారు. ఆంధ్ర జన సంఘం, ఆంధ్ర మహాసభ వంటి ప్రజాసంఘాల స్థాపనలోనూ, వాటి నిర్వహణలోనూ కీలకపాత్ర వహించారు. 1885 జనవరి 22 (తారణ సంవత్సర మాఖ శుద్ధ షష్ఠి) న కృష్ణా జిల్లా, నందిగామ తాలూకా పొక్కునూరులో వెంకటప్పయ్య, వెంకట సుబ్బమ్మ దంపతులకు జన్మించారు. వీరు ఆరువేల నియోగి బ్రాహ్మణులు. ఆయన తండ్రి గ్రామాధికారిగా పనిచేసేవాడు. ఐదు సంవత్సరాల వయసులోనే తండ్రి చనిపోగా, సూర్యాపేటలో ఉద్యోగం చేస్తున్న మేనమామ దగ్గర పెరిగారు. హన్మకొండలోని ఉన్నత పాఠశాలలో చేరి మద్రాసు యూనివర్సిటీ మెట్రిక్యులేషన్ పరీక్ష ఉత్తీర్ణులు అయినారు. వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నెలకు 40 రూపాయల వేతనంపై మీర్‌మున్షీ (హెడ్‌క్లర్క్) ఉద్యోగంలో చేశారు. ఎనిమిది సంవత్సరాలు ఆ ఉద్యోగంలో ఉండి హైదరాబాద్ కొచ్చి 'లా' పరీక్ష పూర్తిచేసి ప్రాక్టీసు పెట్టారు. వకాలత్ విడిచి పెట్టేనాటికి ఆయనకు నెలకు ఆరువందల ఆదాయం వచ్చేది. పంతులు సేవ రాజకీయ పార్టీల ద్వారా జరగ లేదు. నిర్మాణాత్మకమైన సంస్థలద్వారా జరిగింది. ఒకానొక పరాభవాగ్నిలోంచి పుట్టింది నిజాం ఆంధ్రోద్యమం. 1921 సంవత్సరం నవంబరు 12వ తేది వివేక వర్ధనీ ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ హిందూ సంస్కార సభ జరుగగా, ఆ సభలో అనేక మంది ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ భాషలలో మాట్లాడు తున్నారు. ఆంధ్ర ప్రతినిధులు మాడపాటి హనుమంతరావు, ఆలంపల్లి వెంకటరామారావు, ఇద్దరూ హైకోర్టు న్యాయవాదులు. మహారాష్ట్ర బాహుళ్యమైన సభలో తెలుగులో మాట్లాడినారు. సభలోని వారు విసుక్కున్నారు. నిరసన ప్రకటించారు. అల్లరి చేసారు. తమ వీపులు సభావేదిక వైపు తిప్పి వినమన్నారు. ఈ దుశ్చర్య, అవమానం ఆంధ్రులు భరించలేక పోయారు. ఆ రాత్రికి రాత్రే టేకుమల రంగారావు ఇంట్లో సమావేశమై కర్తవ్యం ఆలోచిం చారు. ఆంధ్రుల అభిమాన సంరక్షణ కోసం, ఆంధ్రుల వ్యక్తిత్వ నిరూపణ కోసం ఒక సంఘం స్థాపించు కోవాలని నిర్ణయించు కున్నారు. ఆ సంఘం పేరు నిజాం రాష్ట్ర ఆంధ్రజన సంఘం. అధ్యక్షుడు రావు బహదూర్ సామల వెంకటరెడ్డి, కార్యదర్శి మాడపాటి హనుమంతరావు. తరువాత మహారాష్ట్ర కన్నడ పరిషత్తులు కూడా ఏర్పాడ్డాయి. నాటి వరకు ఏ ఉద్యమమైనా నగరానికే పరిమితమై ఉండేది. ఆంధ్రులుగా గ్రామ సీమలకు వెళ్లారు. ఆంధ్రులలో ఐకమత్యం, చైతన్యం, విద్య, స్త్రీల వికాసం మొదలైన వాటికి కారకులయ్యారు. తాము మేల్కొని ఇతరులను మేల్కొలి పారు. ఆంధ్రసంఘం పెద్ద ఆశయాలతో బయల్దేరింది. గ్రామీణుల విజ్ఞానం వృద్ధి చేసి, వాళ్ళ కళ్ళు తెరిపించడానికి గ్రంథాలయాలు, రైతుల ఇక్కట్లు పోగొట్టడానికి రైతు సంఘాలు, వ్యాపార పరిస్థితులు బాగు పరచ డానికి వర్తక సంఘాలను స్థాపించింది. పటేల్–పట్వారీల జులంతో, భూస్వాముల వెట్టి చాకిరితో, అధికారుల దౌర్జన్యంతో బాధపడుతున్న నిర్భాగ్యపు ప్రజల శ్రేయస్సుకోసం పనిచేసింది. ఆంధ్ర జన సంఘం నాయకులు జిల్లాలు తిరిగి కర్తవ్య ప్రబోధం చేశారు. మాడపాటి గ్రంథాలయోద్యమం లోనూ చెప్పుకోదగ్గ కృషి సాగించారు. ఆయన తనకు సన్మానం ద్వారా లభించిన సొమ్మును కూడా గ్రంథాలయాల అభివృద్ధికే అంద జేశారు. హైదరాబాద్ లోని శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషా నిలయం, హనుమకొండ లోని రాజరాజ నరేంద్ర ఆంధ్ర గ్రంథాలయం కూడా ఆయన అభివృద్ధి చేసినవే. వీటిలో శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం నిజాం పాలిత తెలుగు ప్రాంతంలోని తొలి తెలుగు గ్రంథాలయంగా చారిత్రిక ప్రశస్తి పొందింది. ఆ రోజుల్లో గ్రంథాలయాలు నడ పడం అంత సులభమైన పనికాదు. నాటి ప్రభుత్వ దృష్టిలో గ్రంథాలయా లంటే విప్లవ కేంద్రాలే. అయినా పాలకులతో ఉత్తరాల ద్వారా అనుమతులు పొందారు. 4వ ఆంధ్ర మహాసభ కరీంనగర్ జిల్లా సిరిసిల్లలో 1935 సంవత్సరం జనవరి 26, 27, 28 తేదీలలో జరిగింది. గద్దె నెక్కించడమేకానీ తాను ఎక్కే స్వభావం హనుమంతరావులో లేదు. సభ్యులు పట్టుపట్టాక, పంతులు అధ్యక్ష పీఠం వహించక తప్పలేదు. అప్పుడే అక్కడే జరిగిన మహిళా సభకు పంతులు అర్ధాంగి అధ్యక్షత వహించారు. భర్త, మరొక వైపు భార్య ఒకేసారి ఒక స్థలంలో జంటగా సాగుతున్న ఆంధ్ర మహా సభకు, ఆంధ్ర మహిళా సభకు అధ్యక్షత వహించడం అపూర్వం, అపురూపం. మాడపాటి షష్టిపూర్తి ఉత్సవం 1946 ఫిబ్రవరిలో రెడ్డి హాస్టల్ ఆవరణలో మహావైభవోపేతంగా జరిగింది. దీనికి రాజ్ బహదూర్ వెంకట్రామి రెడ్డి ఆహ్వాన సంఘాధ్యక్షులు కొండా వెంకటరంగారెడ్డి కార్యదర్శి. ఇందులో పంతులుకు తులాభారం జరుపగా, సంబంధిత రూ.6400 డబ్బును ఆయన మహిళా కళాశాలకు విరాళంగా ఇచ్చారు. హనుమంతరావు బాలికల కోసం నారాయణ గూడలో స్థాపించిన పాఠశాల ఆయన స్మారక కళాశాలగా నడుస్తున్నది. బూర్గుల ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంతులు ఉస్మానియాకు శాశ్వత సెనెటు సభ్యులుగా నియమితులైనారు. తరువాత నాలుగేళ్ళు సిండికేటు సభ్యులుగా ఉన్నారు. భారత దేశములో ప్రప్రథమ బాలికల పాఠశాలలో ఒకటైన మాడపాటి హనుమంతరావు బాలికోన్నత పాఠశాల హైదరాబాదులో నారాయణ గూడలో స్థాపించాడు. బాలికల కోసం ఆయన ఎన్నో పాఠశాలలను నెలకొల్పారు. ఆయన విద్యారంగానికి చేసిన సేవలను పురస్కరించుకొని ఉస్మానియా విశ్వ విద్యాలయం 1956లో డాక్టరేటు బిరుదు నిచ్చి సత్కరించింది. 1955లో కేంద్ర ప్రభుత్వం 'పద్మ భూషణ' బిరుదు ప్రసాదించింది. ఆ బిరుదు పొందిన తెలుగు వారిలో ఆయనే ప్రథములు. అనారోగ్య కారణాలతో ఢిల్లీ వెళ్ళలేక పోగా, మరుసటి సంవత్సరం రాష్ట్రపతి డా.బాబు రాజేంద్రప్రసాద్ హైదరాబాద్ విచ్చేసినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో స్వహస్తాలతో మాడపాటికి 'పద్మ భూషణ్' బహూకరించారు. మాడపాటి మంచి కవి, రచయిత. మొత్తం పదమూడు కథలు రాశారు. వీటిలో హృదయశల్యం, రాణీసారందా, ముసలిదాని ఉసురు, నేనే, అగ్ని గుండం, నాడు నీ పంతం, నేడు నా పంతం, ఆత్మార్పణం, తప్పు, ఎవరికి, విధి ప్రేరణం అనే కథలు 'మల్లికాగుచ్ఛం' పేరుతో 1911 లో పుస్తక రూపం దాల్చాయి. మాడపాటికి రచయితగా శాశ్వత కీర్తిని అందించిన గ్రంథం 'తెలంగాణ ఆంధ్రోద్యమం'.రాష్ట్రానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత 1951లో హైదరాబాద్ నగర పాలక సంఘానికి పంతులుగ తొలి మేయరుగా ఎన్నికయ్యారు. ఆ పదవికి మూడు సార్లు ఎన్నికవుతూ వచ్చారు. ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ అధ్యక్షునిగా ఆయన ఆరేళ్ళు పదవిలో ఉండి, ఉన్నత ఆదర్శాలతో సభ్యులందరికి మన్ననలు పొందారు. మాడపాటి దూరదృష్టి, స్వార్థ రాహిత్యం, క్రమశిక్షణ, నిర్వహణలో దక్షత వంటివి కలిగిన వ్యక్తి. అందరినీ కలుపుకు పోయే లక్షణం, ఉద్వేగం లేని స్వభావం వల్ల ఆయన అజాత శత్రువుగా నిలిచారు.రాజకీయాల్లో ఆయన మితవాది, అయినా ఆయన రాజకీయాదర్శాలను వ్యతిరేకించే కమ్యూనిస్టులు కూడా ఎంతగానో గౌరవించేవారు. శాసన మండలి అధ్యక్ష పదవీ విరమణ అనంతరం విశ్రాంతి జీవితాన్ని గడుపుతూ 1970 నవంబరు 11వ తేదీన తమ 86వ ఏటా మరణించారు.

# విద్యారంగానికి బాటలు వేసిన ఆద్యుడు

దేశంలో విద్య అభివృద్ధికి తొలి బాట వేసిన విద్యాధికుడు అబుల్ కలాం ఆజాదే. ఆయన భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పని చేశాడు. నవంబర్ 11న ఆయన జన్మదినం సందర్భంగా మన దేశంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపు కుంటారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ (నవంబర్ 11, 1888– ఫిబ్రవరి 22, 1958) స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖా మంత్రి, మౌలా నా అబుల్ కలాం ఆజాద్. ఆయన అసలుపేరు 'మొహి యుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలాం' అనేది బిరుదు, 'ఆజాద్' కలంపేరు. ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ లకు 1888 నవంబరు 11 న మక్కాలో జన్మించాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ మక్కా నగరంలో 1888 నవంబర్ 11 న జన్మించారు. ఆయన వంశస్తులు బాబర్ రోజుల్లో హేరాత్ (ఆఫ్ఘనిస్తాన్ లో ఒక నగరం) కు చెందిన వారు. ఆజాద్ ముస్లిం పండితులు/ మౌలానాల వంశం నుండి వచ్చాడు. ఆయన తల్లి అరబ్, షేక్ మహ్మద్ జహీర్ వత్రి, తండ్రి మౌలానా ఖైరుద్దీన్ ఆఫ్ఘన్ మూలాలు గల ఒక బెంగాలీ ముస్లిం. ఖైరుద్దీన్ సిపాయి తిరుగుబాటు సమయంలో భారతదేశం నుండి మక్కా వెళ్ళి అక్కడే స్థిరపడ్డాడు. 1890 లో అయన తన కుటుంబంతో కలకత్తా వచ్చాడు. ఆజాద్ సంప్రదాయ ఇస్లామిక్ విద్య అభ్యసించాడు. ఆయన విద్య ఇంట్లో సాగింది. మొదట తండ్రి పిదప ఉపాధ్యాయులు ఇంట్లోనే బోధించాడు. ఆజాద్ మొదట అరబిక్, పెర్షియన్ తరువాత తత్వశాస్త్రం, రేఖాగణితం, గణితం, బీజగణితం నేర్చుకున్నాడు. స్వీయ అధ్యయనం ద్వారా ఇంగ్లీష్, ప్రపంచ చరిత్ర, రాజకీయాలు నేర్చుకున్నాడు. ఆజాద్ మౌలానా అగుటకు కావలసిన మత శిక్షణ పొందాడు. ఆయన దివ్య ఖురాన్ పై భాష్యం రాశాడు. విదేశాల నుంచి తిరిగి వచ్చాక ఆజాద్, బెంగాల్ కు చెందిన అరవింద ఘోష్, శ్యాం సుందర్ చక్రవర్తి వంటి ప్రముఖ విప్లవకారులను కలుసుకున్నాడు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాన్ని చేపట్టాడు. విప్లవాత్మక చర్యలు బెంగాల్, బీహార్‌లకు పరిమితం అయిన విషయం ఆజాద్ కు తెలిసి రెండు సంవత్స రాలలో, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉత్తర భారతదేశం, బాంబే లాంటి ప్రాంతాలలో రహస్య విప్లవ కేంద్రాలు ఏర్పాటుచేసాడు. ఆ సమయంలో విప్లవ వాదులు ముస్లింల విప్లవ వ్యతిరేకులుగా భావించసాగారు. ఎందుకంటే బ్రిటిష్ ప్రభుత్వం భారత దేశం యొక్క స్వాతంత్ర్య పోరాటా నికి వ్యతిరేకంగా ముస్లిం కమ్యూనిటీని ఉపయోగిస్తున్నాదని భావించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన సహచరు లను ముస్లింల పట్ల వారి పగను పోగొట్టటానికి ప్రయత్నిం చాడు.



1912 లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూలో ' అల్ హిలాల్' వార పత్రిక ముస్లింల మధ్య విప్లవాత్మక భావాలను పెంచడానికి ప్రారంభించాడు. ఆజాద్ భారతీయ జాతీయ వాదం, హిందూ –ముస్లిం ఐక్యత ఆధారంగా విప్లవాత్మక ఆలోచనలతో మరో పత్రికను "అల్ బలఘ్" ప్రారంభించాడు. మౌలానా ఆజాద్, గాంధీజీ ఉప్పు సత్యా గ్రహంలో పాల్గొని 1930 లో అరెస్టు అయినాడు. ఆయనను ఒక సంవత్సరంన్నర పాటు మీరట్ జైల్లో ఉంచారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1940 (రాంగఢ్) లో కాం గ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికై, 1946 వరకు ఆ పదవిలో ఉన్నా డు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యా గ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత స్వాతంత్ర్య సమర ముఖ్య నాయకులలో ఒకడు. ఆయన ప్రఖ్యాత పండితుడు, కవి. 1947 ఆగస్టు 15 నుండి అంటే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 1958 ఫిబ్రవరి 2 వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా సేవలు అందించాడు. ఈయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డు ఇచ్చింది. అంతే కాదు ఆయన పేరిట పలు విద్యాసంస్థలు కూడా నెలకొల్ప బడ్డాయి. అబుల్ కలాం మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ప్రసిద్ధ జామియా మిలియా ఇస్లామియా విశ్వ విద్యాలయం సహా భారతదేశం అంతటా వివిధ కళాశాలలు మరియు విశ్వ విద్యాలయాలు స్థాపించ బడ్డాయి. ఆయన సేవలకు గుర్తుగా 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్ణయించింది. స్వాతంత్ర్య సమర యోధుడిగా, భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రిగా పనిచేసిన అబుల్ కలాం ఆజాద్ అసలు పేరు 'మొహియుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలామ్' అనేది బిరుదు.. 'ఆజాద్' అనేది ఆయన కలం పేరు. ఆయన అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ తదితర భాషలలో మంచి ప్రావీణ్యత సంపాదించాడు. స్వయంగా సాహితీవేత్త అయిన ఆయన 'ఇండియా విన్స్ ఫ్రీడమ్'ను రాశాడు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మన దేశంలో విద్యావ్యవస్థ పటిష్టతకు, విద్యా వ్యవస్థను మెరుగు పరిచేందుకు అంకిత భావంతో పనిచేశాడు. చిన్నపిల్లల్లో ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి పిల్లలను పాఠశాలల్లో చేర్పించడాన్ని ప్రోత్సహించారు. పాఠశాలలు, కళాశాలల నిర్మాణానికి జాతీయ కార్యక్రమాన్ని ప్రణాళికను రూపొందించాడు. 14 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలకు ఉచిత మరియు నిర్బంధ విద్యను అందించే ఆలోచనను ఆయనే ముందుకు తెచ్చాడు. అలాగే "ప్రతి ఒక్కరూ ప్రాథమిక విద్యను పొందడం వ్యక్తి జన్మహక్కుగా పరిగణించాలి. లేదంటే పౌరులుగా తమ విధులను పూర్తిగా నిర్వర్తించలేరు" అని అబుల్ కలామ్ ప్రాథ మిక విద్య గురించి వివరించాడు. అంతే కాదు, ఆడపిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో అనేక పథకాలను తీసుకొ చ్చాడు. ఆయన మార్గదర్శకత్వం మరియు నాయకత్వంలో విశ్వవిద్యాలయ గ్రాంట్ కమిషన్ (యుజిసి)ని విద్యా మంత్రిత్వ శాఖ 1953లో స్థాపించింది. అలాగే 1951లో అబుల్ నాయకత్వంలో మొదటి ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్థాపించ బడింది. ఆయన ఒక దూరదృష్టిగల వ్యక్తి, భవిష్యత్ సాంకేతిక నిపుణులను రూపొందించడంలో ఐఐటిల సామర్థ్యాన్ని నమ్ముతాడు. "ఈ ఇన్స్టిట్యూట్ స్థాపన దేశంలో ఉన్నత సాంకేతిక విద్య మరియు పరిశోధనల పురోగతిలో ఒక మైలురాయిగా మారుతుంది అనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు" అని మౌలానా ఆజాద్ పేర్కొన్నాడు. గాంధీజీ ఆయనను భారత ప్లాటో అని, గాంధీ , నెహ్రూ ఆయనను మౌలానా, మీర్–ఎ–కారవాన్ అని పిలిచేవాడు. 1992లో భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించింది.



### "మీ డబ్బు మీ హక్కు"తో

# మరిచిపోయిన ఆర్థిక ఆస్తులను తిరిగిపొందే అవకాశం

**మీ డబ్బు మీ హక్కు గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ - కోనసీమ జిల్లా లో 4,70,690 బ్యాంకు ఖాతాలలో రూ. 82.66 కోట్లు**
**సరైన పత్రాలు సమర్పించి ఈ-కేవైసీ ద్వారా క్లెయిమ్ చేసుకునే అవకాశం**
**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న అవకాశం సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** బ్యాంకు ఖాతా దారులు తమ పేరు మీద ఉన్న క్లైమ్ చేయని నిధులను గుర్తించి, సరైన పత్రాలు సమర్పించడం ద్వారా సులభంగా క్లైమ్ చేసుకోవడానికి "మీ డబ్బు మీ హక్కు" కార్యక్రమం ద్వారా ఆర్బీఐ అవకాశం కల్పిస్తోందని డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సోమవారం తెలిపారు. వివిధ బ్యాంకులలో లావాదేవీ లు జరగని బ్యాంక్ ఖాతాలోని సొమ్మును తిరిగి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆయన వెల్లడించారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు మీ డబ్బు మీ హక్కు నినాదంతో భారతప్రభుత్వం దేశవ్యాప్తంగా మూడు నెలల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమంపై రూపొందించిన గోడ పత్రికను బ్యాంక్ అధికారులతో ఆయన కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ మాట్లాడుతూ 10 ఏళ్ళు అంతకు మించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లో



సొమ్మును బ్యాంకులు తిరిగి ఇచ్చేయడం జరుగుతుందన్నారు. "మీ డబ్బు మీ హక్కు" నినాదంతో భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం ద్వారా పౌరులు తమ పేరు మీద ఉన్న క్లెయిమ్ చేయని లేదా మరిచిపోయిన ఆర్థిక ఆస్తులను తిరిగి పొందే అవకాశం కల్పించిందన్నారు. ప్రజలు బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడం, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, బీమాపాలసీ లు, ఇతర ఆర్థిక సాధనాలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా తమ కుటుంబ భవిష్యత్తును సురక్షితం చేసుకుంటున్నారని, కొన్ని సందర్భాల్లో ఈ ఆస్తులు లబ్ధిదారులకు చేరకపోవడానికి లోపం వంటి కారణాలు ఉన్నాయన్నారు. "మీ డబ్బు- మీ హక్కు" ప్రచార కార్యక్రమం ద్వారా పౌరులు తమ పేరు మీద ఖాతాదారుల మరణం చిరునామా మార్పు లేదా నామిని వివరాల లోపం వంటి కారణాలు ఉన్నాయన్నారు. మీ డబ్బు- మీ హక్కు" ప్రచార కార్యక్రమం ద్వారా పౌరులు తమ పేరు మీద ఉన్న క్లైమ్ చేయని నిధులను గుర్తించి సరైన పత్రాలు సమర్పించడం ద్వారా సులభంగా క్లైమ్ చేసుకోవడానికి ఆర్బీఐ అవకాశం కల్పిస్తోందని ఆయన తెలిపారు. ఆర్బీఐ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విధంగా కోనసీమ జిల్లాలో 4,70,690 బ్యాంకు ఖాతాలలో రూ. 82.66 కోట్లు ఉన్నాయని, వీటిలో వ్యక్తిగత ఖాతాలు 4,58, 644 లు ఉండగా, వీరి ఖాతాలలో రూ 66.27 కోట్లు ఉన్నాయని, సంస్థా పరమైన 6984 ఖాతాలు ఉండగా వీరి బ్యాంకు ఖాతా లలో రూ.12.26 కోట్లు ఉన్నాయని, ప్రభుత్వ రంగంలో 5,062 బ్యాంకు ఖాతాలలో రూ 4.13 కోట్లు ఉన్నాయని తెలిపారు. వీటికి సంబంధించిన వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు సరైన ధ్రువ పత్రాలతో ఈకేవైసీ పూర్తి చేసి, తమ సొమ్మును తిరిగి పొందవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు అధికారి కేశవ వర్మ. ఇతర బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

### అన్నదాతలను ఆదుకోవడంలో

# కూటమి ప్రభుత్వం వెనుకాడదు

**రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రారంభం**
**ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్, వాసంశెట్టి సత్యం**



**రామచంద్రపురం/ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశానికి అన్నం పెట్టే అన్నదాతలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం వెనకాడబోదని ఎన్డీఏ కూటమి, తేదేపా సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ద్రాక్షారామంలో సోమవారం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. దీనికిగాను రామచంద్రపురం నియోజవర్గంలో 62 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీటిలో రామచంద్రపురం మండలంలో 21, కె గంగవరం మండలంలో 19, కాజులూరు మండలంలో 22 ఉన్నాయన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తూనే పంటకు తగ్గ గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని వెల్లడించారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్ మాట్లాడుతూ 2025-26 ఖరీఫ్ కు సంబంధించి నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు, సేకరణ లక్ష్యంగా రైతు సేవా కేంద్రాలు కృషి చేస్తాయన్నారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్ కు రూ. 2,389/- సాధారణ రకానికి రూ. 2,369/- గా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. రైతులకు ఇతరత్రా ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్ 83094 32487,94416 92275 నెంబర్ల లో సంప్రదించాలని, లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1967 నెంబర్ కు డయల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ దళారులను, మధ్యవర్తులను నమ్మకుండా, నేరుగా రైతు సేవ కేంద్రాల్లో అమ్మకాలు చేసుకోవాలని రైతులకు సూచించారు. అన్నదాతలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, మరిన్ని వివరాల కోసం రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడిఏ బి నాగ కుమార్ , ఏఈ మణిదీప్, ఏఎంసీ వైస్ చైర్మన్ దడాల నాగార్జున, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, ద్రాక్షారామం పిఏసిఎస్ అధ్యక్షులు ముప్పనపల్లి గణేష్, ద్రాక్షారామం సర్పంచ్ కొత్తపల్లి అరుణ, టిడిపి రూరల్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శీను బాబు, ఏఎంసీ డైరెక్టర్లు, కూటమి పార్టీ నాయకులు పెంకే సాంబశివరావు, సంపత్ సత్యనారాయణ, వాసంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు. తొలుత రైతుల సౌకర్యార్థం ముద్రించిన కరపత్రాలను వాసంశెట్టి సత్యం, అధికారుల చేతుల మీదుగా విడుదల చేశారు.

### విద్య పట్ల ఆసక్తి, ఉత్సాహం కష్టాలను

# అధిగమించే మనో బలాన్నిస్తాయి

**జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్**




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థుల కృషి, సాధనను గౌరవిస్తూ ఉజ్వల భవిష్యత్తును పొందేందుకు తోడ్పాటు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పై ఉందని, జిల్లా పౌర సరఫరాల అధికారి పేర్కొన్నారు. సోమవారం ఈదరపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మే నెలలో విడుదలైన పదోతరగతి పరీక్ష ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించినందుకు గానూ ఎ.హెచ్.ఎస్.పి హాసిని అనే విద్యార్థినికి అడపా వెంకట నారాయణ మెమోరియల్ అవార్డును అందించి, పదివేల రూపాయల నగదు ను బహుకరించి, జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఉదయం భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల కృషి, సాధనను గౌరవిస్తూ, వారికి ఉజ్వల భవిష్యత్తును పొందేందుకు తోడ్పాటును అందించాల్సిన అవసరం ఉందన్నారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థిని కృషి ఎంతో ప్రశంసనీయమని మరింతగా విద్యలో రాణిస్తూ ఎంచుకున్న లక్ష్యాల సాధన ద్వారా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థినీ, విద్యార్థులలో ఆత్మ విశ్వాసం పెంపొందించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. షైనింగ్ స్టార్స్ కార్యక్రమం పేరిట విద్యార్థులలో విద్య ఆసక్తి పట్ల మరింత అభిరుచి, ప్రేరణ కలిగించాలన్నారు. ప్రతి విద్యార్థికి అనుకూల దృక్పథం, కొంత క్రమశిక్షణ తో పాటు స్వీయ మోటివేషన్ అవసరమన్నారు. మొదటగా చిన్న చిన్న లక్ష్యాలు గురిగా చేసుకొని వాటిని సాధించడం ద్వారా పెద్ద లక్ష్య సాధనకు మద్దతుగా ఉంటుందన్నారు. విద్యార్థుల ప్రతిభ పట్ల నమ్మకం, ప్రేరణ చర్యలు వారి సమర్థత ను మరింత పెంచుతాయన్నారు. చదువు పట్ల అభిరుచి ఉత్సాహం ఉంటేనే కష్టాలను అధిగమించే మనోబలం లభిస్తుందన్నారు. ఆత్మ విశ్వాసంతో లక్ష్యాలను సాధించాలని వివరించారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల్లో ప్రోత్సాహక వాతావరణాన్ని సృష్టించడానికి ముందురావాలని సూచించారు. మెరికల్లాంటి విద్యార్థులు ఉండడంతో రానున్న భవిష్యత్తు తరం అత్యుత్తమంగా రూపుదిద్దుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడపా మాణిక్యాలరావు, అడపా భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌కు

# పూర్వ విద్యార్థుల ఆర్థిక సహకారం

**1973-74 సంవత్సర టెన్త్ క్లాస్ పూర్వ విద్యార్థుల దాతృత్వం**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న సైన్స్ ల్యాబ్ రూమ్ పనుల నిమిత్తం రూ.2 లక్షలు ఆర్థిక సహకారం అందజేసి 1973-74 టెన్త్ క్లాస్ బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల పై అభిమానం చాటుకున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో గల శ్రీ రామయ్య జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1973-74 సంవత్సరంలో విద్యను పూర్తి చేసి వివిధ రంగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి, తాము చదువుకున్న తమ పాఠశాలలో అసంపూర్ణంగా మిగిలిపోయిన సైన్స్ ల్యాబ్ పనులు నిమిత్తం రూ.2 లక్షల విరాళాన్ని పాఠశాల ఇంచార్జ్ హెడ్ మాస్టర్ పి ఈశ్వర్ రెడ్డి కి పూర్వ విద్యార్థి మాజీ జడ్పీ ప్రతిపక్ష నాయకులు సత్తి రామారెడ్డి చేతుల మీదగా సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమానికి 1973-74 విద్యా సంవత్సరం కు చెందిన టెన్త్ క్లాస్ పూర్వ విద్యార్థులు కొవ్వూరి పుల్లారెడ్డి, ఎం వి సుబ్రహ్మణ్యం, కొవ్వూరి సత్తిరెడ్డి, జే.వి.రామారావు, గొలుగూరి గోవిందరెడ్డి, నక్కిన వెంకటేశ్వరరావు, దొంతంశెట్టి సత్యనారాయణ, నల్లమిల్లి రామ్ గోపాల్ రెడ్డి ,కర్రి ఉమామహేశ్వర్ రెడ్డి పాల్గొని సహకరించారు. వీరికి పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు విప్పర్తి శాంతి సునీత, స్టాఫ్ సెక్రెటరీ భాస్కర రామారావు, ఉపాధ్యాయులు సూరిబాబు, వీరాంజనేయ రెడ్డి , శ్రీనివాస్ తదితరులు అభినందిస్తూ, కృతజ్ఞతలు తెలిపారు.

# కార్తీక మూడవ సోమవారం వైభవం..

**పలివెల శ్రీ ఉమా కొప్పేశ్వరస్వామి క్షేత్రంలో భక్తుల రద్దీ**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పవిత్ర కార్తీక మాసంలో మూడవ సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గం లోని శైవ క్షేత్రాలన్నీ భక్త జనసంద్రంగా మారాయి. ముక్కంటిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్త కోటితో ఓం నమఃశివాయ మంత్రం అన్ని ఆలయాలలో ప్రతిధ్వనించింది. కొత్తపేట మండలంలోని పలివెల శ్రీ ఉమాకొప్పేశ్వరస్వామి దేవాలయం (స్వయంభూ క్షేత్రం) వైభవం ఈరోజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వేకువ జాము నుండే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని, శివయ్యకు పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. మహిళా భక్తులు భక్తి శ్రద్ధలతో ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించి, వారి మొక్కులను తీర్చుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ ఈఓ పి.కామేశ్వరరావు పర్యవేక్షణలో సిబ్బంది ఎలాంటి తోపులాటలు జరగకుండా, సులువుగా దర్శనం లభించేలా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసి పటిష్ఠమైన సేవలు అందించారు.భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన నెలరోజుల ప్రసాద వితరణ కార్యక్రమం తోట వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో నిరాటంకంగా కొనసాగుతోందని తెలిపారు.

### ఘనంగా ముక్కామల

# పిఏసిఎస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకారం



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం, ముక్కామల పిఏసిఎస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పిఏసిఎస్ చైర్మన్‌గా కుడిపూడి రాంబాబు ఎన్నికైనందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డైరెక్టర్లుగా ప్రసాద్, సత్యనారాయణకి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, డిప్యూటీ సీఎం కొణిగిదల పవన్ కళ్యాణ్ ఆశయాలను అనుసరించి ప్రజలకు సేవ చేయడానికి కట్టుబడి ఉన్నామని అన్నారు. ఎవరు ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు గౌరవం ఇవ్వాలని నిర్ణయించుకున్నాను అని తెలిపారు.పార్టీకి మొదటి నుంచి శ్రమించిన రాంబాబు ను చైర్మన్‌గా ఎంపిక చేయడం దానికి నిదర్శనం అని పేర్కొన్నారు. అలాగే పదవుల ఎంపికలో పూర్తిగా పారదర్శకత పాటించామని తెలిపారు. సభ్యులు సొసైటీకి మంచి పేరు తీసుకురావాలని, ముఖ్యంగా రైతుల సంక్షేమం కోసం మేలుచేసే నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఏసిఎస్ చైర్మన్ , డైరెక్టర్లచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రెవెన్యూ డివిజినల్ అధికారి, కొత్తపేట వారి అధ్యక్షతన ఓటరు నమోదు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పి.శ్రీకర్, ఓటర్ నమోదు అధికారి, నెం.47-కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, కొత్తపేట వారి అధ్యక్షతన నెం.47-కొత్తపేట నియోజకవర్గం లోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో పోలింగ్ కేంద్రముల రేషనల్జేషన్ ప్రతిపాదనలో భాగంగా 1200 మంది ఓటర్ల కన్నా ఎక్కువ సంఖ్య గల పోలింగ్ కేంద్రముల నందు అదనపు పోలింగ్ కేంద్రములు నందు ఏర్పాటు చేయుటకు, ముఖ పత్రం, లొకేషన్ మార్పులు మరియు పోలింగ్ కేంద్రముల నందు కనీస సదుపాయలు గురించి మండలాల వారిగా సహాయ ఓటరు నమోదు అధికారి మరియు తహశిల్దార్లు సమర్పించిన ప్రతిపాదనలపై చర్చించి, అందు అభ్యంతరములు ఉన్నచో తమ దృష్టికి తీసుకునిరావలెనని కోరియున్నారు. నెం.47-కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం లో ప్రస్తుతం 262 పోలింగ్ కేంద్రంలు ఉండగా వాటికి అదనముగా ఆత్రేయపురం మండలంలో రెండు (2) పోలింగ్ కేంద్రంలు, రావులపాలెం మండలంలో ఆరు (6) పోలింగ్ కేంద్రంలు, కొత్తపేట మండలంలో ఆరు (6) పోలింగ్ కేంద్రంలు మరియు ఆలమూరు మండలంలో ఒక (1) పోలింగ్ కేంద్రం వెరసి నియోజకవర్గంలో మొత్తం పదిహేను (15) పోలింగ్ కేంద్రంలు ఏర్పాటు చేయుటకు మరియు ఆత్రేయపురం మండలంలో కట్టుంగ గ్రామం మరియు రావులపాలెం మండలంలో రావులపాలెం గ్రామలలోని శిధిలావస్థలో ఉన్న పోలింగ్ కేంద్రలను మార్చుటకు సంబందిత మండలాల నుండి ప్రతిపాదనలు రావడం జరిగినదని ఓటర్ నమోదు అధికారి, నెం.47-కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గం మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, కొత్తపేట శ్రీ పి.శ్రీకర్ తెలియజేసినారు. ఈ సమావేశంలో కొత్తపేట, రావులపాలెం మరియు ఆత్రేయపురం సహాయ ఓటరు నమోదు అధికారి మరియు తహశిల్దార్లు, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు హాజరైనారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ హరీష్ బాలయోగి



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** వైద్యం ఖర్చుల రియింబర్స్ మెంట్ నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి ఆయన కార్యాయలంలో లబ్ధిదారులకు అందజేశారు.

**లబ్ధి పొందిన వారిలో**

1. సరిపెల్ల సుజాత - 81,000/- రూపాయలు.( పోతుకుర్రు గ్రామం) 2. బల్ల విజయ లక్ష్మి - 1,50,000/- రూపాయలు.(నాగుల్లంక). 3. కొరపు భవానీ శంకర్ - 63,366/- రూపాయలు.(అయినవిల్లిలంక), 4. ఊటాల రియానా - 30,127/- రూపాయలు.(నడిపూడి). మొత్తం 3,24,493/- (మూడు లక్షల ఇరవై నాలుగు వేల నాలుగు వందల తొంబై మూడు) రూపాయలు మొత్తాన్ని అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు ఎంపీ ధన్యవాదాలు తెలిపారు. అలాగే తమ వైద్యం ఖర్చులు రీయింబర్స్ మెంట్ చేసినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు, ఎంపీ హరీష్ బాలయోగి కి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

వన సమారాధనలో

# పాలుపంచుకున్న "జనసేన" నేతలు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామంలో కార్తీక మాసం వన సమారాధన కార్యక్రమాన్ని సోమవారం సంప్రదాయ బద్దంగా నిర్వహించారు. ఏలేశ్వరం జనసేన పార్టీ అధ్యక్షుడు కోలా వీరబాబు ప్రతీ సంవత్సరం స్థానికంగా వన సమారాధనను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా స్థానికంగా ఉన్న ఏలేరు కాల్వను ఆనుకుని ఉన్న తన పొలాల మధ్య తోటల్లోని ఉసిరి చెట్టుకు పూజలతో ప్రారంభించి వనసమారాధనను నిర్వహించారు. మండలంలోని ప్రజలకు, నియోజకవర్గంలోని జనసేన పార్టీ శ్రేణుల ఆత్మీయ బంధువులకు విందును ఏర్పాటు చేశారు. ఈయన ఆత్మీయ ఆహ్వానాన్ని అందుకున్న ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన పార్టీ పూర్వపు ఇంఛార్జి వరుపుల తమ్మయ్యబాబు, విజయవాడ ప్రాంతీయ డివిజన్ రైల్వే సంప్రదింపుల కమిటీ సభ్యులు గొర్లి నాగేశ్వరరావు, పూర్వపు తూర్పు గోదావరి జిల్లా టెలీకాంఅడ్వయిజరీ కమిటీ సభ్యులు మేకల కృష్ణ, జనసేన కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం కమిటీ సభ్యులు గౌతు లక్ష్మి, రావూరి వెంకటేశ్వరరావు, నియోజకవర్గం జనసేన పార్టీ ఐటి కోఆర్డినేటర్ సత్యంశెట్టి రాజేష్, జనసేన పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అన్నదానానికి 20వేల విలువైన

# 350 కేజీల బియ్యం వితరణ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు, గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు తలపంటి అప్పారావు (బుజ్జి) తన స్వగ్రామం నెల్లిపూడిలోని బుడుగు, బలహీన, బీద, ఆర్థికంగా వెనుక బడిన తరగతుల ప్రజలకు ఆర్థికంగా చేదోడుగా నిలుస్తూ వస్తున్నారు. అందరి కష్టంలోనూ పాలు పంచుకుంటూ ఉన్నారు. గ్రామ పౌరులకు ఊహించని ప్రమాదాలు, ప్రకృతి విపత్తులు, వైద్యావసరాలు, శంఖవరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు అన్నదానం ... ఇలా నిరుపేదలకు ఎవరి అవసరాలకు తగినట్లుగా వారికి ధన, వస్తు రూపేణా సహాయం చేస్తూ వస్తున్నారు. నెల్లిపూడిలో 400 ఏళ్ల క్రితం వేంచేసియున్న, జీర్ణోద్ధరణకు చేరుకున్న హరిహర శ్రీశ్రీశ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి అతి పురాతన క్షేత్రాన్ని రూ. 10,00,000 లతో కొన్ని నెలల పాటు ఆయన, ఆయన సతీమణి దేవి సంయుక్తంగా కొన్ని నెలల పాటు శ్రమించి వారి సొంత సొమ్ములతో ఆలయ మండపాన్ని, ఉత్తర ద్వారాన్ని పునర్నిర్మించి, ఆలయం చుట్టూ ఇనుప రక్షణ గోడను ఏర్పాటు చేసి, భక్తుల విశ్రాంతి సౌకర్యార్థం రేకుల షెడ్డును కూడా సమస్త హంగులనూ సర్వాంగ సుందరంగా నిర్మించిన తలపెట్టి అప్పారావు (బుజ్జి), దేవీ పుణ్య దంపతులు కార్తీక మాసం సందర్భంగా మహాశివ రాత్రి పర్వదినాన బుధవారం 26.02.2025 న పునఃప్రారంభించి గ్రామ ప్రజలకు అంకితం ఇచ్చారు. అంతే గాకుండా ఆ రోజు వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ క్రమంలో ఇదే దేవాలయంలో ప్రతీ కార్తీక మాసం మూడో సోమవారం ప్రత్యేక అన్నసమారాధన నిర్వహించే సంప్రదాయాన్ని అనుసరించి సోమవారం నిర్వహించిన అన్నదానానికి తలపంటి అప్పారావు (బుజ్జి) రూ. 20,000 విలువ చేసే 350 కేజీల బియ్యాన్ని తన వంతు విరాళంగా అందించి భక్తులకు అన్నసమారాధన నిర్వహించడంలో నిర్మాణాత్మక పాత్ర పోషించారు. అంతే కాకుండా తుని ప్రాంతీయ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పాలకవర్గం సభ్యులు, పూర్వపు తూర్పు గోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు కరణం సుబ్రహ్మణ్యంతో కలిసి తలపంటి అప్పారావు (బుజ్జి) స్వయంగా భక్తులకు అన్నసమారాధనలో భోజన పదార్థాలను వడ్డించారు. ఈ కార్యక్రమానికి నెల్లిపూడి జనసేన నాయకులు, కార్యకర్తలు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరు అయ్యారు.

# గర్భిణీలకు సాయిప్రియ సేవా సమితి అన్నదానం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన, జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ స్థానికంగా 2010 లో తాను స్థాపించిన సాయిప్రియ సేవా సమితికి వ్యవస్థాపక అధ్యక్షులుగా కొనసాగుతూ ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి ప్రధాన కేంద్రంగా సాయిప్రియ సేవా సమితి ద్వారా వివిధ ప్రజాభివృద్ధి, సంక్షేమ, సామాజిక సేవా కార్యక్రమాలను 15 ఏళ్ళుగా నిర్వహిస్తూ వస్తున్నారు. "అన్ని అన్నదానాల కన్న అన్నదానం మిన్న" అని నమ్మిన జ్యోతుల శ్రీనివాస్ అన్నదానం చేయడంలో ముందు ఉంటారు. పిఠాపురంలో వారానికి ఒక రోజు శనివారం నిర్వహించే పశువుల సంతలో మధ్యాహ్నం పూట డొక్కా సీతమ్మ అన్న సదుపాయ కేంద్రం పేరుతో మూడున్నర ఏళ్లుగా అన్నదానాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు. ఇక్కడ ఈ విధంగా ఈ అన్నదానం గత శనివారంతో 171 వ వారానికి చేరుకుంది. ఇక గుడులు, గోపురాలు, కార్తీక వనసమారాధనలకు ఈయన అందించే అన్నదానాలు, సహాయాల సేవలు సరేసరి. ఈ పరంపరలో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కేంద్రం శంఖవరంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం చికిత్స పొందిన గర్భిణీ స్త్రీలకు జ్యోతుల శ్రీనివాస్ అన్నదానం చేశారు. ప్రతీ నెలా ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకంలో గర్భిణీ స్త్రీలకు ఒక రోజు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సోమవారం ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆస్పత్రి ప్రధాన వైద్యులు శెట్టిబత్తుల శ్రీరామ రాజీవ్ కుమార్ పర్యవేక్షణలో ద్వితీయ వైద్యులు మోహన్ సాయిరెడ్డి 28 మంది గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. వీరిలో ఏడుగురిని హైరిస్కు గర్భిణీలుగా గుర్తించారు. ఈ గర్భిణీ స్త్రీలు అందరకీ తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ గర్భీ స్త్రీలు, ఆస్పత్రి సిబ్బంది, అవుట్ పేషెంట్లకు కలిపి మొత్తం 100 మందికి రూ. 10,000 వ్యయంతో గుడ్లు, అరటి పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు, పప్పు, పెరుగుతో కూడిన సాత్విక పోషకాహారాన్ని జ్యోతుల శ్రీనివాస్ అందించారు. ఈ అన్నదానం నిర్వహణలో మధ్యవర్తిగా వ్యవహరిస్తోన్న స్టార్ లైట్ ఫౌండేషన్ సిబ్బంది గుణపర్తి అపురూప్, బత్తిన తాతాజీ, కొంగు రమేష్, చెవల మధు ఆహారాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దంత వైద్యులు రవిశంకర్, సిహెచ్ఓ మేరీమణి, పిహెచ్ఎన్ కృష్ణకుమారి, హెచ్.వి. వెంకటలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా జవహర్ లాల్ నెహ్రూ జన్మదిన వేడుకలు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నాగమల్లి తోట జంక్షన్, సత్కళావాహిని నందు కృష్ణమాచారి దంపతుల ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రు జన్మదినం మరియు బాలల దినోత్సవాన్ని సందర్భంగా జరిగిన వకృత్వ పోటీలలో విజేతలైన బాల బాలికలకు బహుమతి ప్రదానం మరియు ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా మాజీ మేయర్ మరియు రాష్ట్రతెలుగు దేశం పార్టీ కార్యనిర్వాక కార్యదర్శి సుంకర పావని తిరుమల కుమార్ మరియు శ్రీమతి కర్రి పద్మశ్రీ ఏం ఎల్ సి. పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్‌కు 449 అర్జీలు

– జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ట్రైనీ కలెక్టర్ మానీషా, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, జెడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో పీ.త్రినాథ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎన్.శ్రీధర్, కెఆర్ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణి, డీపీవో వి.రవికుమార్ బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసులతో కలిసి హాజరై కాకినాడ జిల్లా చుట్టుపక్కల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను, దరఖాస్తులను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన విచారణ చేపట్టి తగిన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డు లలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, వివిధ సంక్షేమ పథకాల లబ్ది వంటి అంశాలకు చెందిన మొత్తం – 449 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా వివిధ శాఖలో నమోదైన అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి నాణ్యతతో అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. తప్పనిసరిగా అర్జీలను గడువులోపు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ఈ అర్జీలను జిల్లా స్థాయి అధికారి ఆడిట్ చేసి నివేదిక పంపించిన తర్వాత వాటిని రాష్ట్రస్థాయిలో ఆడిట్ కి పంపించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి రాలే ని అర్జిదారులు, వారి యొక్క అర్జీలను Meekosam.ap.gov.in వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు. అర్జీ దార్లు వారి యొక్క అర్జీల యొక్క స్థితి తెలుసుకోవాలి అన్నప్పుడు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చని కాకినాడ జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# 15న వజ్రకూటం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వజ్రకూటం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీ సమేత వెంకటేశ్వరస్వామి వారి దివ్య కళ్యాణోత్సవాలను స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం కార్తీక బహుళ ఏకాదశి శనివారం15 న అత్యంత వైభవోపేతంగా నిర్వహించ నున్నారు. కోలా వెంకటేష్, గోపికాశ్రీ దంపతులతో శ్రీలక్ష్మీ సమేత వెంకటేశ్వరస్వామి దివ్య కళ్యాణాన్ని జరిపించుటకు దైవజ్ఞులు నిశ్చయించారు. ఈ మేరకు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ ఆహ్వాన పత్రికలను నియోజకవర్గం వ్యాప్తంగా అందజేస్తున్నారు. ఈ మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చురుకుగా కొనసాగు తున్నాయి. దీనిలో భాగంగా వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం ఉదయం 8.45 గంటలకు పందిరి రాటను భక్తి శ్రద్ధలతో వైభవంగా ప్రతిష్టించారు. తదుపరి గ్రామ ముత్తైదువులు అందరూ పసుపు వాయి దంచే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల వివరాలను ఆలయ ధర్మకర్తలు కీర్తి సూర్యనారాయణ, సత్యవతి దంపతులు వెల్లడించారు. 14 న శుక్రవారం రోజున పంచామృతాలతో అభిషేకం, మంగళ స్థానములు, ఉదయం 10.45 గంటలకు శ్రీలక్ష్మీ, వెంకటేశ్వర స్వామిలను పెండ్లి కుమారుని, పెండ్లి కుమార్తెను చేయుట, 15న శనివారం శ్రీ స్వామి, అమ్మవార్ల కళ్యాణ మహోత్సవాన్ని, ఉదయం 8 గంటల నుండి పూర్ణ కుంభంతో గ్రామోత్సవం, 9 గంటలకు హోమం, 10 గంటల నుండి కళ్యాణం, మధ్యాహ్నం 12 గంటల నుండి అన్న సమారాధన, సాయంత్రం 6 గంటలకు దీపాలంకరణ సేవ, 17 న సోమవారం రాత్రి 7 గంటలకు శ్రీ పుష్పయాగం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు కీర్తి సూర్యనారాయణ, సత్యవతి దంపతులు ప్రకటించారు. కాగా సోమవారం నాటి కల్యాణోత్సవం ప్రారంభ సూచికగా పందిరి రాట స్థాపన, పసుపువాయి దంచిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కీర్తి వెంకట సుభాష్, సకురు విష్ణు మూర్తి, కోలా ఈశ్వరుడు, చిన్నారి దొరబాబు, కీర్తి శ్రీనివాస్, కేళంగి సూర్యారావు, కేళంగి బుచ్చిరాజు, కీర్తి నాగేశ్వరరావు, కీర్తి రమణ, కీర్తి రాజు, కేళంగి నాగేశ్వరావు, కేళంగి సుబ్బారావు, కర్రి సత్యనారాయణ, కేళంగి తాతారావు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శరభవరం ఆశ్రమ బాలికల హాస్టల్, పోతుకొండ ఎంపిపి పాఠశాలను

# సందర్శించిన సబ్ యూనిట్ మెడికల్ ఆఫీసర్





**దేవిపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** శరభవరం ఆశ్రమ బాలికల హాస్టల్ విద్యార్థినులు యోగక్షేమాలు అడిగి అలగే ఆరోగ్య విషయాలపై విద్యార్థినాలకు అవగాహన కల్పించమని దేవి పట్నం మండల సబ్ యూనిట్ ఆఫీసర్ బి శ్రీ రమణ మూర్తి, ఎంపీ హెచ్ ఎ(ఎమ్) ఏవి రమణ ఇందుకూరుపేట పిహెచ్‌సి వారు తెలిపారు. తదుపరి పోతుకొండ ఎంపిపి పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించడమే కాకుండా మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధులు గురించి వివరించారు. తరువాత పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించి ప్రతి ఒక్కరూ దోమతేరలు ఉపయోగించాలని పాఠశాల విద్యార్థులకి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శరభవరం హెచ్ఎం నూకాలమ్మ, పోతుకొండ పాఠశాల హెచ్ఎమ్ తుర్రం రాంబాబు దొర పాల్గొన్నారు.

# కొత్త రూట్లలో ఏపీ రియల్ బూమ్.. రిజల్ట్ అనూహ్యం...

రియల్ ఎస్టేట్ రంగం ఎంత బాగా విస్తరిస్తే అంత పెద్ద ఎత్తున ఆదాయం పెరుగుతుంది. అది ఖజానాకు చేరి సంపన్న రాష్ట్రంగా ఒక స్టేట్ మారేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. అంతే కాదు నిర్మాణ రంగం ఎక్కడ ఊపు అందుకుంటుందో అక్కడ ఉపాధితో పాటు అనేక రంగాలు కూడా విస్తరిస్తాయి. ఇపుడు ఏపీలో రియల్ ఎస్టేట్ రంగం కొత్త దారుల వెంట పరుగులు తీస్తూ అనూహ్యంగా ముందుకు సాగుతోంది.

**బలమైన అడుగులు :**

విభజన తరువాత ఏపీ కొత్త రాష్ట్రం కిందనే లెక్క. ఎందుకంటే రాజధాని సైతం లేని స్థితిలో ఏపీ విడిపోయింది. ఒక్క మాటలో చెప్పాలీ అంటే ఏపీ మొదటి నుంచి తన ప్రయాణం ప్రారంభించింది అన్న మాట. ఈ నేపథ్యంలో ఒక్కో ఇటుకా పేర్చుకుంటూ ఏపీ నెమ్మదిగా అడుగులు వేస్తోంది. 2014 నుంచి 2019 దాకా ఏపీ ప్రణాళిక కాగితాల మీద ఉంది, కొంత నేల మీదకు వచ్చేలోగా సర్కార్ దిగిపోయింది. 2019 నుంచి 2024 మధ్య అది కొంత మందగించినా తిరిగి 2024 నుంచి గట్టిగా పుంజుకుంది. దానికి కారణం కేంద్రంలో రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉండడమే కాదు, కేంద్రం నుంచి ఈసారి రాష్ట్రానికి సహకారం బాగానే అందుతోంది. అదే సమయంలో సరైన ప్లాన్స్ తో ఏపీలో కూటమి ప్రభుత్వం కూడా దానిని అందుకుంటూ మాస్టర్ ప్లాన్స్ ని డిజైన్ చేస్తోంది.

**రియల్ ఎస్టేట్ రంగంలో :**

ఇక ఏపీలో అమరావతి రాజధాని పెద్ద ఎత్తున నిర్మాణం సాగుతోంది. మరో వైపు ఆ రాజధానిని ఆనుకుని అనేక జాతీయ రహదారులు సైతం వస్తున్నాయి. కేంద్రం సైతం ఏపీకి మౌలిక సదుపాయాల కల్పనలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోనిద్. దాంతో మూలన ఒకప్పుడు ఉన్న ప్రాంతాలు ఇపుడు నడి మధ్యకు వస్తున్నాయి. అలా చూస్తే కనుక విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి నిర్మాణం ఒక పెద్ద మలుపుగా అంతా చూస్తున్నారు. ఈ జాతీయ రహదారిని ఆరు వరసలుగా నిర్మించాలని ప్రభుత్వాలు భావించడంతో ఒక్కసారిగా ఈ ప్రాంతానికి మహర్దశ పట్టనుంది.

**లాజిస్టిక్స్ హబ్ గా :**

ఏపీలో కీలక ప్రాంతాలు అన్నింటినీ కలుపుతూ లాజిస్టి హబ్ గా మార్చే బృహత్తర ప్రయత్నం సాగుతోంది. ఏపీ నుంచి ఎక్కడికైనా అలాగే అనేక ప్రాంతాలు రాష్ట్రంలోని అనేక మూలల నుంచి ప్రధాన స్రవంతిలోకి వస్తున్నాయి. ఈ పరిణామ క్రమంలో కొత్త ప్రాంతాలలో రియల్ బూమ్ వికసితోంది. పెద్ద ఎత్తున దూకుడు చేస్తోంది. అలా చూస్తే కనుక విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి విస్తరణ ఇపుడు మచిలీపట్నానికి కొత్త అదృష్టాలు తీసుకుని రాబోతోంది అని చెప్పక తప్పదు. ఈ పరిణామం వల్ల



విజయవాడలోని శివారు ప్రాంతాలు అలాగే మారుమూల ప్రాంతాలు సైతం రియల్ ఎస్టేట్ దూకుడు చేయనున్నాయని అంచనా వేస్తున్నారు.

**ఓవర్ నైట్ లోనే :**

ముందు దారి ఏర్పడితే ఆనక వచ్చేవన్నీ అలా వరస క్రమంలో వచ్చేస్తాయి. అల పరిశ్రమలు వాణిజ్యం, వ్యాపారం అన్నీ క్యూ కడితే మారు మూల ప్రాంతాలే మెయిన్ స్ట్రీమ్ లోకి వచ్చి డెవలప్మెంట్ కి కొత్త అర్థాలు చెబుతాయని అంటున్నారు. మౌలిక సదుపాయాల మీద ఏపీలోని కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని పెట్టడానికి సైతం కారణం ఇదే అని అంటున్నారు దీని వల్ల వాహనాల రాకపోకలు పెరుగుతాయి. ఫ్లోటింగ్ పాపులేషన్ వస్తుంది. ఆ మీద ఆకాశమే హద్దుగా బిజినెస్ మొదలవుతుంది. ఇలా రియల్ బూం ఎక్కడికో పోతుంది అన్నది అభివృద్ధి గురించి విశ్లేషించేవారి సరైన అంచనాగా ఉంది.


**రాత మార్చేస్తుందా :**

ఒక్క నేషనల్ రోడ్ ప్రాజెక్ట్ విజయవాడ శివారు ప్రాంతాలతో పాటు మచిలీపట్నంలోని కీలక ప్రాంతాల దశ మారుస్తుంది అని అంటున్నారు. ఇక్కడ రానున్న కాలంలో భారీ ఎత్తున అపార్ట్మెంట్స్ అలాగే నివాస ప్రాంతాలు అదే విధంగా విల్లాలు, వ్యాపార వాణిజ్య హబ్ లు అన్నీ వెలసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అంటున్నారు. వీటిని ముందే ఊహిస్తున్న వారు భూములను జాగ్రత్త పరచుకుంటున్నారు. ఎందుకంటే ఈ భూములకే అతి తక్కువ టైం లో రెక్కలు రాబోతున్నాయి. నిన్నటిదాకా మధ్యతరగతి వర్గాలుగా ఉండే వారు రానున్న కాలంలో అపర కోటీశ్వరులుగా మారే చాన్స్ అయితే కచ్చితంగా ఉంది అన్నది ఒక విశ్లేషణ.

విశ్వంవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

మంగళవారం, 11 నవంబర్ 2025
www.viswamvoice.com



# ఘనంగా కాపునాడు కార్తీక వన సమారాధన

## అన్ని కులాలవారు స్నేహభావంతో మెలగాలని వక్తల ఆకాంక్ష





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాపునాడు ఉభయ గోదావరి జిల్లాల అధ్యక్షుడు గుదే రఘు నరేష్, కార్యవర్గం ఆధ్వర్యంలో శ్రీరాంపురం రోడ్డులోని తలసిల జనార్ధన్ తోటలో కార్తీక వన సమారాధన కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన కాపు సంఘీయులతో ప్రాంగణం సందడిగా, శోభాయమానంగా మారింది. కాపు నాయకులు, ప్రజాప్రతినిధ్ను ప్రసంగించారు. ఇతర కులాల నాయకులను కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానించడంతో అన్ని కులాల వారు సమాజంలో స్నేహభావంతో మెలగాలని, ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణంలో భాగస్వాములు కావాలనే సంకేతాన్ని అందించారు. మహిళలకు చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు.

**ఎమ్మెల్యే బత్తుల చేతుల మీదుగా పుస్తకావిష్కరణ**

కాపు జాతి గర్వించదగ్గ వ్యక్తులు, స్వాతంత్ర సమర యోధుడు ద్వార బంధాల చంద్రయ్య నాయుడు,మద్రాసు ప్రెసిడెన్స్ ముఖ్యమంత్రిగా చేసిన కూర్మా వెంకటరెడ్డి నాయుడుల జీవిత చరిత్రను పుస్తక రూపంలో గుదే రఘు నరేష్ ప్రచురించి రాజా నగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరణ చేయించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి సిటీశాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, ప్రతినిధి అజయ్, నాయకులు యర్రా వేణుగోపాల రాయుడు, జనసేన ఇన్చార్జి అత్తి సత్యనారాయణ, మజ్జి పద్మ, మేడపాటి షర్మిల రెడ్డి, ఆకుల వీర్రాజు, జక్కంపూడి విజయలక్ష్మి, బుడ్డిగ శ్రీనివాస్, బొర్లపూడి క్రాంతి, దేశి రెడ్డి బలరామ నాయుడు, ఆకుల వెంకటేశ్వరరావు, ఆళ్ల ఆనందరావు, అర్లపల్లి పురుషోత్తం, వై వి డి ప్రసాద్, వడ్డీ మురళి, కాపునాడు పార్లమెంట్ అధ్యక్షులు ముమ్మిడి వీరబాబు, దేశినీడి రాంబాబు, కాళ్ల చక్ర రావు, పిల్ల దుర్గాప్రసాద్, రుద్ర దుర్గాప్రసాద్, దేనేడి మణికంఠ, సింహాద్రి ప్రసాద్, దేవకివాడ చక్రపాణి, నలంశెట్టి వీరబాబు, ఊరింకల సతీష్, ర్యాలీ రామకృష్ణ, తలారి శ్రీనివాస్, కోరుమిల్లి నాయుడు, సింహాద్రి నాగభూషణం, గోపిశెట్టి విజయలక్ష్మి, దుర్గాదేవి, మునగాల భాస్కర్, చూడసాని చంద్రశేఖర్, బచ్చు నాగార్జున, కుంపట్ల రామకృష్ణ, ఇంటి జయరాజ్, వడ్డీ రామకృష్ణ, రాపాక రాజేష్, మీసాల గణేష్, కర్రీ నాయుడు, పడాల వీర్రాజు, శంఖం జగదీష్,అల్లాటి రాజు, నరసాపురం పార్లమెంట్ అధ్యక్షులు సానా నాగబాబు,మహిళా ఉపాధ్యక్షురాలు గంటకుర్తి నాగ మాధవి తదితరులు పాల్గొన్నారు.

# నన్నయ వీసీని కలిసిన ఎస్టీ కమిషన్ మెంబర్



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వి.సి ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ ని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ నెంబర్ పి.వెంకటప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం విశ్వవిద్యాలయంలో వీసీని కలిసిన వెంకటప్ప గిరిజన భాషాభివృద్ధికి విసి ప్రసన్న శ్రీ చేసిన కృషిని ప్రశంసించి సన్మానించి అభినందనలు తెలిపారు. విశ్వవిద్యాలయంలో ఇటీవల చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వీసీ తెలియ జేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో ఎస్టీ కమిషన్ తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వెంకటప్ప పేర్కొన్నారు. త్వరలో విశ్వ విద్యాలయంలో గిరిజనాభివృద్ధి భాష సంస్కృతికి సంబంధించిన పలు కార్యక్రమాలు చేపట్టవచ్చునని చర్చించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. విజయనిర్మల, టిఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు అక్కులప్ప నాయక్ టీఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప టిఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూడవత్ విష్ణు నాయక్ టీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రవీంద్ర నాయక్ బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలను వదలండి.. ఆరోగ్యాన్ని కాపాడుకోండి..

## ఆదిత్య డిగ్రీ కళాశాలల ఎన్.ఎస్.ఎస్.స్పెషల్ క్యాంపులు
## సే నోటు డ్రగ్స్ ర్యాలీలు శ్రమదానం, రిసోర్స్ పర్సన్‌ల సందేశాలు



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక కొంతమూరు, లలితా నగర్, హరి పురం, భార్గవ కళ్యాణ మండపంలో ఎన్ఎస్ఎస్ క్యాంపుల్లో రెండు చోట్ల ప్రత్యేక సేవ శిబిరంలో సోమవారం ఉదయం సే నోటు డ్రగ్స్ ర్యాలీ, యువర్ హెల్త్ ఈజ్ వెల్త్, మత్తు పదార్థాలను వదలండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి,వంటి నినాదాలతో ఉదయం ర్యాలీలు నిర్వహించారు. అనంతరం కొంతమూరులో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు రెండు చెరువులను త్రవ్వడంలో శ్రమదానం, మరికొందరు వాలంటీర్లు రెండు పార్కులను శుభ్రం చేయడంలోనూ నిర్విరామంగా శ్రమించారు. రాగాల చెరువును శుభ్రం చేశారు. మధ్యాహ్నం విశ్రాంత మునిసిపల్ కమిషనర్, ఆర్.డి.ఓగా చేసిన ఎం. జితేంద్ర చట్టంలో నున్న వివిధ యాక్ట్స్ గురించి సవివరంగా వాలంటీర్లకు బోధించారు. అంతేకాకుండా వ్యక్తిత్వ వికాస తరగతిని నిర్వహించారు. లలిత నగర్ లో ర్యాలీ అనంతరం ఎఫ్.ఎస్. ఎస్.కె.సుధాకర్ పట్నాయక్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తో వ్యక్తిత్వ వికాస అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం విజయ శంకర సంగీత పాఠశాలకు చెందిన ప్రిన్సిపాల్ డా. శ్రీనివాస్ తాను కూడా ఎన్ఎస్ఎస్ స్టూడెంట్నని, ఈరోజు మీ తెలుగు ఉపాధ్యాయిని, డి.ఆర్వో, సీతారామమూర్తి,కలెక్టర్ కీర్తి, జాయింట్ కలెక్టర్ల చేతుల మీదుగా సి పి బ్రౌన్ మీద ప్రసంగించి సత్కారాన్ని పొందారని తెలియ జేశారు. గోదావరి తీరంలో మహిళా డిగ్రీ కళాశాల వాలంటీర్ల శ్రమదానం తర్వాత ఇండియన్ యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ రాంబాబు బ్లడ్ డొనేషన్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. రక్తదానం చేయడంలో మెలకువలు రక్తదానం నిల్వ చేయడానికి పరిస్థితులు ఎటువంటి వారు రక్తదానం చేయవచ్చునువంటి విషయాలను, రక్తదానం చేయడానికి భయపడే వారికి అపోహలను తొలగించే విధంగా అద్భుతంగా ఉపన్యాసం ఇచ్చారు.వాలంటీర్లతో ఇంటరేక్షన్ సేషన్ నిర్వహించి వారిలో ఉన్న పలు అపోహలను తొలగించారు. ఐదు గంటలకు కార్యక్రమం ముగిసింది. మూడు రోజులుగా నిర్విరామంగా ఉభయ కళాశాలల వాలంటీర్లు క్యాంపును, శ్రమ కోర్చి విజయవంతంగా నిర్వహిస్తూ ఉత్సాహంగా పాల్గొంటున్న వాలంటీర్లను, రాజమండ్రి ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పి గంగిరెడ్డి ప్రిన్సిపాల్ సిహెచ్ ఫణికుమార్ ఎస్.కె ఎన్ రెహమాన్, ఎం. చంద్రశేఖర్, డి.రామకృష్ణ,ఆనంద్, ప్రసాద్లను అభినందించారు.

## కూటమి ప్రభుత్వం

# చెప్పేదొకటి.. చేసేదొకటి..

## మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిరసిస్తూ 12న ర్యాలీని విజయ వంతం చేయండి
## ప్రజల తరుపున ప్రతీ సమస్యపైన పోరాటం చేస్తాం.. - 8వ వార్డు రచ్చబండ కార్యక్రమంలో మాజీ ఎంపీ భరత్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మెడికల్ కాలేజీల ప్రయివేటీ కరణకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తేవడం ద్వారా ఈనెల 12వ తేదీన పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ చెప్పారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ సీపీ కోటి సంతకాల సేకరణ,బాబు షూరిటి మోసాలపై 8వ వార్డుకు రచ్చబండ కార్యక్రమం స్థానిక దానవాయిపేట మెయిన్ పార్క్ వెనుక, డామినోస్ పిజ్జా వద్ద, సోమవారం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగ మాజీ ఎంపీ భరత్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు.దీన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను అడ్డుకోడానికి జగనన్న పిలుపు మేరకు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, కోటి సంతకాల సేకరణ చేస్తున్నామని తెలిపారు. 8వ వార్డుకు సంబంధించి రచ్చబండ కార్యక్రమాన్నీ నాయకులు నల్లమిల్లి సత్యనారాయణ రెడ్డి ఏర్పాటును భరత్ అభినందించారు. కొత్తగా జగనన్న నిర్మిస్తున్న మెడికల్ కాలేజీలు ప్రైవేట్ పరం చేసి మధ్య దిగువ తరగతి చదివే పిల్లలు డాక్టర్ అవ్వాలనే వారి ఆశలను అడియాశలు చేసే విధముగా ఈ కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నది అని భరత్ చెప్పారు. ప్రజల సంక్షేమ పథకాలు అమలులో విఫలం, విద్యార్థుల ఉన్నత విద్యల చదువులకు ఆటంకపరిచే విధముగా సంస్కరణలు, మద్యం సిండికేట్ వ్యవహారాలు, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు ఇలా చెప్పుకుంటూ పోతే ఈ అరాచక పాలన కు అడ్డు అదుపు లేకుండా పోయింది. ప్రజలు విజ్ఞత గలవారు రాబోయే కార్పొరేషన్ ఎన్నికలలో జగనన్న పార్టీ నుండి నిలబడే అభ్యర్థులకు మీరు అండగా నిలబడి గెలిపిస్తే మీ తరపున మీ సమస్యల తరుపున వారు నిలబడతారు అలాగే వారికి వెన్నుదన్నుగా నేను నగరంలో ఉంటానని భరత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి సిటీ కుటుంబ సభ్యులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## కీర్తిచక్ర పందిళ్ళపల్లి శ్రీనివాస్

# యువతకు నిత్య చైతన్యం

## ఆయన త్యాగం స్ఫూర్తిదాయకం..
## నగరంలో పందిళ్ళపల్లి విగ్రహం ఏర్పాటునకు సన్నాహాలు
## అమరజీవికి ఘనంగా 34 వ వర్ధంతి నివాళి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన ఐఎఫ్ఎస్ అధికారి పందిళ్ళపల్లి శ్రీనివాస్ 34వ వర్ధంతి సందర్భంగా స్థానిక అన్నపూర్ణమ్మపేటలోని వారి ఇంటి వద్ద వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. కీర్తి చక్ర శ్రీనివాస్ చిత్రపటానికి ఆయన బంధువులు, స్థానికులు పుష్పాంజలి ఘటించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన సోదరుడు, కాకినాడ జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీహరి జగన్నాథరావు మాట్లాడుతూ అటవీ సంపద సంరక్షణలో గంధపు చెట్ల స్మగ్లర్ వీరప్పన్ చేతుల్లో వీరమరణం పొందిన కీర్తిచక్ర పందిళ్ళపల్లి శ్రీనివాస్ త్యాగాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని స్మరించుకునే విధంగా రాజమండ్రి నగరంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గత ఏడాది డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శ్రీనివాస్ బంధువులను వారి వద్దకు ప్రత్యేకంగా పిలిపించుకొని శ్రీనివాస్ విగ్రహం ఏర్పాటుకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. కీర్తి చక్ర శ్రీనివాస్ జయంతి సెప్టెంబర్ 12 లేదా జయంతి నవంబర్ 10వ తేదీ నాటికి నగరంలో ముఖ్య ప్రాంతంలో ఆయన విగ్రహాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే విగ్రహాన్ని తయారు చేయించడం జరిగిందన్నారు. కీర్తి చక్ర శ్రీనివాస్ గంధపు చెట్ల స్మగ్లర్ వీరప్పన్ ను తొలిసారిగా పట్టుకోవడం జరిగిందని, సత్యమంగళం అటవీ ప్రాంతంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి, అక్కడి ఆటవికులకు అండగా నిలిచారన్నారు. వీరప్పన్ వంచనతో శ్రీనివాస్ ను హతమార్చారన్నారు. కీర్తిచక్ర శ్రీనివాస్ మన రాజమహేంద్రవరం నగరానికి ఎంతో కీర్తిని తీసుకువచ్చారని, ఆయనను స్మరించుకోవడం మనందరి కర్తవ్యం అన్నారు.వైసిపి నాయకులు బురిడి త్రిమూర్తులు మాట్లాడుతూ పందిళ్ళపల్లి శ్రీనివాస్ అన్నపూర్ణమ్మ పేట వాసి కావడం మా అందరికీ ఎంతో గౌరవం, గర్వ కారణం అన్నారు. ఆయన యువతకు నిత్య చైతన్యం అన్నారు. పందిళ్ళపల్లి , వీరప్పన్ ను పట్టుకోవడమే బాధ్యతగా కాకుండా అక్కడ ఆదివాసీలను సంస్కరించడం, వారికి చదువు నేర్పించడం వంటి సామాజిక బాధ్యతను నిర్వర్తించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పందిళ్ళపల్లి శ్రీనివాస్ సోదరుడు సత్య నారాయణ, సోదరి రాజ్యలక్ష్మి, బావ రూప్ కుమార్, అన్నపూర్ణమ్మపేట యూత్, వివేకనంద స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు రాజేష్, ఫణి, సింహాచలం, శ్రీను, మురళీకృష్ణ,కాళ్ళ సత్యనారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు వైద్య విద్య అందుబాటులో ఉంచాలి

## మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి - తొస్సిపూడిలో రచ్చబండ నిర్వహణ



**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** నిరుపేదలకు వైద్య విద్యను అందు బాటులో వుంచే విధంగా చూడాలని అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి అన్నారు. అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం, తొస్సిపూడి గ్రామంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ - రచ్చబండ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే నిరుపేదలకు వైద్య విద్య, వైద్యం రెండూ అందని ద్రాక్షగా ఉండిపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వచ్చి సంతకాల సేకరణలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పోతుల వర ప్రసాద్ రెడ్డి (బుజ్జి) (బిక్కవోలు మండల వైయస్ఆర్‌సీపీ కన్వీనర్), ద్వారంపూడి వీర వెంకట రామారెడ్డి (తంబి) (గ్రామ ఉప సర్పంచ్), నల్లమిల్లి త్రినాధ్ రెడ్డి (బాబి) (గ్రామ అధ్యక్షులు), కర్రి సుబ్బారెడ్డి, ద్వారంపూడి వెంకట సత్యనారాయణ రెడ్డి (అబ్బులు), తేతలి శేఖర రెడ్డి, కర్రి వరలక్ష్మి, గుబ్బల అన్నవరం (మాజీ సర్పంచ్), విస్సాకోటి సుబ్బారావు (మాజీ సర్పంచ్), పలివెల జార్జి, మల్లిడి జగ్గిరెడ్డి (మాజీ వీఆర్ఓ), తేతలి రామారెడ్డి (కొట్టు రాము), సిహెచ్.చాణిక్య, మేడపాటి వెంకట కృష్ణా రెడ్డి, మేడపాటి ఆంజనేయ రెడ్డి, దాకమూర్తి అప్పన్న, పల్లి రాముడు, పల్లి రమణ తదితర వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇరిగేషన్ ఎంప్లాయిస్ అధ్యక్షుడు జయకుమార్‌కు అభినందన సత్కారం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరిగేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్.జయకుమార్‌ను డా. బి.ఆర్.అంబేద్కర్ మెమోరియల్ ఫ్రెండ్స్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు బి.జార్జి ఆంథోనీ ప్రసంగిస్తూ అయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి విచ్చేసినవారిలో గౌరవ అధ్యక్షులు రిటైర్డ్ డీఎస్పీ ఎ.ప్రసాద్ కుమార్, సంఘ అధ్యక్షులు నక్కా సోమేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ కె.సాయిబాబా, అడ్వైజర్ వి.డేవిడ్ రాజు, మెంబెర్స్ సీహెచ్.సరస్వతి రావు, టి.ఎస్.ప్రభాకర్, యు.సౌందర్య, అశోక్, ఎం.రాజుబాబు, వి.నవదీప్, సీహెచ్.ఆర్థర్ కాటన్ తదితరులు ఉన్నారు.

## కుక్కల, కోతుల, పందులను

# నివారించడంలో కార్పొరేషన్ విఫలం

## భిక్షాటన చేసే వారి బెడద నుంచి నగర ప్రజలను రక్షించాలి
## కోర్టులు ఆదేశాలను పట్టించుకొని అధికారులు
## సోమవారం పీజీఆర్ఎస్ లో అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేత
## జిల్లా అధ్యక్షులు డాక్టర్ టి.కె. విశ్వేశ్వరరెడ్డి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సోమవారం ఉదయం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ లో జరిగిన గ్రీవెన్స్ సెల్ లో అడిషనల్ కమిషనర్ వారికి తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తో కలిసి రాజమహేంద్రవరంలో కుక్కలు, పందులు, కోతులు బెడద లేకుండా చేయాలని అలాగే భిక్షాటన చేయువారి బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం గేటు వద్ద తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ నగరంలో కుక్కలు, పందులు, కోతులు, భిక్షాటన చేయు వారి బెడద చాలా ఎక్కువగా ఉందని దానిని నిర్మూలించడంలో మున్సిపల్ యంత్రాంగం మొత్తం విఫలమయ్యారని అంటూ రాష్ట్రంలో భిక్షాటన చేయటాన్ని నిషేధిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు జీవో విడుదల చేశారని, అలాగే సుప్రీంకోర్టు వారు కుక్కలను కట్టడి చేసి జన నివాస ప్రాంతాల్లో కుక్కలు, పందులు, ఆవులు తిరగకుండా చూడాలని ఆదేశాలు ఇచ్చారని వాటిని అమలు చేయకుండా మున్సిపల్ అధికారులు తస్సరాం చేస్తున్నారని, 2027లో రాజమహేంద్రవరంలో గోదావరి నదికి పుష్కరాలు జరగబోతున్నాయని ఇప్పటినుండి కుక్కల, పందుల, కోతుల మరియు బిక్షాటన చేయు వారి బెడద నివారించకపోతే వచ్చే భక్తులు కూడా భయ పడతారని అందువలన మున్సిపల్ కమిషనర్ తగు చర్యలు ఇప్పటినుండే తీసుకోవాలని అన్నారు. బిక్షాటన చేయు వారిలో ఈ 50శాతం గంజాయి తాగడం, అమ్మడం వంటి అసాంఘిక కార్యక్రమాలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు చేసేవారు ఉన్నారని వారిని పోలీసు వారు గుర్తించి వారిపై తగు చర్యలు వెంటనే తీసుకొని రాజమహేంద్రవరం ప్రజలను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి మాజీ సెక్రటరీ బెజవాడ రంగా, జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, నగర ఎస్సీ సెల్ చైర్మన్ బత్తిన చంద్రరావు, జిల్లా డాక్టర్ సెల్ చైర్మన్ డాక్టర్ రాజశేఖర్, జిల్లా లింగ్విస్టిక్స్ చైర్మన్ కిషోర్ జైన్, సురేష్, సతీష్, వెంకట్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ 12న నిరసన ర్యాలీ విజయవంతం చేయండి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసీపీ పాలనలో నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్థాపించిన 17 మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ యువజన విభాగం రాజమండ్రి సిటీ అధ్యక్షుడు బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో సోమవారం మెయిన్ రోడ్డులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు పార్టీ జాతీయ అధికార ప్రతినిధి,రాజమండ్రి సిటీ అధ్యక్షుడు మార్గాని భరత్ రామ్ ఆశీస్సులతో ఈ సంతకాల సేకరణ నిర్వహించారు. పెద్దమసీదు సెంటర్ నుంచి ప్రారంభమైన సంతకాల సేకరణలో వ్యాపారులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. బిల్డర్ చిన్న ప్రతి దుకాణానికి వెళ్ళి వ్యాపారులను కలిసి సంతకాలు సేకరించారు.ఈ సందర్భంగా బిల్డర్ చిన్న,వైసీపీ జిల్లా అధికార ప్రతినిధి రొక్కం త్రినాధ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య అందనంత దూరమవుతుందని ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ ఆసుపత్రులు పూర్తిగా ప్రభుత్వ అధీనంలో కొనసాగాలని వారు డిమాండ్ చేశారు.మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 12న జరిగే నిరసన ర్యాలీలో ప్రజలంతా పాల్గొనాలని బిల్డర్ చిన్న,రొక్కం త్రినాధ్ కోరారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు బూర కనకలింగేశ్వరరావు,మండల ఎస్సీ సెల్ నాయకుడు ఉంద్రాజవరపు సూర్య,కార్యదర్శి రొక్కం వంశీ, శ్రీను, టి.విజయ్, టి.శివ, టి.అశోక్, దువ్వాడ గౌరీ శంకర్, కటకం చిన్న తదితరులు పాల్గొన్నారు.

## జోగికి దక్కని ఔదార్యం..
# జగన్ ఆలోచన మారిందా..?

ఇక ఈ నెల 4న నెల్లూరు సెంట్రల్ జైలుకు వెళ్లిన మాజీ మంత్రి జోగికి పార్టీ నుంచి అందుతున్న సహకారంపై విస్తృత చర్చ జరుగుతోంది. కల్తీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టు అయి వారం రోజులు దాటుతోంది. ఈ నెల 2న ఆయన అరెస్టు కాగా, ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా వ్యవహరిస్తున్నారు. 13వ తేదీవరకు ఆయన రిమాండ్ ఉంది. కోర్టు ఈ రిమాండును పొడిగిస్తుందా? లేక బెయిలు మంజూరు చేస్తుందా? అన్నది ఆ రోజు జరిగే విచారణలో తేలాల్సి వుంది. బెయిలు కోసం మాజీ మంత్రి జోగి తరపు న్యాయవాదులు న్యాయ పోరాటం చేస్తున్నారు. కల్తీ మద్యం కేసులో జోగి పేరు తెరపైకి వచ్చిన నుంచి ఆయన చాలా ఆందోళన చెందారు. తన తప్పు లేదని చెప్పుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. దేవుడిపై ఓట్టు పెట్టి, దీపాలు ఆర్పి తాను సచ్ఛీలుడిగా చెప్పుకున్నారు. కానీ, ఆయనను పోలీసులు విడిచిపెట్టలేదు. తన తప్పులేదని జోగి ఎంత గగ్గోలు పెట్టినా, ప్రభుత్వం విడిచిపెట్టలేదు. ఇక ఈ నెల 4న నెల్లూరు సెంట్రల్ జైలుకు వెళ్లిన మాజీ మంత్రి జోగికి పార్టీ నుంచి అందుతున్న సహకారంపై విస్తృత చర్చ జరుగుతోంది. కల్తీ మద్యం కేసులో జోగిని ఇరికించారని వైసీపీ ఆరోపిస్తోంది. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి ఎదుట ఆందోళనకు దిగారనే కారణంగానే జోగిపై తప్పుడు కేసు బనాయించారని వైసీపీ విమర్శలు చేస్తోంది. అయితే కేసు ఏదైనా కోర్టు రిమాండ్ విధించడంతో జైలు పాలైన జోగిని తన పార్టీ నేతలు ఎవరూ పరామర్శించకపోవడమే చర్చకు దారితీస్తోంది. ఈ నెల 4న సెంట్రల్ జైలుకు వెళ్లిన జోగికి నెల్లూరు జిల్లాకు చెందిన ఇద్దరు నేతలు మాత్రమే కలిశారు. మాజీ మంత్రి కాకాణి, ఎమ్మెల్సీ పర్వత చంద్రశేఖరరెడ్డి మాత్రమే జోగి జైలుకు వెళుతుండగా, వచ్చి ఓదార్చారు. కానీ, ఇంతవరకు వైసీపీకి చెందిన ఏ నేత జైలులో జోగిని కలవకపోవడానికి కారణాలేంటన్నది ఎవరికీ అంతుచిక్కడం లేదు. మాజీ ముఖ్యమంత్రి జగన్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జలతోపాటు వైసీపీ కీలక నేతలు అంతా జోగి అరెస్టును ఖండిస్తూ ప్రకటనలిచ్చారు. కానీ, ఏ ఒక్కరూ ఆయనను కలిసేందుకు నెల్లూరు వెళ్లకపోవడంపై హాట్ డిబేట్ జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వైసీపీలో చాలా మంది అరెస్టు అయ్యారు. అయితే ముఖ్యనేతలు అరెస్టు అయితే మాజీ సీఎం జగన్ వ్యక్తిగతంగా జైలుకు వెళ్లి వారిని పరామర్శించి మనోధైర్యం కల్పించేవారు. మాజీ మంత్రి కాకాణి, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని, మాజీ ఎంపీ నందిగాం సురేశ్ వంటివారు జైలులో ఉంటే మాజీ సీఎం జగన్ ఆయా జైళ్లకు వెళ్లి తన పార్టీ నేతలను ఓదార్చి వచ్చేవారు. కానీ, జోగి విషయంలో మాత్రం అధినేత ఆలోచన ఏంటి అన్నది ఇంతవరకు బయటపడలేదు. అయితే, వైసీపీ వర్గాల సమాచారం ప్రకారం జోగి పరామర్శపై అధినేత జగన్ ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని అంటున్నారు. ఆయనకు కొద్ది రోజుల్లో బెయిలు వచ్చే పరిస్థితి ఉందని జగన్ భావిస్తున్నారని చెబుతున్నారు. బెయిలుపై బయటకు వచ్చాక జోగి ఇంటికి వెళ్లి పరామర్శిస్తారని వైసీపీ కార్యాలయ వర్గాలు చెబుతున్నాయి. అయితేతమ నేత వారం రోజులు పైగా జైలులో ఉండటంతో డీలాపడ్డారని కార్యకర్తలు ఆవేదన చెందుతున్నారు. పార్టీ నేతలు వచ్చి కలిస్తే జోగితోపాటు ఆయన కుటుంబానికి ధైర్యం వస్తుందని అంటున్నారు. కానీ, పార్టీలో ఇంతవరకు జోగి పరామర్శపై చర్చించే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన కీలక నేత అయిన జోగిని ఆ జిల్లాకు చెందిన నేతలు కూడా కలకపోవడంపై కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## ఆ నియోజకవర్గాల్లో
# వైసీపీ వాయిస్ కొలాప్స్..!



ఏమాటకు ఆమాట చెప్పాలంటే.. కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీకి బలమైన కేడర్ ఉంది. అది స్థానికంగా ఉన్న నాయకుల వల్ల మరింత పెరిగిందనే చెప్పాలి. ఏమాటకు ఆమాట చెప్పాలంటే.. కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీకి బలమైన కేడర్ ఉంది. అది స్థానికంగా ఉన్న నాయకుల వల్ల మరింత పెరిగిందనే చెప్పాలి. దీంతో వైసీపీ అధికారంలో ఉన్నా.. లేకపోయినా.. సదరు నియోజకవర్గాల్లో నేతల వాయిస్ బలంగా వినిపించేది. దీంతో ఆ పార్టీ పనులు కూడా అలానే జరిగాయి. అయితే.. గత ఏడాది ఎన్నికల్లో జరిగిన ఘోర పరాభవం తర్వాత.. సదరు నియోజకవర్గాల్లో సగానికి సగం పైగా వాయిస్ లెస్ అయిపోయాయి. ఉదాహరణకు కొన్ని నియోజకవర్గాలను పరిశీలిస్తే.. మాచర్ల.. పల్నాడు జిల్లాలోని ఈ నియోజకవర్గంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హవా కొనసాగింది. పిన్నెల్లి సోదరులు గీసిన గీత దాటేందుకు అధికారులు కూడా భయపడే వారన్న వాదన కూడా వినిపించింది. టీడీపీ శ్రేణులు, నాయకులు అయితే.. పిన్నెల్లి హవాకు భయపడి వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. అయితే.. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు పిన్నెల్లి సోదరులు కేసుల ఊబిలో చిక్కుకున్నారు. దీంతో వారి వాయిస్ కానీ.. వారి హవా కానీ.. కనిపించడం లేదు.

**మంగళగిరి:** ఒకప్పుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి హవా కనిపించింది. ఇక్కడ టీడీపీ ఉన్నా.. పెద్దగా లేదు. దీంతో ఆళ్ల రామకృష్ణారెడ్డి వర్గం దూకుడుగా ఉండేది. వైసీపీ ప్రభావం కూడా ఎక్కువగా కనిపించింది. కానీ, గత ఎన్నికలకు ముందు వైసీపీ మార్పుల కారణంగా ఇప్పుడు ఇక్కడ ఆ పార్టీ హవా పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. ఆళ్ల ఇప్పుడు ఏం చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఇక, వైసీపీ జెండా మోసే కార్యకర్తలు కూడా లేకుండా పోయారు.

**చంద్రగిరి:** చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఆయనకుమారుడు మోహిత్ రెడ్డిల దూకుడుతో దాదాపు 10 సంవత్సరా ల పాటు.. ఈ నియోజకవర్గంలో వైసీపీ జెండా రెపరెపలాడింది. కానీ, అక్రమ మద్యం కుంబకోణంలో చిక్కుకోవడం.. రాజకీయంగా ఇక్కడ టీడీపీ పుంజుకోవడంతో వైసీపీ హవా నేలమట్టమైంది. అదేవిధంగా గుడివాడలో దాదాపు 25 సంవత్సరాల పాటు కొడాలి నాని హవా కొనసాగినా. ఇప్పుడు ఆయన ఊసు లేకుండా పోయింది. గన్నవరంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇలా.. దాదాపు 30 నియోజకవర్గాల్లో వైసీపీ వాయిస్ కొలాప్స్ అయిందనే టాక్ రాజకీయ వర్గాల్లోవినిపిస్తోంది.

# ఏపీని కుదిపేస్తున్న 'కాగ్'.. వాస్తవాలేంటి?



ఏపీలో సరికొత్త వ్యవహారం తీవ్ర చర్చకు, రాజకీయ రచ్చకు కూడా తెరదీసింది. సోషల్ మీడియాలో సర్కారును కార్నర్ చేస్తూ.. కొందరు కీలక వ్యాఖ్యలు చేస్తున్నారు. కాగ్.. ఇచ్చిన నివేదిక ఆధారంగా.. వారు చేస్తున్న వ్యాఖ్యలు.. దుమారం రేపుతున్నాయి. అయితే.. దీనిపై ఆర్థిక నిపుణులు.. కొన్ని కామెంట్లు చేస్తున్నారు. ఈ వ్యవహారం మొత్తంగా అసలు కాగ్ ఏం చెప్పింది.. వాస్తవాటేంది? విమర్శలు కరెక్టేనా అనేది ఆసక్తిగా మారింది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్).. ప్రతి రాష్ట్రానికి చెందిన ఆదాయ వ్యయాలకు సంబంధించిన నివేదికలు ఇస్తుంది. గతంలో ఏడాదికి ఒక్కసారి మాత్రమే కాగ్ రిపోర్టులు వచ్చేవి. ఇవి కేంద్రప్రభుత్వానికి కూడా వర్తిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్రం చేస్తున్న ఖర్చులు, ఆదాయం, అప్పులు వంటి వివరాలను వెల్లడిస్తుంది. అదేవిధంగా రాష్ట్రాల జీడీపీ, కేంద్ర జీడీపీ, పన్నుల ఆదాయం ఇలా.. దేనికి దానికి లెక్కలు వెల్లడిస్తుంది. దీని ఉద్దేశం ప్రభుత్వాలను అలెర్ట్ చేయడమే. ఇలా.. తాజాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఏప్రిల్-సెప్టెంబర్ ఆరు మాసాలకు సంబం ధించిన రిపోర్టును కాగ్ గత శుక్రవారం తన వెబ్‌సైట్‌లో పెట్టింది. దీనిలో దేశవ్యాప్తంగా అన్నిరాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సహా కేంద్ర ప్రభుత్వ గణాంకాలు కూడా ఉన్నాయి. ఈ క్రమంలో ఏపీ విషయం రచ్చగా మారింది. దీనికి కారణం.. ఈ ఆరు మాసాల్లోనే ప్రభుత్వం 63 వేల కోట్ల రూపాయలను అప్పులు చేసిందని కాగ్ పేర్కొంది. అదేసమయంలో జీఎస్టీ ఆదాయంలో 2 వేల కోట్ల కోత పడిందని తెలిపింది. ఈ విషయంపైనే ఇప్పుడు రచ్చ సాగుతోంది. వైసీపీ హయాంకు ఇప్పటికీ.. పోలిక పెడుతూ.. విమర్శలు వస్తున్నాయి. అయితే.. వాస్తవం ఏంటనేది కాగ్ నివేదికలోనే పేర్కొంది. అప్పులు చేసిన సొమ్మును ఏం చేశారన్నది కూడా కాగ్ పేర్కొంది. అమరావతి రాజధానికి.. అదేవిధంగా విపత్తులు, సహా.. ప్రభుత్వం పెడుతున్న మౌలిక వసతుల పెట్టుబడులకు ఎక్కువగా ఖర్చు అవుతోందని తెలిపింది. ఇక, దేశవ్యాప్తంగా జీఎస్టీ తగ్గిన ప్రభావం ఏపీపైనా పడిందన్న విషయాన్ని పేర్కొంది. ఇక, అప్పుల విషయానికి వస్తే.. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు అప్పులు చేస్తున్నాయి. ఇదే విషయాన్ని ప్రస్తావించిన కాగ్.. ఏపీలో అప్పులు చేస్తున్నా.. మూలధన వ్యయానికి.. మూలధన పెట్టుబడులకు(అంటే రాబడి వచ్చే పథకాలు) ఖర్చు చేస్తున్నట్టు పేర్కొంది. ఇది ఒకరకంగా ఇప్పుడు ఆదాయం చూపించక పోయినా.. వచ్చే రెండేళ్లలో ఆదాయం వచ్చేలా చేస్తుందని కూడా పేర్కొంది. ఇక, రహదారులు, వంతెనల నిర్మాణం ఊపందుకున్నట్టు తెలిపింది. ఇవి కూడా మౌలిక సదుపాయాల పరిధిలోనే ఉన్నాయి. సో.. మొత్తానికి -కాగ్- నివేదికలోని పూర్తి సారాంశం చదవకుండానే కొందరు చేస్తున్న విమర్శలకు నిపుణు లు.. ఇదే చెబుతున్నారు. పూర్తిగా అధ్యయనం చేయాలని సూచిస్తున్నారు. కాగ్ నివేదికలో అనేక సూచన లు, మూల ధన వ్యయానికి సంబంధించిన సలహాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. కానీ, దీనికి రాజకీయ రంగు పులుముకోవడంతో రచ్చగా మారిందని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

# టీటీడీ పెర్ఫార్మెన్స్‌పై అంబటి రాంబాబు ప్రశంసలు.. వీడియో వైరల్!



అవును... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమలలో లడ్డు ప్రసాదం నుంచి అన్నప్రసాద సౌకర్యాల నిర్వహణ వరకూ పలు ఫిర్యాదులు అందిన సంగతి తెలిసిందే. నిజం చెబితే తప్పేముంది, వాస్తవాలు మాట్లాడాలి అనుకున్నారో.. లేక, తాజా పరిణామాల నేపథ్యంలో అలా మాట్లాడారో తెలియదు కానీ... కూటమి ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం పనితీరుపై ప్రశంసలు కురిపించారు. ఈ మేరకు తన యూట్యూబ్ ఛానల్ లో సుమారు 4 నిమిషాల వీడియోను విడుదల చేశారు.. తిరుమల అన్న ప్రసాదాల నిర్వహణపై ప్రశంసలు కురిపించారు. అవును... గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమలలో లడ్డు ప్రసాదం నుంచి అన్నప్రసాద సౌకర్యాల నిర్వహణ వరకూ పలు ఫిర్యాదులు అందిన సంగతి తెలిసిందే. ఇక లడ్డూలో కల్తీ నెయ్యి వాడకం వ్యవహారం ఎంత వివాదాస్పదమైందనేది తెలిసిన విషయమే. అయితే ఇప్పుడు లెక్కలు పూర్తిగా మారాయని అంటున్నారు. ఈ క్రమంలోనే మాజీమంత్రి అంబటి తన స్వానుభవాన్ని పంచుకున్నారు. తరిగొండ వెంగమాంబ అన్నవితరణ కేంద్రంలో అన్నప్రసాదాలు బాగున్నాయని మాజీమంత్రి, వైసీపీ కీలక నేత కితాబిచ్చారు. ఇక్కడ భోజనం రుచిగా, శుచిగా ఉన్నట్లు తెలిపారు. నాణ్యమైన అన్నప్రసాదాలు భక్తులకు పెడుతున్నారని.. తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం కుటుంబ సభ్యులతో తిరుమలలో అన్న ప్రసాదం స్వీకరించినట్టు చెప్పారు. వైసీపీ కీలక నేత, జగన్ కు అత్యంత సన్నిహితులు, విశ్వసనీయ సహచరుల్లో ఒకరుగా ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన ప్రశంసలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్ గా మారాయి. ఈ తరహా ప్రశంసలు ఇప్పటికే స్వామివారి భక్తుల నుంచి వస్తున్నప్పటికీ.. అంబటి వ్యాఖ్యలు కచ్చితంగా ప్రత్యేకమనే చెప్పాలి. భూమనకు ఇది బిగ్ షాకేనా?: కూటమి ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం పూర్తిగా దెబ్బ తిందని.. కొత్త ఛైర్మన్ వల్ల భక్తులకు ఒరిగిందేమీ లేదని.. భక్తులకు అందించిన ప్రత్యేక సేవలు అంటూ ఏమీ లేవని.. బీఆర్ నాయుడు ఏడాది పాలన, అసమర్థుని జీవన యాత్ర లాగా అమోఘంగా ఉందని.. చేతలకు చెల్లుచీటి, కోతలకు ధనుష్కోటి.. కన్యాశుల్కం గిరీశంకు తలదన్నే విధంగా కోతలు కోస్తున్నారని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఇటీవల ఘాటుగా ఫైరయిన సంగతి తెలిసిందే. అయితే... తిరుమల తిరుపతి దేవస్థానం పెర్ఫార్మెన్స్ పై అన్నమంతా పట్టుకుని చూడనవసరం లేదు, ఒక మెతుకు పట్టుకున్నా చాలు అన్నట్లుగా.. అన్నప్రసాదాలు చాలా బాగున్నాయంటూ అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు భూమనకు బిగ్ షాకేనా అని అంటున్నారు నెటిజన్లు! ఏది ఏమైనా రాజకీయాలకు అతీతంగా టీటీడీ ఎప్పుడూ పచ్చ తోరణం నిత్య కల్యాణంలా ఉండాలని భక్తులు కోరుకుంటున్నారు!

## బూటు విసిరినట్లు వీడియో సృష్టించారు

దిల్లీ

కృత్రిమ మేధ (ఏఐ) వల్ల హాని కూడా ఉంటుందని, తన కోర్టు రూంలో షూ విసిరినట్లు కల్పించిన వీడియో గురించి తెలుసునని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ చెప్పారు. న్యాయవ్యవస్థలో ఏఐ సాధనాల వాడుకను నియంత్రించడానికి మార్గదర్శకాలు రూపొందించేలా చూడాలని కోరుతూ దాఖలైన అభ్యర్థనపై రెండువారాల తర్వాత వాదనలు వినడానికి ఆయన నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం అంగీకరించింది. ఎలాంటి తనిఖీలేని ఏఐ సాధనాలను కోర్టు వ్యవహారాల్లో వాడుతున్నారని పిటిషనర్ తరపు న్యాయవాది అభినవ్ శ్రీవాస్తవ తెలిపారు. ఒక పద్ధతి ప్రకారం ఇవి పక్షపాతంతో వ్యవహరిస్తాయని, దాని తార్కికత గురించి వాటిని సృష్టించినవారికీ అర్థంకానంత అపారదర్శకత ఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. వాడుకదారు ఉద్దేశించని పదాలు, చిత్రాలను కూడా చూపించేలా సంక్లిష్ట ప్రక్రియ ఉంటుందని, అది అనేక సమస్యలకు దారితీస్తుందని చెప్పారు. న్యాయవ్యవస్థలో వాడే ఏఐలో డేటా నిష్పక్షపాతంగా ఉండాలని, దానిలో భాగస్వాములైనవారికి జవాబుదారీతనం నిర్ణయించాలని తెలిపారు. లేనిపక్షంలో సైబర్‌దాడుల ముప్పు ఎక్కువగా ఉంటుందన్నారు. ఎలాంటి విపరిణామాలు ఉంటున్నాయంటే.. అని ఆయన వాదన కొనసాగించబోతుండగా సీజేఐ జోక్యం చేసుకున్నారు. '..దాని గురించి మాకు తెలుసు. మాపైనా ఎలాంటి వీడియోను కల్పించారో చూశాం' అని చెప్పారు. సాధారణ ఏఐకి, జనరేటివ్ ఏఐకి మధ్య చాలా వ్యత్యాసముందని న్యాయవాది కార్తికేయ రావల్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. జెన్ ఏఐని న్యాయవ్యవస్థలోకి తీసుకువస్తే అది ఉనికిలో లేని చట్టాలను కూడా రూపొందిస్తుందన్నారు. దీనిని నియంత్రించే మార్గదర్శకాలు రూపొందించేలా ఆదేశాలు జారీ చేయాలని సుప్రీంకోర్టును కోరారు.

## బిహార్లో నేడే తుది పోరు

పట్నా

బిహార్ అసెంబ్లీ ఎన్నికలు చివరి అంకానికి చేరాయి. రెండోది, చివరి విడత ఎన్నికల్లో 122 స్థానాలకు మంగళవారం పోలింగ్ జరుగనుంది. వివిధ ప్రధాన పార్టీల నేతలు సహా 1,302 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 3.75 కోట్ల మంది ఓటర్లు వీరి భవితవ్యాన్ని ఈవీఎంలతో నిక్షిప్తం చేయనున్నారు. వీరిలో 1.75 కోట్ల మంది మహిళలే. 18–19 ఏళ్ల వయసుగల నవయువ ఓటర్లు 7.69 లక్షల మంది. సజావుగా పోలింగ్ నిర్వహణకు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లూ చేసింది. 45,399 పోలింగ్ కేంద్రాలను సిద్ధంచేసింది. వీటిలో 40,073 కేంద్రాలు గ్రామీణ ప్రాంతంలో ఉన్నాయి. 8,491 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వీటిలో ఒక్క గయాజీలోనే 1,084 కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు మొత్తం 122 స్థానాల్లోనూ భారీగా భద్రతాబలగాలను మోహరించారు. ఇప్పటికే 500 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ముందస్తు ఎన్నికల విధుల్లో ఉండగా.. వీటితోపాటు మరో 500 కంపెనీల సాయుధ సిబ్బందికి పోలింగ్ బాధ్యతలు అప్పటించారు. వీరుగాక 60 వేల మంది బిహార్ పోలీసులు, 30 వేల బిహార్ సాయుధ పోలీసు సిబ్బంది, 20 వేల మంది హోంగార్డులు, శిక్షణలో ఉన్న మరో 19 వేల మంది కొత్త పోలీసులు, ఇతర రాష్ట్రాలకు చెందిన 2 వేల మంది సిబ్బందిని మోహరించారు. నవాదా జిల్లా హిసువా స్థానంలో అత్యధికంగా 3.67 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. లౌరియా, చంపటియా, రక్సౌల్, త్రివేణిగంజ్, సుగౌలీ, బణ్‌మన్‌ఖీ సీట్లలో 22 మంది చొప్పున అభ్యర్థులు బరిలో నిలిచారు. అసెంబ్లీలోని మొత్తం 243 స్థానాలకు గాను 121 స్థానాలకు ఈ నెల 6న జరిగిన మొదటి దశ ఎన్నికల్లో 65 శాతానికిపైగా పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. రెండు దశల్లో కలిపి ఈ నెల 14న ఓట్లు లెక్కించి తుది ఫలితాలను ప్రకటిస్తారు.

**సీమాంచల్‌పైనే పార్టీల దృష్టి**

ఎన్నికలు జరిగే జిల్లాల్లో అత్యధికం పూర్వాంచల్ ప్రాంతంలోనే ఉన్నాయి. ఇది ముస్లిం ప్రాబల్య ప్రాంతం కావడంతో బీజేపీ–జేడీయూ నేతృత్వంలోని పాలక ఎన్‌డీఏ, విపక్ష ఇండీ కూటమి పార్టీలతో కూడిన మహాగఠ్‌బంధన్ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ముస్లిం ఓట్లు తనకేనని గఠ్‌బంధన్ భావిస్తుండగా.. చొరబాటుదార్లకు విపక్షం అండగా నిలుస్తోందని ఎన్‌డీఏ ఆరోపిస్తోంది. నితీశ్‌కుమార్ క్యాబినెట్‌లోని పలువురు మంత్రులు బిజేంద్రప్రసాద్ యాదవ్ (సుపాల్), లేశీ సింగ్ (ధమ్‌దాహా), షీలా మండల్ (ఫుల్‌పరాస్), జమాఖాన్ (చైన్‌పూర్)–జేడీయూ.. ప్రేమ్‌కుమార్ (గయ), రేణుదేవి(బెతియా), నీరజ్‌కుమార్ సింగ్(ఛతర్‌పూర్), మాజీ ఉపముఖ్యమంత్రి తార్‌కిశోర్ ప్రసాద్ (కతిహార్)–బీజేపీ.. పీసీసీ అధ్యక్షుడు రాజేశ్‌కుమార్ (కుటుంబ), కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత షకీల్ అహ్మద్ ఖాన్ (కద్వా), సీపీఐఎంఎల్–లిబరేషన్ పక్ష నేత మెహబూబ్ ఆలం (బలరాంపూర్) బరిలో ఉన్నారు. కాగా, హెచ్ఏఎంకు కేటాయించిన ఆరు స్థానాలకు, ఆర్ఎల్ఎంకు ఇచ్చిన ఆరు స్థానాల్లో నాలుగింటికి రెండో దశలోనే పోలింగ్ జరుగుతోంది.

**స్త్రీ-పురుష వారీ ఓటింగ్ వివరాలేవీ?: తేజస్వీ**

బిహార్‌లో జరిగిన తొలి దశ ఎన్నికల్లో స్త్రీ–పురుషుల వారీగా ఓటింగ్ వివరాలను ఎన్నికల కమిషన్ వెల్లడించకపోవడాన్ని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రశ్నించారు. ఈ నెల ఆరో తేదీన తొలి దశ ఎన్నికలు జరిగాయని, సోమవారం నాటికి నాలుగు రోజులు పూర్తయినా ఆ వివరాలను ప్రకటించలేదని చెప్పారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని, ఇంతకుముందు ఎన్నికలయిన వెంటనే ఈ సమాచారం బహిర్గతమయిదేని గుర్తు చేశారు.

## న్యాయవాదుల వస్త్రధారణతో కరడుగట్టిన నేరగాళ్లు వస్తున్నారు!

దిల్లీ



న్యాయస్థానాల ప్రాంగణాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. న్యాయవాదుల వస్త్రధారణలో కరడుగట్టిన నేరగాళ్లు కోర్టుల వద్దకు వస్తున్నారని పేర్కొంది. దేశంలోని పలు ట్రయల్ కోర్టుల వద్ద పోలీసులు, కక్షిదారులతో న్యాయవాదుల ఆహార్యంలో ఉన్న వ్యక్తులు ఘర్షణలకు దిగిన ఘటనలను ప్రస్తావిస్తూ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం సోమవారం ఈ వ్యాఖ్యలు చేసింది. 'పంజాబ్, హరియాణా, దిల్లీల్లోని కోర్టుల వద్దకు నేరగాళ్లు.. న్యాయవాదుల మాదిరిగా నల్ల కోట్లు ధరించి వచ్చి పోలీసులు, ఇతర కక్షిదారులపై దాడులకు పాల్పడ్డారు. ఆ నేరగాళ్లను ముందే గుర్తించే యంత్రాంగమేదీ పోలీసులకు లేదు. పిటిషనర్లు, పోలీసులు, న్యాయవాదుల మధ్య కూడా ఇటీవల ఘర్షణలు జరుగుతున్నాయి' అని ధర్మాసనం తెలిపింది. ఈ తరహా ఘటనలను నివారించేలా, ట్రయల్ కోర్టుల వద్ద భద్రతను పెంపొందించేలా దేశమంతటికీ మార్గదర్శకాలు రూపొందిస్తామని వెల్లడించింది. కోర్టు పనివేళల్లో, కోర్టు ప్రాంగణంలో ఎవరినైనా అరెస్టు చేయడం/నిర్బంధించడం, అదుపులోకి తీసుకోవడం వంటి చర్యలను పోలీసులు సంబంధిత జడ్జి అనుమతితోనే తీసుకోవాల్సి ఉంటుందన్న కేరళ హైకోర్టు ఆదేశాలను ఆ రాష్ట్ర పోలీస్ అధికారుల సంఘం సర్వోన్నత న్యాయస్థానంలో సవాల్ చేసింది. అలాంటి గంపగుత్త ఉత్తర్వు వివిధ సందర్భాల్లో పోలీసుల విధులను అడ్డుకుంటుందని అధికారుల సంఘం పేర్కొంది. ఈ వివాదానికి చాలా విస్తృత పరిధి ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం పేర్కొంది. దేశవ్యాప్త మార్గదర్శకాలు అవసరమని అభిప్రాయపడింది. తదుపరి విచారణను జనవరి నెలకు వాయిదా వేసింది.

# ఢిల్లీలో భారీ పేలుడు

-మొదటిపేజీ తరువాయి

కనిపించాయి. మృతదేహాలు ఛిద్రమై శరీర భాగాలు చెల్లాచెదురుగా రోడ్డుపైన, పక్కనే ఉన్న వాహనాలపైనా పడ్డాయి. పేలుడు ధాటికి.. చుట్టూ ఉన్న వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆరు కార్లు, రెండు ఈ–రిక్షాలు, ఒక ఆటో అగ్నికి ఆహుతైపోయాయి. మొత్తం 22 కార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఘటనాస్థలికి సమీపంలోని పలు దుకాణాలు ధ్వంసమయ్యాయి. భవనాలు కంపించాయి. ఈ పేలుడు జరిగిన మూడు నిమిషాలకే అగ్నిమాపక శాఖకు ఫోన్ కాల్ వెళ్లింది. వెంటనే ఏడు యూనిట్ల అగ్నిమాపక సిబ్బంది 20 ఫైరింజన్లతో అక్కడికి చేరుకుని మంటలార్పేందుకు రంగంలోకి దిగి.. 7.29 గంటలకల్లా.. అంటే పేలుడు జరిగిన 40 నిమిషాల్లోనే మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ పేలుడుకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని ఢిల్లీ పోలీసు కమిషనర్ సతీశ్ గోల్చా వెల్లడించారు. "సాయంత్రం 6.52 గంటలకు.. రెడ్‌ఫోర్ట్ మెట్రోస్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడడంతో నిదానంగా వచ్చిన ఒక కారు అక్కడ ఆగీ ఆగగానే పేలిపోయింది. ఆ సమయంలో ఆ కారులో ప్రయాణికులున్నారు. పేలుడు ధాటికి దాని చుట్టుపక్కలున్న వాహనాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి" అని ఆయన తెలిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసు బలగాలతోపాటు.. జాతీయ దర్యాప్తు సంస్థ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్, సీఆర్పీఎఫ్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ సహా పలు ఏజెన్సీల అధికారులు అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించినట్టు వివరించారు. పరిస్థితిని అనుక్షణం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు తెలుపుతున్నట్టు వెల్లడించారు. పేలిపోయిన కారులో ముగ్గురు ఉన్నట్టు మరో సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. "పేలుడు జరిగిన చోట ఎలాంటి గుంతా పడలేదు. పేలుడు ధాటికి గాయపడ్డవారి శరీరాల్లో ఎలాంటి పెల్లెట్లూ కనిపించలేదు. బాంబు పేలుడు అయితే ఇలా జరగడం అసాధారణం. దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం" అని ఆయన వివరించారు. అందులో భాగంగా.. ఆ కారు ఏయే ప్రాంతాల్లో తిరిగిందో తెలుసుకోవడానికి నగరంలోని అన్ని సీసీటీవీ కెమెరాలనూ జల్లెడపడుతున్నారు. పేలుడుకు ముందు ఏదైనా అనుమానాస్పదంగా కనిపించిందా? అని స్థానికులను, ప్రత్యక్షసాక్షులను ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రాంతంలో పేలుడుకు ముందు నమోదైన ఫోన్‌కాల్స్ డేటాను విశ్లేషిస్తున్నారు.



**కారెవరిది?**

హరియాణా రిజిస్ట్రేషన్‌తో ఉన్న హ్యూందాయ్ ఐ20 కారులో పేలుడు జరిగినట్టు పోలీసులు తెలిపారు. ఈ కారు నదీం అనే వ్యక్తి పేరిట ఉన్నట్టు సమాచారం. కారు యజమానిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిజానికి ఈ కారును ఏడాదిన్నర క్రితం సలీం అనే వ్యక్తి.. దేవేంద్ర అనే వ్యక్తికి విక్రయించాడని సమాచారం. గురుగ్రామ్ పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా.. దేవేంద్ర ఆ తర్వాత ఆ కారును హరియాణాలోని అంబాలకు చెందిన వ్యక్తికి అమ్మినట్టు తెలిసింది.

**భయంతో పరుగులు..**

"అంత పెద్ద భారీ పేలుడు శబ్దాన్ని మా జీవితంలో ఎప్పుడూ వినలేదు" అని ఘటనాస్థలికి సమీపంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు పలువురు తెలిపారు. "పేలుడు జరిగిన సమయంలో నేను నా దుకాణంలో ఉన్నాను. పేలుడు ధాటికి నా కుర్చీలోంచి కింద పడిపోయాను. వెంటనే లేచి బయటకు పరుగెత్తాను. చాలామంది ఆ సమయంలో తలోదిక్కుకూ పరుగులు తీయడం కనిపించింది" అని అక్కడి ఒక దుకాణదారు చెప్పారు. "నేను మా ఇంటి టెర్రస్ మీద ఉండగా.. పెద్ద పేలుడు శబ్దం వినిపించింది. చూస్తే దూరంగా అగ్ని జ్వాలలు. పేలుడు ధాటికి భవనాల కిటికీలు కదిలిపోయాయి" అని మరో ప్రత్యక్ష సాక్షి తెలిపారు. పేలుడు ఘటనతో ఢిల్లీని అనుకుని ఉన్న యూపీ జిల్లాల్లో పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. మతపరంగా, ఇతరత్రా సున్నితమైన ప్రార్థన మందిరాలు, ఢిల్లీ సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేశారు.

**మా వాళ్లని చూడనివ్వట్లేదు..**

ఈ పేలుడులో గాయపడ్డవారి కుటుంబసభ్యులు, బంధువులు.. విషయం తెలియగానే ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి చేరుకుని తమవారి కోసం ఆందోళనతో ఆరా తీశారు. గాయపడ్డ తమవారిని చూడ్డానికి ఆస్పత్రి సిబ్బంది తమను అనుమతించట్లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, పేలిన కారు కదలికల కోసం సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు.. ఆ కారు దరియాగంజ్ మార్కెట్ నుంచి బయల్దేరి సాయంత్రం 4 గంటల సమయానికి సునెహ్రీ మసీదు పార్కింగ్ ఏరియా వద్దకు చేరుకున్నట్టు గుర్తించారు. అనంతరం ఆ కారు మళ్లీ ఛత్తా రైల్‌చౌక్ వద్ద యూటర్న్ తీసుకుని.. లోయర్ సుభాష్ మార్గ్ దిశగా వెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. అక్కడ ఆ కారు సిగ్నల్ వద్దకు చేరుకుంటూ నెమ్మదించిందని.. అప్పుడు పేలుడు జరిగిందని ఓ అధికారి తెలిపారు. పేలుడు దెబ్బకు కారులో ఉన్న ముగ్గురూ ఛిద్రమైపోయారని తెలిపారు.

**పేలుడుకు కారణం ఇప్పుడే చెప్పలేం..**

పేలుడు ఘటనపై కేంద్రం హోంమంత్రి అమిత్ షా ఢిల్లీ పోలీసు కమిషనర్‌తో, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, ఎన్ఐఏ చీఫ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పేలుడు ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పేలుడుకు కారణం ఏంటి అనేది ఇప్పుడే చెప్పలేమన్నారు. అనంతరం ఆయన ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అక్కణ్నుంచీ నేరుగా ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇక.. సోమవారం రాత్రి 12 గంటల సమయానికి.. మృతుల్లో.. అశోక్, అమర్ అనే ఇద్దరిని మాత్రమే పోలీసులు గుర్తించారు. మిగతా మృతదేహాలు ఎవరివో ఇంకా గుర్తించాల్సి ఉంది. ఈ పేలుడు తమ పనేనని ఇంతవరకూ ఏ ఉగ్రసంస్థా ప్రకటించలేదు.

# భారీ ఉగ్ర కుట్ర భగ్నం

శ్రీనగర్/ఫరీదాబాద్

దేశంలో భారీ మారణ హోమం సృష్టించేందుకు పన్నాగం పన్నిన ఒక ముష్కరమూక గుట్టుమట్లను మూడు రాష్ట్రాల పోలీసు బృందం విజయవంతంగా ఛేదించింది. గత పక్షం రోజులుగా జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతున్న ముమ్మర సోదాలు, దాడుల్లో ఏకంగా 2,913 కేజీల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఏకే%–%56 రైఫిల్, ఏకే క్రిన్‌కోవ్ పిస్టల్, ఒక చైనీస్ స్టార్ పిస్టల్, ఇటలీ తయారీ బెరెట్టా పిస్టల్, ఒక సబ్‌మెషిన్ గన్, బుల్లెట్లు, మందుగుండుతోపాటు పేలుడు సంబంధ ముడి సరుకులు, రసాయనాలు, మండే ధాతు వులు, ఎలక్ట్రానిక్ సర్క్యూట్లు, బ్యాటరీలు, వైర్లు, రిమోట్ కంట్రోల్స్, టైమర్లు, వాకీటాకీ, మెటల్ షీట్లను పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. నేరమయ డాక్యుమెంట్లతోపాటు ఐఈడీ వంటి పేలుడుపదార్థాల తయారీ విధాన పత్రాలను పోలీసులు పట్టుకెళ్లారు. ఇటీవలికాలంలో ఇంత మొత్తంలో పేలుడు పదార్థాలను కశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పోలీసుల సంయుక్త బృందం స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారి. జైషే మొహమ్మద్, అన్సార్ ఘజ్వాత్%–%ఉల్%–%హింద్ ఉగ్రసంస్థలతో సంబంధాలున్న ముగ్గురు వైద్యులుసహా మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్‌చేశారు. వీళ్లలో ఒక మహిళా డాక్టర్ సైతం ఉండటం గమనార్హం. వీళ్లకు సంబంధించిన నివాసాలు, అద్దె ఇళ్లు, స్థలాల్లో సోదాల తర్వాత భారీ ఎత్తున పేలుడుపదార్థాల జాడను పోలీసులు కనుగొన్నారు. 350 కేజీల పేలుడు పదార్థం, అసాల్ట్ రైఫిల్, హ్యాండ్‌గన్ జాడను ఆదివారమే కనిపెట్టగా సోమవారం 2,563 కేజీల పేలుడు పదార్థాలను పట్టుకున్నారు. జమ్మూకశ్మీర్‌తోపాటు హరియాణాలోని ఫరీదాబాద్, ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లలో జరిగిన విస్తృతస్థాయి దాడుల్లో వీళ్లందరినీ అరెస్ట్‌చేశారు. అరెస్టయిన ఎనిమిది మందిలో ఏడుగురు కశ్మీరీలే కావడం గమనార్హం. అరిఫ్ నిసార్ దార్ అలియాస్ సాహిల్, యాసిర్ ఉల్ అష్రఫ్, మఖ్సూద్ అహ్మద్ దార్ అలియాస్ షాహీద్(నౌగమ్), మౌల్వీ ఇర్ఫాన్ అహ్మద్(షోపియాన్), జమీర్ అహ్మద్ అహంగీర్ అలియాస్ ముత్లాషా(వకురా), డాక్టర్ ముజామిల్ అహ్మద్ ఘనీ అలియాస్ ముసేబ్ (పుల్వామా), డాక్టర్ ఆదిల్(కుల్గామ్)లతోపాటు లక్నోకు చెందిన వైద్యురాలు



షాహీన్‌ను పోలీసులు అరెస్ట్‌చేశారు. అత్యంత గౌరవప్రద వైద్యవృత్తిలోని నిపుణులు, విద్యార్థులను ఉగ్రవాదంలోకి దింపి ముష్కరులు వైట్‌కాలర్ ఉగ్రనెట్‌వర్క్‌ను సృష్టించగా దాని గుట్టుమట్లను విజయవంతంగా ఛేదించామని సోమవారం జమ్మూకశ్మీర్ పోలీసు విభాగం ప్రకటించింది.

**పోస్టర్‌లతో మొదలై.. అరెస్ట్‌ల దాకా..**

కశ్మీర్‌కు చెందిన ఒక డాక్టర్ అరెస్ట్‌తో ఈ మొత్తం నెట్‌వర్క్ అంశం వెలుగులోకి వచ్చింది. కుల్గాంలోని వాన్‌పురాకు చెందిన డాక్టర్ ఆదిల్ అహ్మద్ రాటర్ భారత భద్రతాబలగాలను బెదిరిస్తూ శ్రీనగర్, బాన్‌పొరా నౌగామ్‌సహా పలుచోట్ల అక్టోబర్ 19న పోస్టర్లు అంటించాడు. సీసీటీవీ ఫుటేజీ ద్వారా ఇతడిని గుర్తించి పోలీసులు నవంబర్ ఏడో తేదీన అరెస్ట్‌చేశారు. అతడిని విచారించగా కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. కశ్మీర్‌లోని అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ వైద్యకళాశాలలో ఆదిల్‌కు చెందిన లాకర్‌ను తెరవగా అందులో ఏకే%–%47 రైఫిల్ లభించింది. మరింతగా విచారించగా ముజామిల్ ఘనీ షకీల్ అనే మరోవైద్యుడు సైతం ఈ ఉగ్రకుట్రలో భాగస్వామి అని తేలింది. తర్వాత అతడినీ అరెస్ట్‌చేశారు. షకీల్ ఇచ్చిన సమాచారంతో హరియాణాలోని ఫరీదాబాద్‌లో మూడేళ్లుగా అద్దె కడుతున్న ఒక లాడ్జ్‌లోని గదిలో పోలీసు బృందం ముమ్మర తనిఖీలుచేసి 8 పెద్ద, 4 చిన్న సూట్ కేసులు, ఒక బకెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో ఏకంగా 2,563 కేజీల ఐఈడీ పేలుడుపదార్థాలున్నాయి. దీనిని అమ్మోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, సల్ఫర్‌గా భావిస్తున్నారు. వాస్తవానికి షకీల్ కశ్మీర్‌లోని పుల్వామాలోని కోలీవాసి. ప్రస్తుతం ఇతను హరియాణాలోని ఆల్%–%ఫలాహ్ మెడికల్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో సీనియర్ డాక్టర్‌గా పనిచేస్తున్నాడు.

**ఢిల్లీలో మతవిద్వేషాలు రెచ్చగొట్టడమే మా లక్ష్యం**

ఢిల్లీ%–%జాతీయ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్) లో మత కల్లోలాలు, విధ్వంసం సృష్టించడమే లక్ష్యంగా దాడులతో తెగబడాలని పాకిస్తాన్, కశ్మీర్‌లోని హ్యాండ్లర్‌ల నుంచి ఆదేశాలు వచ్చాయని అరెస్టయిన షకీల్, ఆదిల్ విచారణలో బయటపెట్టారు. అయితే ఏఏ లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారో వాళ్లకు ఇంకా ఆదేశాలు రాలేదు. " ఢిల్లీ%–%ఎన్‌సీఆర్ ప్రాంతంలో వైద్యులను ఉగ్రకోణంలో ఎవరూ అనుమానించబోరు. అందుకే మమ్మల్నే ఈ పనికి ఎంచుకున్నారు. లక్ష్యాలను నిర్దేశించేదాకా వేచి ఉండాలని మాకు ఆదేశాలు అందాయి. ఈ ఉగ్రమాడ్యూల్‌కు పథకరచన పాకిస్తాన్‌లో జరిగింది. ఆదేశాలు మాత్రం కశ్మీర్ హ్యాండ్లర్‌ల నుంచే వస్తాయి. మేం గతంలో కశ్మీర్‌లో డాక్టర్‌లుగా పనిచేసిన కాలంలో 2018%–%2021 భద్రతా బలగాలతో పోరాడి గాయపడిన ఉగ్రవాదులకు చికిత్స చేశాం"అని షకీల్, ఆదిల్ పోలీసు విచారణలో వెల్లడించారు.

# బిజినెస్

## 875 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం దిశగా సాగుతున్నాం



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో 875 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించే దిశగా సాగుతున్నామని కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) సనోజ్ కుమార్ ఝా తెలిపారు. గత 2 నెలల్లో కోల్ ఇండియా ఉత్పత్తి లక్ష్యాన్ని చేరని నేపథ్యంలో.. హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ 59వ వ్యవస్థాపక దినోత్సవంలో సనోజ్ ఇలా పేర్కొనడం గమనార్హం. వర్షాల వల్లే గత 2 నెలల్లో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరలేదని వివరించారు. విద్యుదుత్పత్తి యూనిట్ల నుంచి బొగ్గుకు గిరాకీ తగ్గిందన్నారు. పరిశ్రమల అవసరాలకు సరిపడా బొగ్గు సరఫరా చేయగలమని స్పష్టం చేశారు. ఏడాది చివరకు బొగ్గు నిల్వలు చూస్తే, గతేడాది కంటే అధికంగా ఉంటాయని పేర్కొన్నారు.

## ఒలెక్ట్రాకు రూ.49.5 కోట్ల లాభాలు





ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఓజీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 4.2 శాతం వృద్ధితో రూ.49.5 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.47.6 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2025-26 క్యూ2 ఫలితాలకు ఆ కంపెనీ బోర్డు శనివారం ఆమోదం తెలిపింది. ఈ త్రైమాసికంలో ఒలెక్ట్రా రెవెన్యూ 25.4 శాతం పెరిగి రూ.657 కోట్లకు చేరింది. 2024-25 ఇదే త్రైమాసికంలో రూ.524 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. అయితే మార్జిన్లు మాత్రం 15.5 శాతం నుంచి 13.6 శాతానికి తగ్గాయి. గడిచిన క్యూ2లో 375 వాహనాలను డెలివరీ చేసి నూతన మైలు రాయిని సాధించినట్లు ఒలెక్ట్రా తెలిపింది. ఇప్పటివరకు 3254 వాహనాలు డెలివరీ చేయటంతో పాటు 9818 వాహనాల ఆర్డర్ బుక్‌తో భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది వేసుకుంది. 'ఒక త్రైమాసికంలో అత్య ధికంగా 375 ఎలక్ట్రిక్ వాహనాలు, అందులో 25 ఎలక్ట్రిక్ టిప్పర్లు విజయవంతంగా డెలివరీ చేయడం మాకు గర్వ కారణం. ఆపరేషనల్ సామర్థ్యంపై ఫోకస్ పెట్టడం ద్వారా ఆదాయంలో, లాభంలో గణనీయమైన వృద్ధి సాధించాము. భారతదేశంలో తొలిసారిగా బ్లేడ్ బ్యాటరీ ప్యాక్ సర్టిఫికేషన్ సాధించినందుకు సంతోషిస్తున్నాము." అని ఒలెక్ట్రా మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్ బాబు పేర్కొన్నారు.

# పీపీఎఫ్, సుకన్య సమృద్ధి సహా బెస్ట్ పోస్టాఫీస్ స్కీమ్స్




సంప్రదాయ పెట్టుబడిదారులు పెద్దగా రిస్క్ కోరుకోరు. ఎలాంటి రిస్క్ లేకుండా గ్యారెంటీ రిటర్న్స్ అందించే పెట్టుబడి పథకాలను ఎంచుకుంటారు. ఇక్కడ బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పాటు పోస్టాఫీస్ స్మాల్ సేవింగ్స్ స్కీమ్స్ వంటివి ఉంటాయి. ఇక్కడ నిర్దిష్ట పెట్టుబడి ప్రకారం.. నిర్ణీత కాల వ్యవధికి కచ్చితమైన రిటర్న్స్ అందుకోవచ్చు. ఎలాంటి రిస్క్ ఉండదు. చాలా చిన్న మొత్తాల్లో కూడా ఇక్కడ ఇన్వెస్ట్ చేసేందుకు అవకాశం ఉంటుంది. వీటిల్లో వార్షిక ప్రాతిపదికన 7-8 శాతం మధ్య వడ్డీ రేట్లు ఉన్నాయి. వీటిల్లో నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ నుంచి పీపీఎఫ్ (పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్), సుకన్య సమృద్ధి అకౌంట్, సీనియర్ సిటిజెన్స్ సేవింగ్స్ స్కీమ్ వంటివి బాగా ఆదరణ పొందాయి. పీపీఎఫ్- ఇందులో ప్రస్తుతం వడ్డీ రేటు వార్షిక ప్రాతిపదికన 7.10 శాతంగా ఉంది. ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ. 500 నుంచి గరిష్ఠంగా రూ. 1.50 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇక్కడ ఏడాదిలో ఒకేసారి లేదా ఇన్‌స్టాల్‌మెంట్లలో చెల్లించొచ్చు. ఇక్కడ పాత పన్ను విధానంలో ట్రిపుల్ టాక్స్ బెనిఫిట్స్ ఉంటాయి. పెట్టుబడి, వడ్డీ, మెచ్యూరిటీ రాబడిపై టాక్స్ వర్తించదు. వరుసగా 15 ఏళ్లు ఇందులో ఇన్వెస్ట్ చేయాలి. సుకన్య సమృద్ధి యోజన- ఇందులో వడ్డీ రేటు 8.20 శాతంగా ఉంది. కనీసం ఆర్థిక సంవత్సరంలో రూ. 250 నుంచి గరిష్ఠంగా రూ. 1.50 లక్షల వరకు పెట్టొచ్చు. ఇక్కడ కూడా పన్ను ప్రయోజనాలు పొందొచ్చు. ఇది ఆడపిల్లల కోసమే ఉద్దేశించింది. పాప వయసు పదేళ్లలోపే ఇందులో చేరాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా వరుసగా 15 ఏళ్లు డబ్బులు కట్టాలి. కిసాన్ వికాస్ పత్ర- ఇక్కడ వడ్డీ రేటు 7.5 శాతంగా ఉంది. 115 నెలల్లో పెట్టుబడి కచ్చితంగా డబుల్ అవుతుంది. కనీసం రూ. 1000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. గరిష్ఠ పరిమితి లేదు. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ వడ్డీ రేటు 7.50 శాతంగా ఉంది. ఇక్కడ కనీసం రూ. 1000 నుంచి గరిష్ఠంగా రూ. 2 లక్షల వరకు పెట్టుబడి పెట్టొచ్చు. ఇక్కడ టెన్యూర్ 2 సంవత్సరాలుగా ఉంది. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్- ఇందులో వడ్డీ రేటు 7.7 శాతంగా ఉంది. ఇక్కడ కూడా గరిష్ఠ పెట్టుబడి పరిమితి లేదు. ఇక్కడ ఐదేళ్ల టెన్యూర్ ఉంటుంది.నేషనల్ సేవింగ్స్ టైమ్ డిపాజిట్ అకౌంట్- ఇక్కడ వడ్డీ రేట్లు వార్షిక ప్రాతిపదికన 6.9 శాతం నుంచి 7.5 శాతంగా ఉన్నాయి. గరిష్ఠ పెట్టుబడి పరిమితి లేదు. ఇక్కడ 1, 2, 3, 5 సంవత్సరాల పరిమితితో ఉంటాయి. సీనియర్ సిటిజెన్స్ సేవింగ్స్ స్కీమ్ విషయానికి వస్తే వడ్డీ రేట్లు 8.20 శాతంగా ఉన్నాయి. ఇక్కడ కనీసం రూ. 1000 నుంచి గరిష్ఠంగా రూ. 30 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇక్కడ కూడా ఐదేళ్ల పరిమితి ఉంటుంది. నిర్దిష్ట వడ్డీ రేటు ప్రకారం.. ప్రతి 3 నెలలకు ఓసారి వడ్డీ వస్తుంది. 60 ఏళ్లు పైబడిన వారు ఇందులో చేరేందుకు అర్హులు.

# అదానీ చేతికి జైప్రకాశ్ అసోసియేట్స్!




జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్)ను దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా కొనుగోలు చేయడంలో విజయవంతమైన బిడ్డర్‌గా నిలిచే అవకాశం అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌కు ఉందని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. అయిదేళ్లలో చెల్లింపులు చేస్తామని వేదాంత బిడ్ వేయగా.. రెండేళ్లలోనే కొనుగోలు మొత్తాన్ని చెల్లిస్తామనే అదానీ ఆఫర్ మెరుగ్గా ఉందని చెబుతున్నారు. వాస్తవానికి సెప్టెంబరు ప్రారంభంలో, జేఏఎల్ రుణదాతలు నిర్వహించిన వేలంలో రూ.12,505 కోట్ల నికర ప్రస్తుత విలువ (ఎన్‌పీవీ) ఆఫర్‌తో వేదాంతా గ్రూప్ ముందు నిలిచింది. తదుపరి వేదాంతాతో పాటు జేఏఎల్ కోసం పోటీపడిన అదానీ, దాల్మియా సిమెంట్ (భారత్) లిమిటెడ్, జిందాల్ పవర్ లిమిటెడ్, పీఎన్‌సీ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్‌తోనూ రుణదాతలు చర్చలు జరిపి, బిడ్ విలువ పెంచాలని కోరారు. అక్టోబరు 14న ఈ సంస్థలన్నీ సీలు చేసిన కవర్లలో కొత్తగా పరిష్కార ప్రణాళికలు సమర్పించాయి. వీటిపై చర్చించడానికి, సాధ్యాసాధ్యాలు అంచనా వేయడానికి జేఏఎల్ రుణదాతల కమిటీ (సీఓసీ) గత వారం సమావేశమైంది. మూల్యాంకనం తర్వాత అదానీ ఎంటర్‌ప్రైజెస్ పరిష్కార ప్రణాళికకు అత్యధిక స్కోరు ఇచ్చినట్లు సమాచారం. ఆ తర్వాత దాల్మియా సిమెంట్ (భారత్), వేదాంతా లిమిటెడ్ ఈ రేసులో ఉన్నాయని తెలుస్తోంది. వచ్చే రెండు వారాల్లో పరిష్కార ప్రణాళికను సీఓసీ ఓటింగ్‌కు పెట్టే అవకాశాలున్నాయి. రుణదాతలకు రెండేళ్లలోపు చెల్లింపులు చేస్తామని ఆఫర్ ఇచ్చిన అదానీ గ్రూప్, విజయవంతమైన బిడ్డర్‌గా నిలిచే అవకాశం ఉందని తెలుస్తోంది.

# సంజూ అవుట్! రాజస్థాన్ రాయల్స్ కొత్త కెప్టెన్‌గా అతడే!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫ్రాంఛైజీ రాజస్థాన్ రాయల్స్‌తో టీమిండియా స్టార్ సంజూ శాంసన్ బంధం ముగిసినట్లు తెలుస్తోంది. పదకొండు సీజన్లుగా రాజస్థాన్ జట్టుతో కొనసాగిన ఈ కేరళ వికెట్ కీపర్ బ్యాటర్.. కెప్టెన్‌గానూ సేవలు అందించాడు. ఐపీఎల్‌లో మొట్టమొదటి విజేత అయిన రాజస్థాన్‌ను.. పద్నాలుగేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత తన సారథ్యంలో రెండోసారి ఫైనల్ (2022)కు చేర్చాడు సంజూ. అయితే దురదృష్టవశాత్తూ గుజరాత్ టైటాన్స్‌తో ఫైనల్లో ఓడిపోవడంతో రాజస్థాన్‌తో పాటు కెప్టెన్‌గా కప్పు గెలవాలన్న సంజూ ఆశలకు గండిపడింది.

### యాజమాన్యంతో విభేదాలు

కాగా గత కొంతకాలంగా సంజూకు.. రాజస్థాన్ జట్టు యాజమాన్యంతో విభేదాలు తలెత్తినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఐపీఎల్-2026 వేలానికి ముందే ట్రేడింగ్ ద్వారా జట్టు మారేందుకు సంజూ నిశ్చయించుకున్నాడనే ప్రచారం తాజాగా జోరందుకుంది. చెన్నై సూపర్ కింగ్స్ సంజూను రాజస్థాన్ నుంచి ట్రేడింగ్ (స్వాప్ డీల్) ద్వారా దక్కించుకోవడం దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. రవీంద్ర జడేజాను రాజస్థాన్‌కు ఇచ్చి.. అందుకు బదులుగా సంజూను సీఎస్‌కే దక్కించుకోనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఒకవేళ అదే జరిగితే.. రాజస్థాన్ జట్టుకు కొత్త కెప్టెన్ ఎవరనే చర్చ మొదలైంది.

### రియాన్ పరాగ్ కాదు!

కాగా సంజూ గైర్హాజరీలో అస్సాం ఆటగాడు రియాన్ పరాగ్ జట్టును ముందుకు నడిపించాడు. ఐపీఎల్-2025లో సంజూ ఫిట్‌నెస్ సమస్యల వల్ల కెప్టెన్సీని దూరంగా ఉండగా.. పరాగ్ సారథిగా ఏమాత్రం ఆకట్టుకోలేకపోయాడు. ఈసారి రాజస్థాన్ మరీ దారుణంగా పద్నాలుగింట కేవలం నాలుగు మాత్రమే గెలిచి తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఈ నేపథ్యంలో పరాగ్‌కు కెప్టెన్సీ ఇవ్వకపోవచ్చునే అభిప్రాయాలు వ్యక్తం అవుతుండగా... టీమిండియా నయా సంచలనం ధ్రువ్ జురెల్ పేరు తెర మీదకు వచ్చింది.

### కెప్టెన్సీ రేసులో ఇద్దరు

రూ. 20 లక్షల కనీస ధరతో రాజస్థాన్ క్యాంపులోకి వచ్చిన జురెల్ అనతికాలంలోనే.. జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. ఈ క్రమంలోనే అతడిని ఫ్రాంఛైజీ రూ. 14 కోట్ల భారీ మొత్తానికి గతేడాది రిటైన్ చేసుకుంది. గత కొంత కాలంగా అతడు సూపర్‌ఫామ్‌లో ఉన్నాడు. టీమిండియా లోనూ కీలక సభ్యుడిగా మారాడు. అంతేకాదు.. అనధికారిక టెస్టు సిరీస్‌లో భారత్- 'ఎ' జట్టు కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం కూడా జురెల్‌కు ఉంది. అదే విధంగా.. అండర్-19 స్థాయిలో 2020 వరల్డ్‌కప్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్‌గానూ జురెల్ సేవలు అందించాడు. ఇక యూపీ టీ20 లీగ్‌లో గోరఖ్‌పూర్ లయన్స్ జట్టుకు సారథి కూడా జురెలే! ఈ నేపథ్యంలో పరాగ్‌ను కాదని.. మేనేజ్‌మెంట్ జురెల్ వైపే మొగ్గుచూపుతుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అయితే, మరికొందరు విశ్లేషకులు మాత్రం టీమిండియా స్టార్ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కే రాజస్థాన్ పగ్గాలు అప్పగిస్తారనే విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. కాగా 2020లో రాజస్థాన్ తరఫున అరంగేట్రం చేసిన జైస్వాల్.. ఇప్పటికి 66 మ్యాచ్‌లలో కలిపి 2166 పరుగులు సాధించాడు. ఈ లెఫ్టాండర్ ఖాతాలో రెండు సెంచరీలు కూడా ఉన్నాయి. అయితే, 23 ఏళ్ల జైసూకు ఏ స్థాయిలోనూ కెప్టెన్‌గా పనిచేసిన అనుభవం మాత్రం లేదు. అయితే, అతడి అవకాశాలను మాత్రం కొట్టిపడేయలేము.

### రాయల్స్ కొత్త కెప్టెన్‌గా అతడే!

రాజస్థాన్ రాయల్స్ కొత్త హెడ్‌కోచ్ కుమార్ సంగక్కర.. జురెల్‌తో పాటు జైస్వాల్ కెప్టెన్సీ రేసులో ఉన్నాడని చెప్పినట్లు టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం పేర్కొనడం గమనార్హం. అయితే, ఇంపాక్ట్ రూల్ ప్రకారం ఓపెనర్‌గా జైసూకు ప్రత్యామ్నాయం ఉంటుంది. కానీ వికెట్ కీపర్‌గా 24 ఏళ్ల జురెల్ కొనసాగుతాడు! కాబట్టి ప్లేయింగ్ ఎలెవన్‌లో తప్పకుండా ఉంటాడు. అందుకే అతడికే కెప్టెన్సీ చేపట్టే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## ఎవరిపైనా కుట్ర చేయడం లేదు.. డ్రెస్సింగ్ రూమ్‌లో అంతా ఓకే..!




టీ20ల్లో భారత జట్టు బెంచ్ బలం గట్టిగానే ఉన్నా ఆస్ట్రేలియా పర్యటనలో వారిని ఉపయోగించుకోలేదనేది వాస్తవం. వరుసగా విఫలమవుతున్నా సరే వైస్‌కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు, పేసర్ హర్షిత్ రానాకు ఎక్కువ అవకాశాలివ్వడం తీవ్ర దుమారం రేపింది. కోచ్ గౌతం గంభీర్ ఉద్దేశపూర్వకంగానే కొందరికి వంత పాడుతున్నారని, మ్యాచ్ విన్నర్లపై కుట్ర పన్నుతున్నారనే వార్తలు వైరలయ్యాయి. తనను లక్ష్యంగా చేసుకొని వ్యాపిస్తున్న ఈ విమర్శలపై కోచ్ గౌతీ స్పందించాడు. ఆస్ట్రేలియా పర్యటన ముగియడంతో నోరు విప్పిన అతడు.. తాను ఎవరిపైనా కుట్ర పన్నడం లేదని పేర్కొన్నాడు. రాహుల్ ద్రవిడ్ వారసుడిగా భారత కోచ్ పదవికి ఎంపికైన గౌతం గంభీర్ మొదటి నుంచి తన నిర్ణయాలతో వార్తల్లో నిలుస్తున్నాడు. ఆస్ట్రేలియా పర్యటలో తుది జట్టు ఎంపికలో కొందరిపై వివక్ష చూపాడని పలువురు అతడిని దుయ్యబట్టారు. అయితే.. తానేమీ ఉద్దేశపూర్వకంగా కొందరు ఆటగాళ్లను బెంచ్ మీద కూర్చోబెట్టడం లేదని చెబుతున్నాడు గంభీర్. 'స్క్వాడ్‌లో ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉండడం శుభపరిణామం. వాళ్లలో 11 మందినే ఎంపిక చేయడం చాలా కష్టమైన పని. టీమిండియా కోచ్‌గా నేను ఇప్పుడు ఇదే సంకట పరిస్థితి ఎదుర్కొంటున్నా. నాణ్యమైన ఆటగాళ్లతో మా బెంచ్ బలం కూడా ధ్రుఢంగానే ఉంది. ప్రతిఒక్కరు తుది జట్టులో ఆడేందుకు అర్హులే. అయితే.. మ్యాచ్ కోసం పదకొండు మందినే తీసుకోవాల్సి ఉంటుంది. బెస్ట్ కాంబినేషన్ ఆటగాళ్లను ఎంచకోవడం, ఆరోజుకు మ్యాచ్‌ను విజయంతో ముగించడం ఇదే మాకు ముఖ్యం.

# స్పోర్ట్స్

## నా కలల టోర్నీ అదే.. అవకాశమిస్తే రఫ్ఫాడిస్తా..!



టీ20లు అంటేనే చిచ్చరపిడుగుల హవా. ఈ ఫార్మాట్‌లో దంచికొట్టే ఆటగాళ్లు చాలామందే ఉన్నా తానే టాప్ అని చాటుకుంటున్నాడు భారత ఓపెనర్ అభిషేక్ శర్మ ఐపీఎల్ నుంచి ఈ ఏడాది అంతర్జాతీయ మ్యాచ్లలోనూ అదరగొడుతున్న అభి పొట్టి క్రికెట్‌ను ఏలుతున్నాడు. ప్రత్యర్థి ఎవరైనా సరే దంచుడే పరమావధిగా ఆడుతున్న ఈ యంగ్‌స్టర్ నంబర్ 1 ర్యాంక్‌లో తిష్ట వేశాడు. ఆస్ట్రేలియా పర్యటనలో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన అభిషేక్ తన కలల టోర్నీ కోసం ఎదురుచూస్తున్నాని అంటున్నాడు. ఇంతకు అతడి డ్రీమ్ టోర్నీ ఏంటో తెలుసా..? పొట్టి క్రికెట్‌లో భీకర ఫామ్‌తో బౌలర్లకు దడ పుట్టిస్తున్న అభిషేక్ శర్మ ఓపెనర్‌గా స్థిరపడిపోయాడు. మెరుపు బ్యాటింగ్‌తో శుభారంభాలు ఇస్తూ టీమిండియాకు ప్రధాన అస్త్రంగా మారిన అతడు వరల్డ్ కప్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ టోర్నీ కోసం తాను సిద్ధమవుతున్నట్టు చెప్పాడీ సూపర్ స్ట్రయికర్. 'వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్ నా కెరీర్లోనే అతిపెద్ద టోర్నీ కానుంది. చెప్పాలంటే అది నా కలల టోర్నమెంట్. నేను వరల్డ్ కప్ కోసం సిద్ధంగా ఉన్నాను. ఒకవేళ నాకు ఈ మెగా ఈవెంట్‌లో ఆడే అవకాశం వస్తే రఫ్ఫాడిస్తా' అని తన మనసులోని మాట చెప్పేశాడీ డాషింగ్ ఓపెనర్. ఆసియా కప్‌లో 314 రన్స్‌తో చెలరేగిన అభిషేక్.. ఆసీస్ గడ్డపై విధ్వంసక ఆటతో రెచ్చిపోయాడు. అభిషేక్ 28 ఇన్నింగ్స్‌లోనే వెయ్యి పరుగుల క్లబ్‌లో చేరాడు. టీ20ల్లో అత్యంత వేగంగా ఈ మైలురాయికి చేరిన భారత క్రికెటర్‌గా అవతరించాడీ లెఫ్ట్ హ్యాండర్. కంగారూలతో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌లో 163 పరుగులతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడీ డేరింగ్ బ్యాటర్. 200ల స్ట్రయిక్ రేటుతో ఆడుతున్న అభి.. ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే వరల్డ్ కప్ ఆడడం పక్కా అంటున్నారు విశ్లేషకులు. ప్రస్తుతం 925 రేటింగ్ పాయింట్స్‌తో అభిషేక్ టీ20ల్లో నంబర్ 1 ఆటగాడిగా కొనసాగుతున్నాడు.

### భారత్‌లో 5, లంకలో 2

వచ్చే ఏడాది పురుషుల టీ20 ప్రపంప కప్ పోటీలకు భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న విషయం తెలిసిందే. పొట్టి ప్రపంచ కప్ బెర్తులు ఖరారు కావడంతో షెడ్యూల్‌పై కసరత్తు చేస్తోంది ఐసీసీ. మొదటగా వేదికల్ని ఖరారు చేయాలి కాబట్టి.. ఆతిథ్య దేశాలైన భారత్‌లో ఐదు, లంకలోని రెండు నగరాలను ఎంపిక చేసింది ఐసీసీ. అహ్మదాబాద్, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, ముంబై.. శ్రీలంకలో కొలంబో, క్యాండీ సిటీల్లో ప్రపంచ కప్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అహ్మదాబాద్‌లోనే మార్చి 8న ఫైనల్ జరుగనుంది.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

# ఓటీటీలో రూ.100 కోట్ల సినిమా.. ఈ వారంలోనే డ్యూడ్ స్ట్రీమింగ్



దీపావళికి రిలీజైన అన్ని సినిమాలు ఓటీటీ డేట్ ఇచ్చేశాయి. కిరణ్ అబ్బవరం 'కె-ర్యాంప్' నవంబర్ 15న ఆహాలో రిలీజ్ అవుతున్నట్లు ప్రకటించారు. సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా' మూవీ నవంబర్ 14న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలవుతున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇక దీపావళి రేసులో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'డ్యూడ్' సినిమా ఓటీటీ డేట్ మాత్రం అనౌన్స్ చేయకుండా అభిమానులను సస్పెన్స్‌లో ఉంచారు. ఈ వారమే ఓటీటీలో ఈ సస్పెన్స్‌కు తెర దించుతూ ఎట్టకేలకు డ్యూడ్ ఓటీటీ రిలీజ్ డేట్ ప్రకటించారు. నవంబర్ 14న నెట్‌ఫ్లిక్స్‌లో రానుందంటూ ఎక్స్ వేదికగా పోస్టర్ రిలీజ్ చేశారు. తెలుగుతో పాటు తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో డ్యూడ్ అందుబాటులోకి రానుందని వెల్లడించారు. డ్యూడ్ విషయానికి వస్తే.. ప్రదీప్ రంగనాథన్, మమితా బైజు ప్రధాన పాత్రలు పోషించారు. శరత్‌కుమార్ కీలక పాత్రలో నటించగా కీర్తి శ్వరన్ దర్శకుడిగా పరిచయమయ్యాడు. మైత్రీమూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించారు. ఈ సినిమా అక్టోబర్ 17న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కాగా ఈజీగా రూ.100 కోట్లు రాబట్టింది. డ్యూడ్ కథేంటంటే.. గగన్ (ప్రదీప్ రంగనాథన్).. ఆముద (నేహా శెట్టి)ని ప్రేమిస్తాడు. కానీ మరొకరిని పెళ్లి చేసుకుంటుంది. గగన్‌ను అతడి మేనమామ (శరత్ కుమార్) కూతురు కుందన (మమిత బైజు) ప్రేమిస్తుంది. కానీ, ఆమె పెళ్లి ప్రపోజల్‌ను గగన్ రిజెక్ట్ చేస్తాడు. కొంతకాలానికి ఆమెనే పెళ్లాడాలనుకున్న టైమ్‌కు కుందన పార్థు (హృదయ్)తో ప్రేమలో ఉంటుంది. అయినప్పటికీ గగన్-కుందనకే పెళ్లి జరుగుతుంది. వీళ్ల పెళ్లికి కారణమేంటి? తర్వాత కలిసున్నారా? లేదా? అనేది ఓటీటీలో చూసేయండి..



# రవితేజ కొత్త మూవీ సంక్రాంతికి రిలీజ్

గత కొన్నేళ్లుగా హీరో రవితేజ సినిమాలైతే చేస్తున్నాడు గానీ హిట్ అనేది లేకుండా పోయింది. వారం పదిరోజుల క్రితం 'మాస్ జాతర' అంటూ వచ్చాడు. యధావిధిగా ఇది కూడా ఫ్లాప్ అయింది. ఇప్పుడు మరో కొత్త మూవీని సిద్ధం చేశాడు. దీనికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనే టైటిల్ ఫిక్స్ చేయడంతో పాటు గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. నేను శైలజ, ఉన్నది ఒకటే జిందగీ లాంటి సినిమాలతో ఆకట్టుకున్న కిశోర్ తిరుమల.. రవితేజ కొత్త చిత్రానికి దర్శకుడు. గ్లింప్స్ చూస్తుంటే కామెడీగా బాగానే ఉంది. రామసత్యనారాయణ (రవితేజ)ని అతడి జీవితంలోని ఇద్దరు ఆడోళ్లు రెండు ప్రశ్నలు అడుగుతారు. ఇంతకీ ఆ ప్రశ్నలేంటి? వాటికి ఎవరూ ఎందుకు సమాధానం చెప్పలేకపోయారనేదే స్టోరీలా అనిపిస్తుంది. 'నా జీవితంలోని ఇద్దరు ఆడవాళ్లు రెండు ప్రశ్నలు అడిగారు.. సమాధానం కోసం చాలా ప్రయత్నించారు. గూగుల్, చాట్ జీపీటీ, జెమినీ, ఏఐ.. ఇలా అన్నింటినీ అడిగారు. బహుశా వాటికి పెళ్లి కాకపోవడం వల్ల ఆన్సర్ చెప్పలేకపోయాయేమో' అని రవితేజ చెప్పిన డైలాగ్స్ ఫన్నీగా ఉన్నాయి. ఇందులో ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లు. భీమ్స్ సంగీతమందించాడు. వచ్చే సంక్రాంతికి మూవీని థియేటర్లలో రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. గ్లింప్స్ చూస్తుంటే ఈసారి రవితేజ హిట్ కొడతాడేమో అనిపిస్తుంది.

# క్రిస్మస్‌కి థియేటర్లలోకి 'దండోరా'




కలర్ ఫోటో, బెదురులంక 2012 సినిమాలని నిర్మించిన లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ నుంచి వస్తున్న లేటెస్ట్ సినిమా 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. ఈ క్రమంలోనే విడుదల తేదీని ప్రకటించారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబరు 25న మూవీ థియేటర్లలోకి వస్తుందని నిర్మాతలు ప్రకటించారు. అగ్ర వర్ణాలకు చెందిన అమ్మాయిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నా, అగ్ర వర్ణాలకు ఎదురు తిరిగినా ఎలాంటి దౌర్జన్యకాండ జరుగుతున్నాయనే అంశాన్ని ఆధారంగా చేసుకుని 'దండోరా' సినిమా తీశారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో ఆచారాలు, సాంప్రదాయాలను ఆవిష్కరిస్తూ దీన్ని తెరకెక్కించారు. శివాజీతో పాటు నవదీప్, బిందు మాధవి తదితరులు నటించారు. బిందుమాధవి ఇందులో వేశ్య పాత్రలో కనిపించనుంది.



# నవంబర్ మూడో వారం "ది రాజా సాబ్" రిలీజ్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న హారర్-కామెడీ "ది రాజా సాబ్" చిత్రం పై అంచనాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఈ సినిమా నుండి ఫస్ట్ సింగిల్ ఎప్పుడు వస్తుందన్న దానిపై అభిమానుల మధ్య పెద్ద చర్చ జరుగుతోంది. దీనిపై చివరికి నిర్మాత ఎస్‌కేఎన్ స్పందించి క్లారిటీ ఇచ్చారు. ఎస్‌కేఎన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఫస్ట్ సింగిల్ విడుదలలో ఆలస్యం రావడానికి కారణం ఉత్తర భారత, తెలుగు మార్కెటింగ్ టీమ్‌ల మధ్య చర్చలు అని చెప్పారు. మొదటగా 'రెబెల్ సాబ్' అనే ఎనర్జిటిక్ సాంగ్‌ను ముందుగా విడుదల చేయాలని అనుకున్నా, ఉత్తర భారత పంపిణీదారులు మాత్రం ముందుగా మెలోడి సాంగ్ రిలీజ్ చేయాలని సూచించారని తెలిపారు. ఈ భిన్నాభిప్రాయాల వల్లే చిన్న ఆలస్యం జరిగిందని అన్నారు. దక్షిణ భారత మార్కెట్లో సాధారణంగా లిరికల్ వీడియోలు మాత్రమే రిలీజ్ చేసి, పూర్తి సాంగ్ వీడియోలను థియేటర్స్‌లో చూపిస్తారని, కానీ ఉత్తర భారత మార్కెట్లో మాత్రం పూర్తి వీడియో సాంగ్స్ ముందుగానే విడుదల చేస్తారని ఎస్‌కేఎన్ వివరించారు. ఇందుకే ఆలస్యం జరిగుతుందని తెలియజేశారు. "ది రాజా సాబ్"లో ఐటెమ్ సాంగ్ ఉండదని, అయితే ఒక పాపులర్ హిందీ సాంగ్‌ను రీమిక్స్ వెర్షన్‌గా తీస్తున్నామని నిర్మాత తెలిపారు. ప్రతి సాంగ్ రిలీజ్ మధ్య 10%-%14 రోజుల గ్యాప్ ఇస్తారని, ఇలా చేయడం వల్ల ప్రేక్షకులు ప్రతి సాంగ్‌ను మంచి మ్యూజిక్ అనుభవంతో ఆస్వాదించగలరని చెప్పారు. ఎస్‌కేఎన్ ప్రకారం, ఫస్ట్ సింగిల్ నవంబర్ మూడో లేదా నాలుగో వారంలో విడుదల కానుంది. ఆ తర్వాత సినిమా ప్రమోషన్లు డిసెంబర్ చివరి వరకు కొనసాగుతాయి. ఈ క్రమంలో "ది రాజా సాబ్" ను 2026 జనవరి 9న, సంక్రాంతి సీజన్‌లో గ్రాండ్‌గా రిలీజ్ చేయడానికి టీమ్ సన్నాహాలు చేస్తోంది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. మొత్తానికి, "ది రాజా సాబ్" ఫస్ట్ సింగిల్‌పై ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. నిర్మాత ఎస్‌కేఎన్ ఇచ్చిన తాజా అప్‌డేట్‌తో అభిమానులు ఊరట చెందారు. మెలోడి సాంగ్ రూపంలో రాబోయే ఈ ఫస్ట్ సింగిల్, ప్రభాస్ మ్యూజిక్ జర్నీకి కొత్త ఛాప్టర్‌గా నిలిచే అవకాశముంది.




# రొమాంటిక్‌గా శర్వానంద్ బైకర్ లుక్.. లాంచ్ టైం ఫిక్స్

అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ నటిస్తున్న చిత్రం బైకర్ శర్వా36 ప్రాజెక్టుగా వహిస్తున్న ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తోంది. మీరు బైకర్ స్పీడ్ ఎలా ఉందో చూశారు. ఇక ఇప్పుడు హ్యాపీ మెలోడీ టైం వచ్చేసిందంటూ.. ఫస్ట్ సింగిల్ ప్రోమో అప్‌డేట్ లుక్ విడుదల చేశారు. హెల్మెట్ పెట్టుకున్న హీరోయిన్‌తో రొమాంటిక్ మూడ్‌లో ఉన్న శర్వానంద్ స్టిల్ సాంగ్‌పై క్యూరియాసిటీ పెంచుతోంది. ఈ పాట ప్రోమోను నవంబర్ 11న లాంచ్ చేయనున్నట్టు ప్రకటించారు. గిబ్రాన్ మ్యాజికల్ ఆల్బమ్‌ను రెడీ చేస్తున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది. ఇప్పటికే విడుదల చేసిన గ్లింప్స్.. ఇక్కడ ప్రతీ బైకర్‌కు ఓ కథ ఉంటుంది. సమయంతో పోరాడే కథ.. చావుకు ఎదురెళ్లే కథ.. అంటూ సాగే వాయిస్‌తో ఓవర్‌తో మొదలైన గ్లింప్స్ బైక్ రేసుతో సాగుతుంది. ఏం జరిగినా పట్టువదలని మొండోళ్ల కథ అంటూ బైక్ రేసింగ్ థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు హింట్ ఇచ్చేస్తుంది. మీ హెల్మెట్లను పట్టుకోండి.. రైడ్ వైల్డ్‌గా ఉండబోతుంది.. గూస్‌బంప్స్ తెప్పించే అడ్వెంచరస్ రైడ్‌కు సిద్దంగా ఉండండి.. అంటూ శర్వానంద్ టీం ఇప్పటికే బైకర్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేస్తుంది. ఈ సినిమాను యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో వంశీ కృష్ణారెడ్డి, ఉప్పలపాటి ప్రమోద్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. బైకర్‌లో డాక్టర్ రాజశేఖర్ శర్వానంద్ తండ్రి పాత్రలో కనిపించనుండగా బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి గిబ్రాన్ సంగీతం అందిస్తున్నాడు.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com